(8)

# ది యునైటెడ్ ఇండియా లైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : మదరాసు. 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పండ్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి; మంచిబోనసులతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.

## గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా ?

## నిజముగ జరిగిన సంగతి

వైద్యపరీక్ష లేదు. స్త్రీపురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్థాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు.

## ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి : ౨౨, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4. ట్యూటికొరిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్ట్సు.

# విషయసూచిక


౧. పారాణి ... ౧౫౩
—ఊటుకూరు సత్యనారాయణరావు

౨. 'ఇక నాలుగురోజులపాటు బ్రతుకనిస్తే'... ౧౫౪
—కలపటపు రామగోపాలరావు, బి. ఏ.

3. బుఱ్ఱా బుచ్చన్న ... ౧౬౨
—ధేరం వేంకటనాథశాస్త్రి, బి. ఏ., బి. ఇడి.

౪. పడమటిసీమ కవులకథలు ... ౧౬౭
—మున్నంగి శర్మ

౫. "భ్రమ" ... ౧౬౯
—మల్లాది వేంకటకృష్ణశర్మ

౬. నిరీక్షణము ... ౧౬౯
—ద్రోణంరాజు నరసింహారావు

౭. మూడు ప్రశ్నలు ... ౧౭౦
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం. ఏ.

౮. విషాదచ్ఛాయలు ... ౧౭౩
—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

౯. మహాకావ్యరచన: ఖండకావ్యరచన... ౧౭౫
—రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౧౦. ప్రాతినిధిక ప్రభుత్వము ... ౧౭౬
—రాంపల్లి విశ్వేశ్వరరావు, బి.ఏ. (ఆనర్సు)

౧౧. మీరును అంటరానివారేనా? ... ౧౭౯

౧౨. జిజ్ఞాస: మీమాంస ... ౧౮౦

౧3. అల్బర్టు వాల్టర్ గామాజి ... ౧౮౨

౧౪. గ్రంథాలయములు: నిషిద్ధగ్రంథములు... ౧౮౮
—ఊ. వెం. శ్రేష్ఠి

౧౫. తేనెటీగలు ... ౧౯౦
—బాగు గోపాలరావు

౧౬. ముక్తిమార్గం ... ౧౯౪
—"చలం"

౧౭. భ్రాంతులు—కలలు ... ౧౯౭
—పి. యస్. ఆచార్య, బి. ఏ.

౧౮. హృదయార్పిక ... ౧౯౯
—ఓ. లేటి సీతారామమూర్తి

౧౯. మహిళాలోకము: గృహాలంకరణము... ౨౦౦
—వెంకటలక్ష్మమ్మ

౨౦. భగ్నజీవి ... ౨౦౧
—వఝల కాళిదాసు

౨౧. లజ్జా సఖి! ... ౨౦౨
—పెమ్మరాజు రాజగోపాలము, బి. ఏ.

౨౨ నా ఫోటో! ... ౨౦3

౨3. మిథ్యేకదా? ... ౨౦౬
—తురగా వేంకటరామయ్య

౨౪. వివాహము ... ౨౦౭
—సారంగు లక్ష్మీనరసింహారావు బి. ఏ.

౨౫. భిక్షమెత్తుకో ... ౨౦౯
—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

౨౬. శారదా విజయము ... ౨౧3
—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు బి. ఏ.

౨౭. మణిమాల ... ౨౧౫

౨౮. ఆరోగ్యవిజ్ఞానము ... ౨౧౭

౨౯. జీవితభీమా: కొన్ని ఆలోచనలు ... ౨౧౮
—జమిలి నమ్మాళ్వారు

30. సంపాదకీయసమాలోచన ... ౨౨౦



నొప్పుల నివారించుటలో

బుడ్డి వెల 0-5-0.

హనుమాన్ పెయిన్ బామ్ను గూర్చి




మదరాసు 61. నారాయణమొదలి వీధిలోనుండే సుప్రసిద్ధ ఫిజీషియనులు సర్జనులు అయిన

డాక్టరు

వి. చంద్రశేఖరగుప్తగారు

ఇట్లు చెప్పుచున్నారు: "హనుమాన్ పెయిన్ బామ్ను నేను వాడి చూచియున్నాను. తలనొప్పి, నడుమునొప్పి మొదలగు వానియందు అది చాల అమోఘముగ పనిచేసినది."

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: 1. నిజాము రాష్ట్రమునకు శ్రీయుత కాలేరు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు,

2. పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటరు, శ్రీరామకృష్ణా ట్రేడింగుకంపెనీ, నరసారావుపేట.

3. శ్రీ కృష్ణా అడ్వర్టయిజింగు కంపెనీ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరిజిల్లా.

ఏజెంట్లులేని తావులయందు ఏజెంట్లు కావలెను. మంచి కమీషను ఈయబడును.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :— మ-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును.

## ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు, 2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును, 3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు, 4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి, 5. పట్టాదారులకు ఋణము లియ్యబడును, 6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును, 7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును, 8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జనన భీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

## ఆంధ్రప్రావిడెంటు కంపెనీ, గాంధినగర్, బెజవాడ.

## ఇంద్రజాల మహేంద్రజాలము

ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము, ఆంగ్లఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్లపేక తమాషాలు, వినోదవిద్యలు మనుష్యుని మాయముచేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధి యగుట, శరీరము లేని తలచేత మాట్లాడించుట, గాలిలో మనుష్యుని నిలుపుట, మొదలగు విచిత్రము లున్నవి. దీనిచే మేజిక్ చేయగలరు. వెల రు 4.

**చమత్కార గణితము:**—(అపూర్వము) ఇందులో విచిత్ర వినోదమనోగణితములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తి తమాషాలెక్కలు, గణితావధానముగలవు. దీనిని చదివిన తెలివికలుగును. వెల రు. 1.

వలయువారు :— వి. ఆర్. జనార్దనంనాయుడు, ఒంగోలు, (గుంటూరుజిల్లా) అని వ్రాయుడు.

## నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మాకార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొనవచ్చును.

— ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్‌వీధి, శికిందరాబాదు.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతమగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 3 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మిత వ్యయము, నిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేకసౌకర్యములు గలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసుపంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లుకావలెను.

వివరములకు :—

య. మంగయ్య, బి.ఎ, బి.ఎల్.,

కార్యదర్శి.

"ఆంధ్రభూమి"



శ్రీ యుత

తాత కృష్ణమూర్తిగారు బి. ఏ, యల్. టి.



సవితాదేవి

# పారాణి

✣

ఎవరికి గుచించు ఈ వెఱ్ఱిహృదయమొకటె
బ్రతుకుబ్రతుకెల్ల శూన్యమార్గములఁ నేని
శీధపుఁ దమస్సులొగ్రమ్మ చెదరిపోయి
కరగి కన్నీరుగానయి కాల్వగట్టి
వనరు చీంసలోకాల పథములన్ని
మలకలై, పొంగి, పారి, త్వన్మధురమూర్తి
నరసికోలేక శోషిల్లి అంతరించు
నేమొ దేవి! యీలోన నీమృదులదివ్య
పాదముల గడిగికొనుము ; మత్ప్రణయహృదయ
రక్తము తెరల్చికూర్తు పారాణి నీకు.

✣

—ఊటుకూరు సత్యనారాయణరావు.

# "ఇక నాలుగురోజుల పాటు బ్రతుకనిస్తే"

౧

వసంతాడ దక్షిణ పొలాలవేపు పోయే పుంతలో—ఒకనాటి ప్రాతఃకాలసమయాన్ని—

అప్పుడప్పుడే తెలతెలవారుతోంది. రాత్రి అంతా విచ్చలవిడిగా సంచరించినస్థలం అవడంచేత వదలలేక వదలలేక, మామిడితోపుల్లోనూ, ఈతదుప్పల్లోనూ తక్కుతూ, తారుతూ 'పరభూమి, తప్పనిసరి' అన్నట్టుగా చల్లచల్లగా జారుతున్నాయి చీకట్లు.

గ్రామమునసబు అన్నగారు, పాపయ్య—నోట చుట్ట, చేత చెంబు గా—నడచివస్తున్నాడు. దాదాపు నలభైవయస్సు; ఉన్నతవిగ్రహం; బలిష్ఠమైనదేహం—అంతా మూడుమూర్తులా పల్లెటూరి పంటకాపని చాటుతున్నతీరు. కాని, ఆలోచనసూచించే ఆ అధోవదనం, మందగమనం—అన్నిటినీ మించిన ఆ నేత్రాలు—ఇవి మాత్రం ఆవ్యక్తి సాధారణతరహావాడు కాదని నొక్కి చెబుతున్నాయి.

పురుషసంతతి లేకపోవడంచేత, తమ్ముడు కొడుకులంటే పాపయ్యకి ప్రేమాదరణలెక్కువ. కాని, రెండేళ్ళక్రితం కామయ్య తన అన్నగారితో కలహించి తన యింటి కుక్కకూడా ఆగుమ్మం తొక్కకూడదని శాసించినప్పటినుంచీ, అన్యోన్యం తగ్గజొచ్చింది.

కామయ్య స్వతహాముక్కోపి; ఎల్లాగైనా తన మాట చెల్లితీరాలనే పంతగొంటిరకం; అన్నగారికంటె కొంచెం స్థితిపరుడు. ఇన్నిలక్షణాలున్న తర్వాత గ్రహాలకేం లోటుంటుంది గనక? అతడు నాయకుడుగానూ, అతని మేనల్లుడు రమణయ్య ఉపనాయకుడుగానూ, ఆ గ్రామపరిపాలనకి పూనుకున్న ఒక పెద్ద పార్టీయే ఏర్పడింది!

దొంగనోట్లు సృష్టించి, లోకువైనవాడికొంప కూల్చడం మొదలు, కమీషను పద్ధతిమీద 'ఎలక్షన్ల'కి పనిచెయ్యడం వరకూగల వెయ్యిన్నొక్క కార్యావళీ ఆ 'పార్టీ ప్రోగ్రాం'లో గర్భీభూతమై ఉంది. ఐతేనేం, పైకందరూ పెద్దమనుష్యులు—అదీగాక, సంపద, మునసబీ! న్యాయదేవత నిశితబల్లెం చిరుగుపాతరాయళ్ళని చొరుచుకుపోయినా, బంగారు కవచాలు తాకలేక వంగి ఊరుకుంటుందిగా?

ఇటువంటిదే ఒక వ్యవహారం పాపయ్య ఎరుకనే జరిగింది; అతని సహాయంకూడా కోరబడింది, అది వెల్లడికాకుండా ఉంచడానికి. 'తగదుస్మా ఇటువంటి పనుల'ని తమ్ముణ్ణి మందలించి, బయలు పెడతానని బెదరించడమే పాపయ్యచేసిన మహాపాపం. ఆనాటినించి కక్షపెరుగుతూనేఉంది కామయ్యమనస్సులో. ఏదో బహిరంగకారణం దొరకగానే అదే బద్ధవైరంగా పరిణమించింది.

మొదటిరోజుల్లో పౌరుషానికి కట్టుబడి పంతంగానే నడిచాడు పాపయ్యకూడా. కాని, రాను రాను, కాలంతోబాటు అతనివైరంకూడా క్షీణించింది. అదీగాక, మొదటినించీ ఆపిల్లల్ని చేరదీయడానికి అలవాటుపడ్డగుండేమో, వాళ్ళరాకపోకలు పూర్తిగా కట్టుపడిపోవడంవల్ల, అతనిమనస్సులో ఏదో బెగులుగా ఉండేది. ఎల్లాగైనా, రెండుకుటుంబాలకీ మళ్ళీ పొత్తుకుదరాలని రాత్రింబగళ్ళు చింతిస్తూండేవాడు పాపం! ఐతేనేం? కామయ్య ధూకుడుమాత్రం తగ్గలేదు. 'ఆట్టే కబుర్లు చెబితే, మా చినమామయ్య సత్తా చూబిస్తాడ'నినలుగురైదుగురి దగ్గిర కొంచెం ధాటీగానే మాట్లాడాడట కూడాను, గ్రహాల ఉపనాయకుడు, రమణయ్య.

తమ్ముడిమాట ఎల్లావున్నా, ఈ రమణయ్యంటే మాత్రం పాపయ్యకి ఒళ్ళుమంట. మొట్టమొదట, అకారణంగా, అతనిమొహం చూడ్డంతోటే వైషమ్యభావం ఏర్పడినా, రానురాను కారణజాలం సమకూడి అది బలపడింది.

ఇరవైఐదేళ్ళు పైబడిన రమణయ్యకింకా పెళ్ళిలేదు; ఇంగితజ్ఞానం లేదు. ఎంత మబ్బురోజునైనా, ఆకుపచ్చరంగు కళ్ళజోడొకటి తగిలించుకుని తయారౌతాడు, మాటిమాటికీ 'ఉందో? పోయిందో?' అన్నట్టుగా క్రాపింగు సరిజూసుకుంటూ—'ఈ భూప్రపంచక

మంతా మన ఇచ్ఛాధీనం' అన్నంత శీవిగా. పోనీ, ఈభేషజం వేషంతోటీ, లోపల అనుకోడంతోటీ ఆగుతే బాగుండేది: అల్లా కాకుండా, ఆ అభిప్రాయ ప్రకారం ప్రవర్తిద్దామనుకునే సరికి చిక్కులొచ్చాయి. చిక్కులేమిటి? ప్రాణమ్మీదికే వచ్చింది!

ఆరూపవైభవానికి తోడు తానొక పెద్ద అందగాడని రమణయ్య కోగట్టినమ్మకం. కాని. ఈరసికుణ్ణి తగురీతిని ఆదరించి, నెత్తినున్న టోపీ తిరగేసి చేతబట్టుకునేటట్టు చెయ్యడానికి ఆగ్రామంలో వారస్త్రీలెవ్వరూ లేకపోవడంచేత, తులానికీ, రెండుతులాలకీ, అందుబాటులో ఉండేవారిదగ్గిర తన ప్రజ్ఞ ప్రయోగించాడు: రెండుమూడుచోట్ల నిరాటంకంగా సాగడంచేత 'అందరూ ఇంతే; మనప్రభ!' అనుకున్నాడు.

మేనమామకి ఆసరా అయి చేసే దుర్మార్గాల సంగతేగాని, వాటికితోడు ఈలక్షణంకూడా రమణయ్యకు ఉన్నట్టు పాపయ్య ఎరగడు. ఐనా, ఈనూతనకార్యక్రమం ప్రారంభించింది కూడా ఆరునెలల ఈమధ్యనే!— కాలకర్మాలు సమకూడితేనేగాని దుష్టశీలానికి పరిపూర్ణత్వం సిద్ధించదుగా మరి?

కామయ్యకూతురి వివాహవిషయంలో, పెద్ద మేనమామ అభిప్రాయం తనకి పూర్తిగా వ్యతిరేకించి ఉండడంచేత, దైవికంగా ఏర్పడిన ఈకుటుంబవైరం పెంచడంలో రమణయ్య తనశక్తి వంచనలేకుండా చిన్న మేనమామ చెవిని ఇల్లుగట్టుకుని పోరుతూండేవాడు. పరిస్థితులు గమనిస్తే, కృతకృత్యుడయ్యాడనే చెప్పవచ్చు, వెళ్ళినంతమట్టుకు.

కాని, ఆప్రయత్నం తాననుకున్నంతదూరం వెళ్ళకుండానే అవతారం చాలించాలిసొచ్చిం దానవమన్మథుడు. పదిహేనురోజుల క్రితం—ఒకనాటి సాయంకాలం - పాలంపాకలో - వెట్టి వెంకడి ఈతకత్తికి గురైనాడు!

హత్యానంతరం వెతకగా, పెట్టిబళ్ళకోసం అప్పు తెచ్చి జేబులోపెట్టుకున్న (ప్రకటించబడిన ఉద్దేశ్యం అది-) రు 50-లు, కనిపించలేదుట. అవి వెంకడే హరించాడనీ, అందుకే హత్యచేసాడని నిర్ధారణచేసారు అందరూకూడా. కాని, విచిత్రం ఏమిటంటే వెంటనే వెంకణ్ణిపట్టుకుని, ఇల్లంతా సోదాచేసినా, ఏభై రూపాయలు కాదుగదా, ఏభై కానలుకూడా దొరకలేదుట! పోనీ ఎక్కడేనా దాచాడేమోనంటే, పుంతలో పరుగెత్తుతుండగానే వాణ్ణి పట్టుకున్నారుట! (ఐతే, ఇల్లు సోదాచెయ్యడం ఎందుకో?— 'రూల్సు' అల్లా ఉన్నాయిగాబోలు!)

పుంతగట్టున నడచిపోతున్న పాపయ్యమనస్సును కలవలపెడుతున్న దీహత్యావిషయమే! తమ్ముడు కూతురి పెళ్ళివిషయంలో ఇది దైవికనిర్ణయమని, ఒకొక్కప్పుడు సంతోషించినా, 'పాపం, ఇంకా ఏ ముచ్చటా తీరలేదే!' అని విచారించాడు చాలా. రమణయ్య వర్తనానికీ, కుటుంబవైరాలు పెంచడంలో అతని దుర్మార్గాలకీ, కొంచెం కక్షుమనిషి ఎవడూ సానుభూతిచూపగల ఘటంకాదది. కాని, పాపయ్య స్వభావంవేరు! అల్పత్వానికీ, కులవివక్షతలకీకూడ అతీతమైనది అతని మానవప్రేమతత్వం!

వార్తాపత్రికలద్వారా తన అల్పజ్ఞానాన్ని అభివృద్ధిచేసుకున్న పాపయ్యకి వెంకడు దోషిఅనేభావం స్థిరపడటంలేదు. వాడి పూర్వప్రవర్తన బాగాతెలుసును—ఒకరిజోలీ సొంటీలేకుండా తలొంచుకుని తన దారినిపోయే స్వభావంవాడిది; పోలీసువారి నిర్హేతుక జాయమానకటాక్షప్రభలు లోకువైన ప్రజలమీద ప్రసరిస్తుండే ఈ రోజుల్లోకూడా 'కె. డి. లిస్టు'లో పడకుండా ఉన్నాడంటే సామాన్యవిషయంకాదు. అటువంటివాడు, ఒక్కసారిగా హంతకుడైపోతాడా? పోనీ, దోషి కాదంటే పాకదగ్గిరనుంచి పరుగెడుతూ పట్టుబడ్డాడే ఒళ్ళంతా నెత్తురుచుక్కలతో! హంతకుడు వాడేఐతే, ఉద్దేశ్యం? ధనాపహరణమా?— డబ్బు దొరకలేదే?—ఐనా, అంత స్వల్పంకోసం, అటువంటివాడు, నిండుప్రాణాన్ని—

పాపయ్యయోచన హఠాత్తుగా నిలిచిపోయింది, అతని నడకతోకూడా. ఏదో మూలుగు చెవినిబడడంచేత తలెత్తిచూసాడు—బాటకి కొంచెంప్రక్కగా, ఫాలభాగంమీదా, చేతులమీదా, గడ్డకట్టిన గాయపునెత్తురుతో ఒకస్త్రీ పడుంది. పరికించిచూచాడు—చాలా

సార్థ ఊడ్పురోజుల్లో కూలికొచ్చింది—వెట్టివెంకడి భార్య—వెంకి!

పాపయ్య ఒక్కనిముషం దిగాలుపడి నిలిచిపోయాడు—కాని, ఒక్కనిముషమే ఆస్థితి. వెన్వెంటనే, తన చెంబులోని శీతలోదకంచేత ఆ దుఃఖజీవిని సేదదేర్చి, పైనున్న తుండుగుడ్డ తడిపి గడ్డకట్టిననెత్తురు నెమ్మదిగా తుడిచి చూసాడు గాయాలంత బలమైనవి కావు—ఒక్క నిట్టూర్పువిడిచాడు పాపయ్య!

మొదట్లో అతి బరువుగానున్న కనురెప్పలు తేలికయాయి; మందంగా ఉన్నదృష్టి మళ్ళీ చంచలమయింది; వెంకికి పరిస్థితులుగ్రహించే జ్ఞానంకలిగింది. పాపయ్యని తేరిపారచూచి, చటాలునలేచి తప్పుకోబోయింది; కాని, పాపం, బలహీనతచేత మళ్ళీ ఒరిగిపోయింది వెంకి! పాపయ్య రెండుచేతులతోనూ ఆపకపోతే శిరస్సు నేలకితగిలి, గాయాలు తిరిగి నెత్తురుజిమ్మేవే!

పాపయ్యకి అర్థమైంది ఆ ప్రయత్నం—

అతని కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి!

ప్రతిమానవహృదయంలోనూ గర్భీభూతమైయుండే నిర్మలప్రేమతత్వానికీ, భౌతికజీవితాన్నిశాసించే సంఘతత్వానికీ, ఒక్కనిముషం సంఘర్షణ!—

'వెంకీ! ఎందుకిల్లా—తటస్థించింది!—లేవకు—'

'బాబుగారూ!—కడుపుమంట!—పిల్లలకి గంజిలేదు—రెండురోజులమట్టి—మారుదిక్కు లేదు, బాబూ, మామ అల్లాపోయింతర్వాత—జ్వరం—కూలికి బయలుదేరాను—కళ్ళుతిరిగి—'

"అబ్బా!" అన్నాడు పాపయ్య. ఏమి నిశ్చయించుకున్నాడో!

## ౨

"...గ్రామకాపురస్థుడైన వెట్టివెంకడే, ధనాపహరణోద్దేశంతో యీ ఖూనీచేసాడని రుజువయింది. అందుచేత న్యాయశాస్త్రానుసారంగా ఆ వెట్టివెంకడు, చనిపోయేవరకూ ఉరితీయబడాలని తీర్పుచెబుతున్నాను"—అని న్యాయాధిపతి ముగించాడు, జేబురుమాలుతో పెదవులు తుడుచుకుంటూ.

పిదప, కోర్టువారు 'లంచి'కి లేచారు. బెంచిగుమాస్తా ప్రక్కగదిలోఉన్న తన విరుగుడుకుర్చీ జేరి రికార్డు సర్దుకుంటున్నాడు. ఆ ఘడియవరకు వంచినతల యెత్తకుండా కలాలు ఆడించిఉండడంచేత, అతని తోడివారుకూడా అదనులభించగానే యిష్టాగోష్ఠి ప్రారంభించారు, కాఫీకి తయారౌతూనే. ఇన్నెందుకు? ఆకోర్టు పుట్టిన ఘడియమొదలు యీ రోజువరకు, మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతాల్లో ఎల్లావుందో, అల్లాగేవుంది ఈ నాడుకూడా. దైనికచర్య మారలేదు కించెత్తుకూడా.

వెట్టివెంకడికి విధించబడిన మరణదండన సహితం ఆ 'రొటీను'లోనే జమయిపోయింది. మానవసామర్థ్యానికి అతీతమైన ఒక మానవజీవితం. ఆనాడు—ఆ హాలులో—ఆ పంకాక్రింద—జరిగిన ఒక మానవనిర్ణయం చేత తుదముట్టబోతోందనే విచారం వాళ్ళకెవళ్ళకీ ఉన్నట్టుతోచదు. ఆ నిర్భాగ్యుడా గేరానికి ఎంతవరకు బాధ్యుడో, ఆ పరిస్థితులేలాంటివో, అని సానుభూతిపూర్వకంగా యోచింప యత్నించిన హృదయం వాళ్ళలో ఒకరికేనా ఉన్నట్టుకనిపించదు. ఎల్లావుంటుంది?— తెల్లారితేస్తే ఇల్లాంటి వెన్ని తీర్పులో! రోజూ ఎక్కడ విచారించగలరు? ఐనా, వాళ్ళ జీతాలేమిటో, వాళ్ళ ప్రమోషను లేమిటో, ఆ గొడవే వాళ్ళదిగాని, యివన్నీ ఆలోచించడానికి తీరికెక్కడ? అందులోనూ, వెట్టివాడు—చేసేవుంటాడు—తలకి తల—శాస్త్రవిహితం—శిక్ష న్యాయమే!

కష్టాలూ, నీలాపనిందలూకూడా లక్ష్యపెట్టకుండా, కేవలం దిక్కులేని ఒక కుటుంబాన్ని నిలపాలనే ఉద్దేశ్యంతో, యింతవరకు వెనుకంజవెయ్యకుండా సహాయం చేసిన పాపయ్య కానాటినిర్ణయం అశనిపాతమయింది.

అక్కడేఉన్న కామయ్య 'జడ్జిమెంటు' వినడంతోటే అన్నగారికేసిచూసి వికారమైన మందహాసం చేసాడు. అతనిదృష్టిలో వెంకడు ఒకపావిక—సాధనం. అన్నగారికి ఊపిరాడకుండాజేసి కుటుంబవైరం తనకి సుఖాంతంచేసుకోడం సాధ్యలక్ష్యం. అందుచేతే, పాపయ్య అప్పుతెచ్చిన డబ్బుతో న్యాయవాదిని నియోగించి దీనసంరక్షణార్థం నడుం కట్టాడనడంతోటే, తోకత్రొక్కిన తాచులా మండిపడ్డాడు;

'చూసారా, ఎల్లా వైరం సాధించచూస్తున్నాడో!' అని నలుగురిలోనూ తూలనాడిపోసాడు ; ఎటువంటి దుర్మార్గానికేనా వెనుదీయకుండా ఈ విషయంలో అంతు తేల్చుకోవాలని నిశ్చయించుకున్నాడు.

కాని, పాపం, పాపయ్య మనస్సులో ఇటువంటి యోచనేలేదని భగవంతుడెరుగును. నిరాధారస్థితిలో-- పూటకి గతిలేకుండా—నికృష్టావస్థలో—తన కంట బడిన బీదకుటుంబం ;—తనచేతనైనది చెయ్యడం—వెంకడికి ఉరితప్పడం—ఆ కుటుంబం మళ్ళీ కోలుకొని ప్రపంచకంలో బువ్వపోరాటంలో నిలవగలగడం—ఇల్లాగే పోయింది ఎంతసేపూ అతని దృష్టి !

అన్నిటికన్నా ఎక్కువది, లోకంలోకల్లా ఒక వ్యక్తి దృష్టిలో ముఖ్యతమమైన సమస్య, నాడు ఆ కోర్టుహాలులో పరిష్కరించబడింది. ఆ సమస్యానిర్ణయంతో ఆ వ్యక్తి భావిజీవితసౌఖ్యాసౌఖ్యాలు ముడిపెట్టబడి ఉన్నాయి. కాని, ఆ నిర్ణయంలో పాల్గొనడానికి ఆస్త్రీ అసమర్థురాలు—పరిస్థితులు !

3

సాయంకాలం ఏడుగంటలు కావచ్చింది. తరుణకాంతులీనే విద్యుద్దీపప్రభలతో, హిమకరుణ్ణి ఇంట గట్టుకున్నారా ? అన్నట్టుంది ఆవైద్యాలయం, దూరాన్నించి చూసేవారికి. కాని లోపల ? ఎన్నిజీవులు మరణోన్ముఖంగా పరితాపపడుతున్నారో ! ఇంకెన్ని వేదన భరించలేక మృత్యువు నాహ్వానిస్తున్నారో !

బీదల వార్డులో, ఒకమూల, వివిధరకాల రోగుల మధ్య, తీవ్రజ్వరపీడితయై పడుంది వెంకి !

ప్రక్కనే మ్లానవదనంతో నిలుచున్నాడు, ఆనిర్భాగ్యురాలి పాలిటికి దైవప్రాయుడైన పాపయ్య.

పాపయ్య !

గుర్తుపట్టకుండా మారిపోయాడు—తమ్ముడు దురభిప్రాయపడి, దురభిమానంతో తనని బద్ధవిరోధిగా పరిగణించడం - ఆతనికక్షు సర్వతోముఖంగా విజృంభించడం - లోకంకూడా తన ఆశయాలు అర్థంచేసుకోక నిందించడం - ఇన్ని కష్టాలకీ లక్షించకుండా ధర్మం నెరవేరుస్తున్నాననే ఒక వెఱ్ఱి ఆవేశంతో, తన శక్తి వంచనలేకుండా యత్నించినా, విధి తనకెదురు తిరిగి వెంకడికి ఉరిశిక్షపడటం—కొన్ని రోజులనుంచి అతనికి మనశ్శాంతి అనేది లేకుండా వేధించి, వేధించి, అకాలవార్ధక్యాన్ని ఆపాదించిన ఈపరిస్థితులే - ఈ పూర్వాపరసందర్భాలే - ప్రస్తుతం పాపయ్య మనోఫలకంమీద 'సినీమాఫిలుము'లాగు అతివేగంగా దొర్లిపోతున్నాయి.

"అయ్యో ! నా కాకక్షసాధించే ఉద్దేశ్యమేలేదే, నన్ను బాగాఎరుగున్నవాళ్ళుకూడా నమ్మకుండా 'ఇంతవైరమా ?' అని నిందిస్తున్నారే!" అనే పాపయ్య బాధ. తలుచుకున్నప్పుడల్లా ఈయోచనలే - ఒక్కొక్కటి ఒక్కొక్క బాకులా - అతని హృదయాన్ని గాయపరుస్తూ ఉండేవి. ఇంతయత్నానికీ మిగిలినదేమిటి ? పరిపూర్ణమయిన సోదరక్రోధం ; నీలాపనింద; అప్పులు; కామయ్య ప్రోత్సాహంచేత ప్రతినిత్యం ఎగేసేవాడిని పీడించేటట్టు పీడించే ఋణదాతల బాధ.!

కాని, తానుచేసిన పనికి విచారించటంలేదు పాపయ్య ; దురభిప్రాయం తొలగద్రోయగలిగిన రీతిని ముందుముందు ప్రవర్తిద్దామని కూడా అతని అభిలాష-ఐతేనేం ? ఏంచేయడానికి పాలిపోదు ; ఎవరూ నమ్మరు ; కామయ్య క్రోధం దినదినప్రవర్ధమాన మవుతోందేగాని తగ్గటంలేదు—పాపయ్య సగం పిచ్చివాడై పోయాడు !

ఏది ఎల్లావున్నా, తనశక్తిలో ఉన్నంతమట్టుకు వెంకడి విషయంలో సహాయపడాలనే అతడు సునిశ్చితుడయాడు. నాలుగుడబ్బులు తేగలిగిన మగవాడు బలిపోతులాగు మృత్యుసముఖంలో నిలిచిఉండడం ; స్పృహలేనిస్థితిలో వెంకి ఆసుపత్రిలో పడిఉండడం ; దిక్కులేక, ఆకలికి నకనకలాడిపోతూ పిల్లలు ఇరుగు పొరుగమ్మల దయాధర్మ బిచ్చమిూద ఆధారపడి ఉండడం—ఈ పరిస్థితులు అన్నీకూడా సహజమార్దవమైన పాపయ్య హృదయాన్ని కరిగించి అతని నిశ్చయాన్ని దృఢపరిచాయి.

అన్నిటికన్నా ఎక్కువగా అతని సానుభూతిని ఇనుమడింప జేసినది మానవాతీతమైన ఉద్రేకంలో ఒళ్ళుతెలియక చేసాడేగాని, హత్యచెయ్యడంలో వెంకడికి వేరొక దురుద్దేశంలేదనే విశ్వాసం—చేయ సాహ

సించిని దుర్మార్గానికి రమణయ్యకి తగినశాస్తి అయిందనే నమ్మకం—పండంటి కులగౌరవాన్ని మంటగలిపిన ఆ మేనల్లుడు—రమణయ్య—అంతకంటె ఎక్కువ గతికి అర్హుడుకాదనే ఒకవిధమైన అభిజాత్యం!

అభిమానపడి మొదలు వెల్లడి చెయ్యకపోయినా, ప్లీడరు బలవంతంమీద—శిక్ష తప్పుతుందనే ఆశతో—వెంకడు కోర్టులో బయల్పరచిన గాథ, ఆ ఘడియ వరకూ పాపయ్య చెవులలో మార్మోగుతూనే ఉంది—ఆ సోమవారం సాయంకాలం వాడు మునసబుగారి పొలానికి రెండుమూడు ఫర్లాంగులదూరంలో కల్లు గీసుకుంటున్నాడు. గతరాత్రంతా జ్వరంతో బాధపడి ఉండటంచేత కొంచెంసేపటికే నడ్డిలాగడం, కళ్ళుతిరగడం ప్రారంభించాయి. విశ్రాంతికోసం వెనక్కి జార్లాపడి యాధాలోపంగా చుట్టుపట్ల పొలాలకేసి దృష్టిసారించాడు. మునసబుగారి ఊడ్పుదిబ్బమీద—ఒక పురుషుడు, స్త్రీ పెనగులాడుతున్నారు; పాకలోకి లాగడానికి పురుషుడు యత్నిస్తుంటే అతి కష్టమ్మీద వారిస్తోంది స్త్రీ. చెట్టుదిగి పాకవేపు పరుగెత్తబోయాడు వెంకడు. కాని, నీరసంచేత కళ్ళుతిరిగి పంటకాలవగట్టున పడిపోయాడు పాపం! ఎంతసేపల్లా ఉన్నాడో తెలియదు. స్మృతిరాగానే కొంచెంమంచి నీళ్ళుతాగి సేదదేరి పాక సమీపించాడు—ఆస్త్రీ వెంకి! గడ్డిమెత్తమీద కళ్ళుమూసుకుని, పైమీద బట్టయినా తెలియనిస్థితిలో పడుంది. ప్రక్కనే రమణయ్య! నెత్తురుడికిపోయింది వెంకడికి: కత్తితో పాకలో చొరబడ్డాడు('కూడా కత్తియెందుకు పట్టుకొచ్చావ'ని క్రాసుచేస్తే 'చెప్పలేన'న్నాడు) రమణయ్య ముందుకొక్కదూకు దూకాడు. అతనికాలు తగిలి వెంకి అదరిపడి లేచింది—ఒక్కకేకెట్టి పాక రెండో గుమ్మంగుండా పరుగెత్తుకొనిపోయింది. వెంకడికళ్ళు తిరిగిపోయాయి. ఒళ్ళంతా భగభగ మండుకుపోయింది: తరువాత ఏంచేసేడో, ఎల్లాచేసేడో పట్టుబడేదాకా ఏమీగుర్తులేదు: ఒక్కసంగతిమాత్రం ఆఘడియనుంచి వాడిచెవులలో గింగురుమంటూనేఉంది - అది రమణయ్యపెట్టిన భయంకరమైన పొలికేక!—అంతే!

తగిన సాక్ష్యంలేక కోర్టువారు విశ్వసించకపోయినా వెంకడుచెప్పిన ప్రతిమాటాకూడా ఒక్కొక్క అనంత సత్యవార్తలా పాపయ్య హృదయఫలకంమీద ముద్రితమై పోయింది. కోర్టులో జడ్జిమెంటువిన్న నిముషంనించీ అతని మతిచెదిరి ఏమీతోచకపోయినా, యీ విషయంమాత్రం ప్రస్ఫుటంగా గోచరించింది—ఆ రాత్రి—మర్నాడుసాయంత్రంవరకూ—అదే యోచన. వెంకినికూడా కనుక్కునేవరకూ తనకి మనశ్శాంతి ఉండదనిపించింది: ఇన్నివిధాలా తాను సహాయపడింది శీలంలేని ఒక పతితురాలు కాదనేనమ్మకం కుదిరితేనే గాని ఇంక తనకి జీవితాశ ఉండదనుకున్నాడు—అదో పిచ్చి—అదో స్వభావం!

ప్రస్తుతం ఆ ఉద్దేశ్యంతోనే ఆసుపత్రి కొచ్చాడు. ఎదురుకుండా పర్యంకంమీద పరిస్థితులు తెలియని స్థితిలో పడున్న స్త్రీ దుర్భరదుఃఖావస్థే అతని మ్లానవదనానికి ముఖ్యకారణం: ఒక దుర్మార్గుడి పశుత్వంచేత మానధనం గోల్పోయింది—ఇంకొక మానవనిర్ణయంచేత త్వరలో అనాథ కానుంది!—

ఎనిమిది కొట్టింది...తొమ్మిది కావచ్చింది...

ఇంతలో రోగికి మెలుకువ కలిగింది...నిశ్చలదృష్టితో తేరిబారజూచింది పాపయ్యని తెరిచిననోరు మూసుకోకుండానే...

'వెంకీ! ఎల్లావుంది నీవంట్లో?—'

'ఈ పూట - కొంచెం - తేలిగ్గానే - ఉంది - బాబుగారూ!—బాబూ!—మీరిల్లా——'

'కొంచెం కాయిలాపడ్డానులే యీమధ్య! దానికేం భయంలేదు - ఇప్పుడు నింపాదిగానే ఉందిలే!'

'ఇంత - నీరసంతో - అబ్బా - మేమేం - చేసినాం - బాబుగారూ - ఇంత కనికారం - కష్టం-మాకోసం-'

'వెఱ్ఱిదానా!—దానికేంగాని - వెంకీ! తండ్రివంటివాణ్ణి నాతోఎందుకు సూచించలే దాసంగతి?'

'ఏసంగతి బాబుగారూ?'

'వెంకడు కోర్టులో వెల్లడించాడు అంతా - రమణయ్య పశుకృత్యం - పాకలో - తగిన శాస్తి అయిందా రాక్షసుడికి—'

'బాబుగారూ!—'

చేతులతో ముఖంకప్పుకుని వెక్కి వెక్కి ఏడువ సాగింది వెంకి. ఆసంగతి జ్ఞప్తికిరాగానే నాటి అమానుషదృశ్యమంతా ఆమె స్మృతిపథంలో తాండవించింది: అగ్నిజ్వాలలు నిలువునా ఒళ్ళంతా దహించేస్తున్నట్టు దుర్భరపరితాపవేదన అనుభవించిందా మానవ ష్ఠుహాలు.

'ఇదుగో! ఇల్లాచూడు వెంకీ! ఇంతవరకు ఏవిషయంలోనైనా నీకు బాధకలిగించానా? ఇప్పుడు నిజస్థితి తెలుసుకోడం అన్నివిధాలా అవసరం...తప్పనిసరి...వెంకడిమనస్సుకి శాంతికలిగించాలి...అది మనవిధి...వాడికా పొరబాటు అభిప్రాయపడి నిన్ను ద్వేషిస్తున్నాడు...తెలిసిందా?'

'బాబుగారూ! - బాబుగారూ! - మామామకి నామీద - కోపమా? - నేనే - ఇందులో - అబ్బా! - చంపడానికొచ్చాడు కాబోలు! - ఎందుకు పారిపోయానో - దిక్కుమాలిన - దాన్ని? - నేనింక - బతకను - బాబూ! - ఎందుకు బతకడం?'

'పిల్లలకోసం. వా-డి-కోసం. జరిగిన విషయం నీనోటకూడా విని వాడిద్వేషం నివారించాలని వచ్చాను- తెలిసిందా వెంకీ? - నువ్వు నిర్దోషివని నాకు నమ్మకం కలిగింది...భయపడకు—'

'మీదయకి - వెయ్యిదండాలు - బాబూ! - చెబుతా - అంతా చెబుతా - మాపాలిటి - దేవుడిదగ్గిర - భయం - ఎందుకు?—'

'వెంకీ!...నీమనస్సు కష్టపెట్టాలిసొచ్చినందుకు చింతిస్తున్నా...నాహృదయవేదన భగవంతుడికే అర్థమవాలి...వాడేరక్షించాలి మీసంసారాన్ని...అబ్బా!' అని నిట్టూర్పుతో ప్రక్కనున్న కుర్చీమీద చతికిలబడ్డాడు పాపయ్య.

వెంకి ప్రారంభించింది...అనవసర విషయాలతో హైరానుపడకుండా ఒకమాట చెప్పదల్చితే పదిమాటలు గ్రహించి ఐదునిముషాల్లో విషయమంతా అవగాహన చేసికోగలిగాడు పాపయ్య.

అనాగరికుడైన పల్లెటూరి పంటకాపు కింత గ్రహణశక్తి, యింత ఉదారత, పరోపకారశీలం ఉన్నాయా అని మనం సందేహపడ నవసరంలేదు. ఇవేకాదు - మానవసభ్యతకే అలంకారాలు కాదగిన వెన్నో సుగుణాలు జానపదహృదయంలో జీర్ణించిపోతున్నాయి తగిన ఆలంబన, ఆదరణా లేక!

వెంకి ముగించింది...శరభయ్యగారి చెక్కులో కలుపుతీత కెళ్ళి రోజంతా పాటుబడగా లభ్యమైన మూడణాలు రొంటిసెట్టుకుని పుంతమ్మట నడిచి వస్తోందా సాయంత్రం...

అప్పుడప్పుడు అవసరానికి చేసిన చిల్లరప్పుల మొత్తం రు 15 లు. అర్థణా రేటు చొప్పున కాలగర్భంలో పెరిగి పెరిగి తుదకు రు 36 ల దరిదాపు స్వరూపంతో ప్రపంచకం కళ్ళబడి ఆసంసారంమీద నిరంకుశత్వం చెలాయిస్తోంది...దీనికి తోడు నలుగురుపిల్లలు...చేతికందినవాళ్ళొకరూ లేకపోయినా...

వెంకడు జ్వరంతో కల్లుగీత కెళ్లాడు...ఎక్కడ కళ్ళుతిరుగుతాయో!...ఈ డబ్బులు సెట్టికి వడ్డీ క్రింద జమకడితే, మర్నాటికి నూకలు?...ఐనా, వెంకడి పావలా...తన మూడణాలు...రు 36 ల అప్పు - ఎప్పటికి తీరును?...ఇవే ఆలోచనలతో తెల్లారితే ఎక్కడ కూలికెళ్ళాలా? అని నడిచిపోతోంది, అప్పటికి 21 రోజుల బాలింతయిన వెంకి-

మునసబుగారి పొలంపాక సమీపించింది...రమణయ్య ఒంటిగా పాకముందు కూచున్నాడు...పిలిచాడు నెమ్మదిగా...పనిదొరుకుతుందనే ఆశతో పరుగెత్తింది...కాని, అతని దురుద్దేశం త్వరలోనే వ్యక్తమయింది...రూపాయలు చూపించాడు...కళ్ళుమండి 'బుద్ధిలేదటయ్యా?' అని రెండుతిట్టింది...దానితో, 'ఇంతపొగరా?' అని లేచి బలవంతంగా చెయ్యిపట్టుకుని లాగాడు...పెనుగులాడింది చాలాసేపు...కాని, నీరసంచేత కళ్ళుతిరిగి పడిపోయింది...మెలుకువ కలిగి కలియజూసేటప్పటికి గడ్డిమీద...రమణయ్య ప్రక్కన...గుమ్మందగ్గిర ఎత్తిన ఈతకత్తితో వెంకడు... అడ్డంగాపెట్టబడిన బల్లచక్కతోసుకుని రెండోగుమ్మంగుండా పరుగెత్తింది...ఏదోభయం. పుంత కవతలున్న

అరటితోటలోంచి అడ్డమడి మాలపల్లి చేరింది ఒళ్ళు తెలియని స్థితిలో... మంచంమీదపడి వెక్కి-వెక్కి-ఏడ్చింది రాత్రంతా.. పిల్ల లేమయ్యారో, ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు...పొద్దున చెప్పారు రమణయ్య చంపబడ్డాడనీ, వెంకణ్ణి పట్టుకున్నారనీ ..

'పిల్లలు బాబూ —మీపాదాలబడి - వెట్టిచేస్తాను- మాసంసారం - నిలపండి - బాబుగారూ.-మామకీళోపం- ఒస్తే - ఎంమకింక - బతకడం ? - రక్షించండి - యీ దిక్కు-మాలినదాన్ని ?' అని ముగించింది వెంకి-

సహజకరుణార్ద్రమైన పాపయ్యహృదయం కరిగిపోయింది. కండువాతో కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

'ఆపను వు చంపబడడం మనగ్రామానికంతా సంతోష కారణం - వెంకీ. నువ్వు పూర్తిగా నిర్దోషివి.-నా కంఠంలో ప్రాణమున్నంతవరకు మీసంసారం విచ్ఛిన్నం కాదు - అపీలుచేస్తా - వెంక డింక ద్వేషించకుండా నిన్ను ప్రేమించేటట్టు చూచే పూచీనాది - రేపుప్రొద్దున్నే జైలుకెళ్ళి మాట్లాడతా - భయపడకు-అబ్బా.'

మాట్లాడింది పాపయ్యకాదు. అపూర్వోద్రేకంతో పొంగిపోతున్న ఒక నూతనవ్యక్తి!

౪

ఒక బుధవారంనాటి సాయంకాలం. ఐదుగంటలు దాటింది. 'లాకప్'లో పెట్టడానికి వార్డరు తొందర పడుతున్నాడు. ఖైదీలు తమ ముంతలనిండా నీళ్ళు పట్టుకుని తమతమకూపాలు చేరుకుంటున్నారు బేడీ గొలుసులీడ్చుకుంటూ.

వెంకడి గదిముందర—

మృత్యుసన్నిధిని ఘడియలు గడుపుతున్న ఆ నిర్భాగ్యుడు, నిండు యౌవనిఘోరములో గస్తీ తిరుగుతున్న యిద్దరి సిపాయీలకోపలాలో, తన భార్యతో ఆఖరుసారి మాట్లాడడానికి సాహసిస్తున్నాడు.

నోట మాటరాకుండా ఏకధారగా ఏడుస్తున్న వెంకిని అతికష్టంమీద వారించాడు. అనుజ్ఞ లభించిన ఆ నాలుగుఘడియాలూ నిశ్శబ్దదుఃఖంతో వెళ్లబుచ్చితే ఎలాగు ? ఎన్నోవిషయాలు వాడి హృదయంలో పొంగి పోతున్నాయి.

'—పిల్లా ! చూడు. నువ్విల్లా బెంగెట్టుకుంటే - ఆ పసి - కూనల్ని చూసేదెవరు చెప్పు ?'—(పొంగి పొర లుతున్న దుఃఖాన్ని దిగమింగి)—'అబ్బా ! ఊరుకో పిల్లా. నువ్విల్లా వున్నావంటే నా మనస్సంతా దిగాలు పడిపోయి ఇప్పుడే పిచ్చెత్తిపోతుంది—'

'నిన్నెందుకు చంపుతారు మామా ?—తాళికట్టిన దానిమానం కాపాడబోయినందుకా ? అందుకు నిన్ను బలవంతంగా పీక నులిమి చంపేస్తారా ?—అబ్బా. దేవు డూరుకుంటాడా మామా, ఇల్లాంటి అన్యాయాలు చూసి ?—ఎప్పుడూ ఒకరిజోలికి పోనివాడవు గదా, నిన్ను చంపితే ఏంలాభం మామా, వీళ్ళకి ? చచ్చిన వాడు బ్రతికొస్తాడా మళ్ళీ ?'

'అదికాదు పిల్లా; ఇకముందు ఇల్లాంటి పనులెవళ్లూ చెయ్యకుండా భయపెట్టడానికిట ఈ శిక్ష - మొన్నొక వార్డరుబాబు చెబుతూంటే విన్నా—'

'అదేంమాట మామా; చంపాలని చంపావు గన కనా ? ఒళ్ళు రెచ్చిపోయే సందర్భాల్లో ఈ శిక్షలకి జడిసి ఊరుకోగలడా మనిషయినవాడు; అసలల్లాంటప్పు డీశిక్షలూ ఈలోకం జ్ఞప్తి ఉంటుంది గన కనా ?--ఒద్దుమామా; నువ్వు చచ్చిపోవద్దు ;--నే సహాయంచేస్తా పారిపోయిరా, పోనీ.'

వెంకడు నోరునొక్కుకుని దూరాన్ని పచారుచేస్తున్న సిపాయిలని చూపించాడు. వెంకి కలవరపడింది.

'పిల్లా అల్లాంటి మాటలనకు. విన్నారంటే యీ రెండురోజులూ ఎవర్నీ చూడనియ్యరింక. రేపు ఏ పాపయ్యగారేనా చూడ్డాని కొచ్చినా--'

'రారు మామా ; ఆ రాక్షసులు--'

'అదేంపిల్లా, అల్లాగంటున్నావు ?'

'నేను ఆసుపత్రినించి వొచ్చింది మొదలు అడిగినప్పుడల్లా బియ్యపుగింజలిచ్చేవారు గదా ?--దేవుడు మామా, ఆయన. ఆయనమీద చెయ్యవెయ్యడానికి--'

'చెయ్యెయ్యడం ఏమిటి ? ఎవరు ! ఎక్కడున్నారాయన ?--త్వరగా చెప్పు పిల్లా నా మనసంతా కరిగి పోతోంది.'

'కొట్టించాడు మామా ; కామయ్యగారే ;-- నాకు

తెలుసు - ఆయనే - పాపం, ఘంతగట్టున పడున్నారుట; ఎవరోచూసి ఆసుపత్రిలో పడేసారుట.- ఒకటే గోలగదా పాపం ఆ యిల్లాలు?--ఎల్లాంటి రాతిగుండె వాళ్ళకైనా జాలేస్తుందే. కామయ్యగారు తొంగిచూడేనా లేదుగదా?—'

'కొట్టించాడా?-- పాపయ్యగారు - ఆసుపత్రిలో- అబ్బా, ఇంతచేసిన దేవుడికి సమయానికి కాలేకపోయానుగదా?'

వెంకడు తలవంచుకున్నాడు. బొటబొట కన్నీరు కారుతోంది రాతి నేలమీద. అవతలచీకట్లు అంతకంతకి దట్టమై నిశాదేవతకి జోహారంటున్నాయి.

'మనకోసమే పిల్లా, ఈ పాట్లన్నీకూడా ఆ మారాజుకి. ఈ దిక్కుమాలిన సంసారంమీద ఆ కామయ్యబాబు కంత కక్షెందుకో?. అబ్బా, నిజంగా నాకు చావంటే భయంలేదు పిల్లా, ఎప్పుడైనా పోవలసిన వాళ్ళమేగదా!-- కాని, ఇంక నాలుగురోజులపాటు బ్రతకనిస్తే - ఆ మహానుభావుడి ఋణం తీర్చుకోడానికి--'

వెంకడికళ్ళు అశ్రుపూరితాలయినాయి. దుఃఖం కాదు వాడిది. విశ్వాసపూర్ణమైన వాడిహృదయం వెల్లివిరిసి పొంగిపోతోంది - ఆపలేక పోతున్నాడు--

'అప్పుడు మాత్రం - మనతరమా - ఆ దేవుడి - ఋణం తీర్చుకోడం?-'

'కాళ్ళు పడతా - వెట్టిచేస్తా - 'బాబూ ఈ వెధవ కొడుకుమీద కోపంచేత ఆ మారాజుమీద కక్షకట్టకండ'ని కామయ్యగారి పాదాలబడి వేడుకుంటా. కొంత కడుపుదుగ్ధేనా తీరుతుంది పిల్లా, నాకు. ఇంక నాలుగురోజులపాటు బతకనిస్తే-'

'ఏయ్, చాలా ప్రొద్దయిపోయింది. ఇంక మాట్టాడకూడదు. వెళ్ళిపో.'- సిపాయిమాటలు.

'వెళ్ళిపోతా, బాబూ.- ఒక్కసారి - మా మామని- తొకనియ్యండి - ఇంక రెండుక్షణాలు - రెండుక్షణాలే- బాబూ.'

'అదేంలేదు: పైవాళ్ళు చూస్తే మాటొస్తుంది. జావ్,— ఊ,- చెల్ జావ్,-- రాంజీ, తాళాలేవి?'

'వెళ్ళుపిల్లా,— ఇంక రాకు,-- ఎప్పుడేనా - నన్ను తల్చుకుంటూ ఉండు,- పిల్లలు - జాగ్రత్తసుమీ,- పాపయ్యగారి - పేరెట్టు - చిన్నాడికి - వీలై - ఆయనొస్తే - ఇంతే ఇచ్చాడు - భగవంతుడని - పాదాలబడి - ఒక్కసారి - దణ్ణం - పెడుదును - నోచుకోలేదు,- ఇంక నాలుగురోజులపాటు—'

'గవ్' మని ఇనపతలుపు చప్పుడు—

అవతల అంధకారం.

* * * *

ఉరికంబము ఎక్కేటప్పుడుకూడా చేతులు జోడించుకుని వెంకడు స్మరించిన మాటలు వింతగాచెప్పుకుంటా రిప్పటికీ ఆ జైలు వార్డర్లు— 'ఇంక నాలుగురోజులపాటు బతకనిస్తే—'

* * * *

రెండునెలలు గడచిపోయింతర్వాత, నాడు రమణయ్య జేబులోనించి పోయిన రు 50 లూ కూలీ [illegible] వయ్యయింట్లో—మరోకేసులో సోదాచెయ్యగా— దొరికాయిట, రమణయ్య పొలికేకవినగానే పాకకేసి పరుగెత్తిన యిద్దరుముగ్గురిలో సరవయ్య ఒకడు— ఐనా, ఎవరు తీస్తేనేం?—

* * * *

పాపయ్యయిల్లు శిథిలమైపోయింది. పట్టపగలు కూడా ఒంటిగా ఆ ప్రాంతాల్లో సంచరించడానికి జడుస్తారు గ్రామస్థులంతా. ప్రతినిత్యం ఏదో భయంకరనాదమొకటి ఆ గృహాంగణంలోంచి వెలువడి నిశాగర్భంలో ప్రతిధ్వనించేదిట—తెలియక సాహసించినవారికి ఇప్పటికీ అది చెవులబడుతూనే ఉంటుందిట- 'నాలుగురోజులపాటు బ్రతకనిస్తే—'

ఒక పిచ్చివాడుమాత్రం అప్పుడప్పుడాఅరుగుమీదే విశ్రమించి, ఆమాట వినిపించినప్పుడల్లా భయంకరాట్టహాసంతో ప్రత్యుత్తర మిచ్చేవాడు. దయతో తమ్ముడు కామయ్యయిచ్చిన పంచెలుచింపి ఆ అరుగుమీదే విరజిమ్మేవాడు. కాని, నిద్రాణమైన జగత్తు కీసవ్వూ, ఆ నాదం, వినిపించేవో? లేవో?

—కలపటపు రామగోపాలరావు, బి. ఏ.

# బుఱ్ఱా బుచ్చన్న

(పూసపాటి సంస్థానమున మూడుతరములు మంత్రిత్వము నెఱపినవాడు.)

మంత్రిత్వము నెఱపిన ఆంధ్రులలో బుఱ్ఱా బుచ్చన్నవంటి మంత్రాంగియు, బుద్ధికుశలత గలవాడును, అనుభవరాజనీతిజ్ఞుడును చాల యరుదని చెప్పవచ్చును. ఈయన పదునెనిమిదవశతాబ్దిని విజయనగర మేలిన పూసపాటి పెద విజయరామరాజుగారి ప్రధానిగ నుండెను.

బుచ్చన్న ఈ పెదవిజయరామరాజుగారి తండ్రి అయిన పెద ఆనందరాజుగారియొద్ద మూడుసంవత్సరములు ప్రధానిగనుండెను ఆయనయు బుచ్చన్న మంత్రాంగశక్తిని లెస్సగ తెలిసికొని తన అవసానకాలమున కుమారులను పిలిచి వారితో బుచ్చన్నగారి ఆజ్ఞానువర్తనులయి మెలగి యశస్సును బొందుడని చెప్పెను. వారును తమ తండ్రిమాటలను జవదాటక బుచ్చన్న సలహాలను వినుచుండెడివారు.

విజయనగరసామంతులగు లింగభూపతియు, గోలుకొండ మల్లుభూపతియు, విజయనగరాధీశుడగు పెదవిజయరామరాజుగారితో స్నేహము నటించుచు, ఆయనకు శత్రువగు కాశీపతిరాజుగారికి ఆంతరంగికముగ నుండుచువచ్చిరి. ఈసమాచారమును తన ఏలికకు తెలియజేయుటకు బుఱ్ఱా బుచ్చన్న గొప్ప తంత్రమును బన్నెను. ఆంతరంగికముగ కాశీపతిరాజుగారు, విజయనగర సామంతులగు లింగభూపతి, మల్లుభూపతిగార్లకు వ్రాయించినట్టుగ నొక్క ఉత్తరమును బుచ్చన్నగారు వ్రాయించిరి. అందీ క్రింది విధముగ నుండెను: "మీరింతవఱకు పూసపాటివారితో స్నేహమునటించి మాకు సాయము చేయుచుండుటచేసియే మాకోట నిలబడియున్నది. మీరు మాయండ లేనినాడు మా సంస్థానమునకు తిలోదకము లర్పించగల వారమే గదా!" ఈ ఉత్తరమును ఆసామంతులు చూచుకొని అందలిమర్మము తెలియక తిరిగివారు. 'ఈమాటలు బయటపెట్టవలదు. మనమన్యోన్యము సాయపడుచుండవలసినవారము. ఇందుల కొండొరుల మనస్సులే సాక్షీభూతము"లు అను అంతరంగికపుమాటలు వ్రాయుచు - సమాధానముబంపిరి. ఈసమాధానపుటుత్తరమును బుచ్చన్నగారు సంగ్రహించి పెదవిజయరామరాజుగారికి చూపించెను. అంత రాజుగారును రోషావేశులయి ద్రోహులగు నాయిరువురు సామంతులను దండింప తక్షణము బయలుదేర నిశ్చయించెను. అంత బుచ్చన్నగారు వారి యావేశమును వారించి, ఇంట గెలిచి రచ్చగెలువుమన్న సామెతగ ముందు తమ రాష్ట్రమున నేవిధమగు తిరుగుబాటు జరుగకుండ తగు నేర్పాట్లుచేసి యావల సామంతుల దండింప నరుగవలసిన యావశ్యకతను నిరూపించెను. తనరాష్ట్రమున తగు కట్టుదిట్టముల నేర్పాటుగావించికొని ఆవల నాయిరువురసామంతుల తనయొద్దకువచ్చి సమాధానము చెప్పుకొనవలసినదిగ నాజ్ఞాపించెను. వా రందుల కియ్యకొననందున, విజయరామరాజుగారు బుచ్చన్నసమేతముగ వారికోటల పైకి దాడివెడలగ లింగభూపతియు, ఆయనకుమారుడు సోమభూపతియు వారికోట నుండి పాఱిపోయి గోవాడ మొదలగు గ్రామముల పితూరీచేయుచు, దోపిడీలు గావించుచు, పూసపాటివారిసైన్యము విడిదిచేసిన సమీపస్థలములనున్న చెఱువులయం

దును, నదులయందును మందు కలుపుచు పోవుచుండెడివారు. తత్ఫలితముగ నా జలముద్రావిన పూసపాటివారి సిబ్బంది ఎక్కడనున్నవా రక్కడనే సమసిపోవుచుండిరి. ఆ సామంతులును తిరుగుబాటును సాగించుచు దోపిడీలు గావించుచు, మాన్యములపై బడుచుండెడివారు. తమసైన్యము నష్టమగుటయు, విశేషధనవ్యయ మగుటయు నరసి యిక తమ కీవ్యవహారమున లాభము లేదనిగ్రహించి, బుచ్చన్నగారు మాడుగుల జమీందారునకు వారితాలూకా వారికిచ్చి తమ పేషుకషు క్రింద పన్నెండుగ్రామములు స్వాధీనముచేసికొనినట్లు కవులు వ్రాయించిపంపిరి. ఇదేవిధమున గోల్కొండనుగూడ సాధించి అతనినిగూడ తాముచెప్పిన చొప్పున వినునట్లుచేసికొని తమదండుఖర్చులు ముదరాయిచ్చునట్లొప్పించి వారితాలూకా వారి కిచ్చివేసెను. ఈ మాడుగల జమీందారునకు ఇదివరలో మూడువేల సిబ్బంది యుండ, విజయరామరాజు విశేషమగు జమాబంది కట్టుటచే ఒక్కవేయి సిబ్బందిమాత్రము నిలుపుకొని మిగతసిబ్బందిని విడుదల చేయువలసినవాడయ్యెను. ఇట్టిస్థితిలో నా సామంతులికపు రిక తనమీద తిరుగుబాటొనర్పజాలరు గదాయని సంతసించి బుచ్చన్నగారి ఆలోచనకు చాలమెచ్చి అనుగ్రహించి ఆయనకు వారిరువురచేత చెఱియొక గ్రామము మొఖాసాయిప్పించెను. జమీలు ఎక్కడ సంపాదించిన నక్కడెల్ల బుచ్చన్నగారికి మొఖాసాలు ఇప్పించుచుండెడివారు.

తదుపరి కొన్నినాళ్ళకు విజయరామరాజుగారు చుట్టుప్రక్కలనున్న సంస్థానముల జయించుచు, శత్రుబలముల నణచుచు తనకు ప్రబల శత్రువులయిన బొబ్బిలివారిపై దండువెడల నిశ్చయించుకొనెను. అందులకై దేశస్థుల నాయత్తము గావలసినదని హెచ్చరించ వారందరు వెలమలు యీతూరి ఏకస్థులయి యున్నందున జయము మాట యబద్ధమనిరి. అంత విజయరామరాజుగారికి చాల ఆగ్రహమువచ్చెను. అట్టి సమయమున బుఱ్ఱా బుచ్చన్నగారు విజయరామరాజుగారిని శాంతపఱిచి తమ స్థానమున పూసపాటి రామచంద్రరాజుగారిని అంబారీయందు కూర్చుండబెట్టి సకలసంతనలతో సైన్యముబంపుట యుత్తమమని సలహానీయ వారందుల కతిహర్షమున నంగీకరించిరి. నాయణపట్టణమున జరిగిన ఘోరయుద్ధమున రామచంద్రరాజుగారు హతులయిరి. ఇందుపై తానే యుద్ధమునకు వెడలియున్నచో తప్పక పరలోకముచేరెడివాడనే గదాయని బుచ్చన్నగారినిగూర్చి వారి ఆలోచన బృహస్పతిఆలోచనయై తమను బ్రతికించినదనిచెప్పి వారికి పల్లకీబహూకరించి అనేకవిధముల వారిని స్తోత్రముచేసెను.

వేఱొకసమయమున హైదరాబాదునుండి ఫవుజుదారురాగా వారును విజయరామరాజుగారును కలిసి అతిస్నేహమున మెలగుచుండిరి. అదే అదనుగ రాజుగారి మర్మము తెలిసికొనగోరి ఆ ఫవుజుదారు "సర్కారు పేషుకషు లక్షతొంబదివేల రూప్యములు పోను మీకు మిగులునది యిక నంతకెక్కువ యుండదే. అట్టిచో మీ సైన్యమునకు ఖర్చులు చాలనట్లుండ యింతసైన్యము నేవిధముగ పోషించుచుండి"రన విజయరామరాజుగారు మర్మము చెప్పబోవుచుండిరి. అంత బుచ్చన్నగారు రాజుగారినుద్దేశించి "స్నేహధర్మమను నెపమున నవాబును నమ్మి మర్మము బయటపెట్టుట రాజనీతిగా"దని వారింపబోయెను. అంత విజయరామరాజుగా రాయనపై అపోహపడి అసూయచే

నాయన అట్లు పలుకుచున్నాడని ఆగ్రహించి ఆయనను వెంటనే చీపురపల్లి కోటయందు ఖయిదు చేయించెను. ఆవల అయిదారు నెలలో ఈ ఫవుజుదారు విజయరామరాజు నుద్దేశించి "మీకు పదియారులక్షల యాదాయమువచ్చుచుండ సర్కారుపేష్కషు లక్షతొంబదివేలుండుట న్యాయముగాదు. గాన నీపాలునుండి నాలుగులక్షలు దాఖలుచేయవలసిన"దని కఠినముగ పల్కెను. విజయరామరాజుగారు మే మట్లు హాస్యమునకంటిమని యెంతచెప్పినను వారిరోదనము అరణ్యరోదనమయ్యెను. నవాబు తన సైన్యముతో విజయనగరపుజనానాయున్న వొడ్డాదికోటపై దాడివెడలి ముట్టడించెను. అటనుండి నీభార్యలచే మట్టితట్టల మోయించెదనని విజయరామరాజుగారికి కబురుపంపెను. అప్పుడు రాజుగారి కేఆలోచనయు తోచనందున తక్షణము బుర్రా బుచ్చన్నగారిని రావించి "మీమాటలు విననందున మాకు చాల ముప్పువచ్చినది. మీరు మాకు దైవస్వరూపులు గాన యీ విపత్తునుండి తప్పుకొను మార్గమునుగూర్చి సలహానీయవలసిన"దని కోరిరి. అంత బుచ్చన్నగారు "వెంటనే నారాయణదేవువారిని పిలిపించి నవాబువారి చిన్నవాండ్లున్న కశిమికోటపైకి పంపి ముట్టడివేయించి మనము కొద్దిసైన్యముతో వొడ్డాదికోటపైకి పోవుటయుచితము. ఇందుపై తురకలు వొడ్డాదివదలి తొందరగ కశిమికోటపైకి పోయెదరు, ప్రాణములుపోయినను మానసంరక్షణము చేసికొనవలసినదనియు జయాపజయములు దైవాధీనములనియు" సలహానొసంగిరి. వారనుకొనినట్లే నవాబు తన సైన్యములో వడ్డాదినుండి మరలుటయే గాకుండ కశిమికోట ముట్టడి వదలవలసినదని రాజుగారిని వేడికొనుచు తమ దురాలోచనకు క్షమాపణకోరెను.

తదనంతరము కొన్నినాళ్ళకు హైదరాబాదునుండి యీ కళింగసర్కారునకు ఫవుజుదారువచ్చి రాజాందగ్గర విడిదిచేసియుండ విజయరామరాజుగారు వారిని కలిసికొని మాటలాడి ఆ సమీపముననే బసచేసియుండిరి. ఇంతలో నొక సూకర మాఫవుజుదారుని గుడారముప్రవేశింప నాతడు 'మారో! మారో!!' అని కేకలువైచెను. సైనికులీ కేకలువిని విజయరామరాజుసైన్యమునుద్దేశించి నాత డట్లు కేకలువైచెనని ఆప్రక్కనే యున్న విజయరామరాజుగారి గుడారముపై బడిరి. ఆయన చాల యజాగ్రత్తగనున్నప్పటికిని ఫవుజుదారుని సైన్యము నెదుర్కొని తుదకు ప్రాణములతో తప్పించుక పాఱిపోగలిగిరి. వారంత రాజాంకోటచేరి అటనుండి విజయనగరము చేరిరి. అప్పుడు నవాబును కొట్టక తలగుడ్డకట్టననియు నవుబతు వేయుట లేదనియు ఆయన శపథముబట్టెను. అయితే నవాబు నెదుర్కొనుటకువలయు సైన్యము నాయత్తపఱచుటకు చాలడబ్బు అవసరము కాని ఆయనయొద్ద ఒక్కకాసైనను లేదే? అట్టిస్థితిలో బుర్రా బుచ్చన్నగారువచ్చి విజయరామరాజుగారి తండ్రిఅయిన పెదఆనందరాజుగారు తమ అవసానకాలమందు లక్షవరహాలు తనపరంగా భూస్థాప్యంచేసి ఉపద్రవావస్థ వచ్చినప్పు డుపయోగించుకొనుడని చెప్పిపోయినట్లు తెలియజేసెను. అంత విజయరామరాజుగా రాధనముతో తనసైన్యమును తిరుగకూర్చుకొని శ్రీకాకుళము మీదికిబోయి అక్కడనవాబును దోచికొని తమయొద్ద వారు దోచికొనిన సామానులన్నియు దీసికొనుటయేగాకుండ నవాబు సామానుయావత్తునుగూడ దోచికొని విజయనగరముచేరి ఆవెనుక తలగుడ్డకట్టి నవ

బతు బజాయించెను.

ఈ విజయరామరాజుగారి అనంతరము ఆనందరాజుగారు గద్దెనెక్కిరి. ఈయన దుర్గా సాక్షాత్కారము చేసికొనునిమిత్తము పూజలుచేయదొడంగెను. అప్పుడు వారి ప్రధానియైన బుచ్చన్నగారు రాజునుద్దేశించి "మీరు బాలురు. కలియుగమున శక్తిని సాక్షాత్కరించుకొనినవారు లేరు సకలైశ్వర్యములును గల మనకేమిలోటు? కాన యీ పూజలు మాను"డని పలికిరి. అంత రాజుగారు "మా మూలపురుషుడైన మాధవవర్మ దినములలో బెజవాడలో యేడుగడియలు కనకదుర్గాంబ కనకవర్షము కురిపించినది. వారు కావలసినంత బంగారముతీసుకొని మిగిలినది కొండ దొలిపించి అందుంచి ముద్రవేయించిరి. నేనును అమ్మవారినిమెప్పించి ఆబంగారము నావిని యోగములోనికి తెచ్చుకొనవలయునని ఉద్దేశించుచున్నాను." అనిచెప్పిరి. అంత బుచ్చన్నగారు "నేనిదివరలో ముగ్గురు రాజులయొద్ద ప్రధానత్వముచేయుచు వచ్చుచుంటిని. కాని నామంత్రాంగ మెప్పుడును వృథాబోలేదు· ఒకవేళ నా ఆలోచన ప్రథమమున తిరస్కరించినను తక్షణము దాఖలా వచ్చుటచే బుచ్చన్నమాట శిలాక్షరమని యొప్పుకొనుచు నే చెప్పినచొప్పున చేయుచుండిరి. ఇది అతిశయోక్తియని, ఆత్మభూషణయని యెంచతగదు. కాన సాక్షాత్కారము మాట మఱచి నలుగురితోపాటు పూజచేసికొనుచుండు"డని చెప్పెను. అంత ఆనందరాజుగారి కాతనిపై ఆగ్రహమురాగా వారి నవలకు బొమ్మనిపలికిరి తనపూజలుతాను,సాగించెను. అంత సరిగా యెనిమిదిరోజులకుశక్తి తలకొట్టుటచే ఆనందరాజుగారు మరణించిరి.

ఆవల బుఱ్ఱా బుచ్చన్నగారు పెదవిజయరామరాజుగారి భార్యఅయిన చంద్రయ్యగారితో ఆలోచించి, తాళ్ళపాలెములో నున్న పూసపాటివారి జాతిఅయిన రామభద్రరాజుగారి కుమారుని తీసుకొవచ్చి పట్టముకట్టుటకు నిశ్చయించెను. ఇంతలో నిజాముల్ ముల్కు తనకప్పము చెల్లించనిచో దేశమును విడుచుటలేదని చెప్పినందున బుచ్చన్నగారు వారికి సాహుకారుచీటినిచ్చి నాయననుపంపి దేశమును స్వాధీనముచేసికొనిరి. అంత ఈ బాలుని సింహాసనాసీనుని గావించి, సీతారామరాజుగారిని దరి చేరనీయకుండ, సకలతంత్రములుబన్ని బుచ్చన్నగారును, చంద్రయ్యగారును చింతలపాటి నీలాద్రిరాజు, సింహాద్రిరాజు మొదలగు ముఖ్యసర్దార్లల సాయముతో పరిపాలనాచక్రమును నడుపసాగించిరి. కాని కొన్నిరోజులలో సీతారామరాజుగారు కిలేదారుని లోబఱచుకొని, కోటప్రవేశించి అందున్న వారినందఱ ఖయిదుచేయించెను. బుచ్చన్నగారు ఆ కోటలోనే మేడపైనుండి క్రిందికి రానందున ఖయిదుచేయబడలేదు· ఆయనకు తిండిలేనందున రాత్రి నాలుగుగడియలవేళ తిండిలేదని సీతారామరాజుగారికి కబురుచేయ అప్పుడు వారిని వదలివేసిరి.

ఆవల కొద్దికాలమునకు విజయరామరాజు పెఱిగి పెద్దవాడై సీతారామరాజు చేసిన పనులను విమర్శింపుచు రాచకార్యముల తానుగూడ జోక్యము గలుగజేసికొనుచు కొన్నికొన్ని పితూరీల నణచుచుండెను. ఇటులుండ రాజమహేంద్రమున నిజామద్దౌలా వారికి బదులు, బదిల్ ఖాను ఏలూరు రాజమహేంద్రవర సర్కారులకు నవాబుగనుండు నవసరమున సీతారామరాజుగారతనిపై దాడివెడలెను. అప్పు డాయనవెంట అంబారీయందు బుఱ్ఱా బుచ్చన్నగారుగూడ కూర్చుండియుండిరి. ఇప్పటికి బుచ్చన్నగారికి

నేత్రావరోధము కలిగినను ఆయన ఆలోచన
వృథాపోవునది కాదని గ్రహించి సీతారామ
రాజుగారు ఆయన ఆలోచన నతిక్రమించు
వారుగారు. బుచ్చన్న విజయరామరాజు పక్ష
మేవహించినవాడని తెలిసియు సంస్థానమున
కు కీడుదలచువాడుగాడని ఈరాజునమ్మకము
గలిగియుండెను. బుచ్చన్నయు సీతారామ
రాజుగారి చిత్తవృత్తి నెఱిగినవాడే గావున
ఎప్పటి సమాచారమప్పుడాయనకు నివే
దించుచు తగు ఆలోచనేదియో చేసికొమ్మన
మని చెప్పుచుండెడివాడు. కాని మఱునాడు
తిరుగ నాయన తనవద్దకు వచ్చినపుడు తగు
సలహానిచ్చి ఆప్రకారము నడచుకొనవలసిన
దని చెప్పుచుండెడివాడు.

బదిల్ ఖానునకును సీతారామరాజుగారికి
ఆ దుర్గముపై ఘోరయుద్ధము జరిగెను. సీతా
రామరాజునకు బుచ్చన్నగారి సలహానుం
డుట బదిల్ ఖాను తెలిసికొని వారికివలయు
ధనమిచ్చెదము, శత్రుమర్మము మాకు చెప్ప
వలసినదని రహస్యరాయబార మంపెను. ఈ
సమాచారమును సయితము బుచ్చన్నగారు
సీతారామరాజుగారికి తెలియజేసెను. ఆవల
తమఖర్చులకై వత్సవాయివారు కాకర్లపూడి
వారివల్లను జమాబంది దాఖలుచేసికొని
సిబ్బందిఖర్చులు గడపుకొనుచు ఫవుజుదా
రుని కోటవెలుపలికిరాకుండ చేసి కోటమాత్ర
ము మినహాయించి తక్కిన ప్రదేశము యా
వత్తును తనవశమునందుంచుకొనెను. ఇటు
లుండ ఒకదినమున కోటమీదికి తనసైన్య
మును బురికొల్పి వారు యుద్ధము చేయుచుం
డగ శీతారామరాజుగారు అంబారీదిగి గుఱ్ఱ
ము నెక్కి పరుగెత్తివచ్చుచుండెను. అప్పుడు
బుచ్చన్నగారు అడ్డుతగిలి "పూసపాటివా
రింట పుట్టినవారిలో ఇంత వివేకహీనుల నే
నిదివఱకు జూడలేదు. నాకిప్పుడు ఎనుబ
దేండ్లు నిండినవి. నీవొక్కరుడ విట్లు ముందు
పరుగిడిన ఈ సైన్యమున నిలచువారెవ్వరు?"
అని చెప్పుచు యిట్టి సాహసమువలదని చేయి
పట్టుకొని యీవలకు తీసుకవచ్చెను. కాని
సీతారామరాజునకది యర్థముగాక శత్రువగు
మ్లేచ్ఛునిచే దెబ్బలుతిని యూరకుంటయా?
మేము ముందునకుసాగిన సేన అంతయు
ముందునడచుటయు ఆవలదుర్గము తృటిలో
స్వాధీనమగుటయు సాధ్యపడును గదా?"
అని అనెను. అంత బుచ్చన్నగారు వేగముగ
దుర్గము నెక్కుటయను ఆలోచనలో మీకు
గుండుదెబ్బ తగిలినప్పుడు ఈ సయిన్యములో
నెవ్వరునుగూడ రణభూమిని నిలువరనుట మ
రచిరి. మీకు సాయపడువారేరి? కాని ఈ
సాహసము మాబోటి సామాన్యులెవరైన
నను చేసిన అంత నష్టముండ"దని చెప్పిరి.
ఆపైన సయిన్యము యావత్తు దుర్గము నెక్క
బోయి శత్రుల ఫిరంగిగుండ్లధాటికి తాళజా
లక మడసిరి. అంత బుచ్చన్నగారి ధర్మమున
బ్రతికితినిగదాయని సీతారామరాజుగారు ప్ర
త్యక్షముగ నాయననుగూర్చి "బుచ్చన్న
గారివంటి ప్రధాని, ఆయన ఆలోచనవంటి
యాలోచన లేదు. ఇంతకంటె మనకు వేరె
దైవము లేదు. వారిపై విరోధము బూనిన
మనకు దైవసాహాయ్యము లేదని" చాల వివే
కము తెచ్చికొని ప్రసంగించెను.

ఈ విధముగ బుఱ్ఱా బుచ్చన్నగారు
మిత్రుల యొక్కయు, శత్రుల యొక్కయు
మన్ననలకు పాత్రుడయ్యెను బుచ్చన్న ప్రభు
భక్తిపరాయణత, ధర్మనిరతి, పట్టుదల,
ధీశక్తి, మంత్రాంగసిద్ధి ఆంధ్రలోకమున
కాదర్శప్రాయమై ఆంధ్రులలో మఱికొంత
మంది నైనను బుచ్చన్నవంటి ప్రజ్ఞావంతులను
చేయునుగాకయని యాశించుచున్నాను.

—ధేరం వేంకటనాధశాస్త్రి, బి.ఏ,బి.ఇ.డి.

## ౪

# దుబ్బాక వేంకటసుబ్బాశాస్త్రి

ఈ దుబ్బాక వేంకటసుబ్బాశాస్త్రి మునికినాటి వైదికుఁడు. పుట్టినగ్రామము కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకా వేలాల. తల్లి లక్ష్మమ్మ; తండ్రి చిదంబరయ్య; శాలంకాయనసగోత్రుఁడు. 43 ఏండ్లు బ్రదికినాఁడు. 25 ఏండ్లక్రితము గతించినాఁడు.

సామాన్యమయిన చదువు - సాహసమే పాండిత్యము. శృంగారప్రియుఁడు; విషయలోలుఁడు. సంగీత-సాహిత్యములను కాస్త నంజుకున్నాఁడు. లౌకికవృత్తి చవిగొన్నాఁడు. లాయేజెంటుగా కొంతకాలము గడపినాఁడు. శబ్దములను ఛందోబద్ధము సేయనెఱిఁగినాఁడు. పద్యాలూ, పాటలూ అల్లినాఁడు. ప్రపంచానుభూతిని ప్రయోగమునఁ బెట్టినాఁడు. ఖండకావ్యములు వ్రాసినాఁడు. హరికథలు వ్రాసినాఁడు. నాటకములను వ్రాసినాఁడు. రసికత్వానికిఁదగిన రూపము; రూపాన్ని మెఱయింపఁగల నాగరకవేషము; వేషాన్నిపోషించు వాగ్భూషణము; వాగ్భూషణము రక్తికట్టించు రాగధోరణి—అనుకూలపడినవి. పల్లెటూళ్ళ మొదలు పట్నాలవఱకు పౌరాణికవృత్తిఁ బఱపినాఁడు. హరికథలు సెప్పినాఁడు. పదుగురను మెప్పించినాఁడు. పైసా గడించినాఁడు. పాచిసొమ్ము శేషింపనీకుండా ఖయిసలాతీ చిత్తాలో పాతాఖర్చు వ్రాసినాఁడు. ఆర్జనకన్న ఆశముందునకు పరువిడినది ఆశకన్నముందు అప్పులు తఱిమినవి. దైన్యమునెఱుఁగని జీవనము. తనివితీఱని భోగలాలసత్వము.

గ్రంథకర్త యనిపించుకొన్నాఁడు. అనుభవజ్ఞతకు మాటనేర్పు జతపడినది; ధారయేర్పడినది. లక్ష్య-లక్షణములు కడ కొత్తిగిలినవి. కవిత్వపుకట్టుబొట్లు పురివిచ్చిసడలినవి. ఈయనవ్రాసిన పొత్తములు: 'కౌసల్యాపరిణయము', 'జయదేవచరిత్రము—(హరికథలు). 'కాళిదాసచరిత'; 'హరిశ్చంద్ర'— (నాటకములు). 'వారాంగనాప్రవర్తనము (ఖండకావ్యము).

ఈయన రచనలకు మచ్చులు:

"ధరణీశుం డలకోసలేశ్వరుఁడు
సంతానార్థియై మాధవున్
వరభక్తిన్ భజియించిమించి పడ
సెన్ వాణీసమన్ బుత్రికన్;
సరవిం దస్వికిఁ బెండ్లియా డొదవె
నాతన్మకాంతుఁ డంపెన్ ననున్
వరునిన్ సుందరునిన్ నృపాలకను
తున్ వైళంబ కన్పట్టగన్."

తోహర—

"ద్విజునిమాటలకు సంతసించి
బహుదివ్యంబని మదినెంచి।
యజుఁడు ముహూర్తము నిశ్చయించె
ఘను నావసిష్ఠురావించి."

—(కౌసల్యాపరిణయము.)

"పయ్యెదఁ జార్చు, నిక్కుచును
బంతులుపేరెదఁ జేర్చుఁ, గుల్కుచున్
నెయ్యమెలర్పఁ చిల్కు, నెఱ
నీటు నటించు, కవుంగలించుచున్,
దయ్యము సాక్షినీకు నిదె
దక్కితి, నీయెడబాటుసైఁప, నన్
జయ్యనఁ దేర్పరా యనుచు
జట్టిగొనున్ వెలయాలు ధూర్తునిన్!"

—(వారాంగనాప్రవర్తనము)

## ౫

# హకీమ్ మహబూబ్ మియాన్

ఈయన పుట్టినది ప్రొద్దుటూరు (కడపజిల్లా). తండ్రి హకీం ఇమామ్ సాహేబు. జననము 1886.

కాలగతి 1928 సం. 42 సంవత్సరములు ఐహికయాత్ర జరిపినాఁడు. మతతత్త్వమెఱిఁగిన మహమ్మదీయుఁడు. మిత్రసంపన్నుఁడు; ప్రేమజీవి. తెలుఁగు రుచిఁ గన్నాఁడు. ఆంగ్లభాషాసంస్కారము అలవడినది. ఉపాధ్యాయవృత్తిని వరించి తరించినాఁడు. నియతిగల జీవనము. నిరాడంబరముగు నడక. భాగ్యవశమున ఇరువురు హిందువులు బాలసఖులయినారు.* తలలు మూఁడయినను మనసులొక్కటిగ మెలఁగినారు. ముప్వురును కవితాకళాభిరతియందు ఒక్కమతమునకుఁ జెందినవారు. ముప్వురి నేస్తమునకు చిహ్నముగా 'నీతిసుధానిధి' వెలసిన్నది. ఈ నిధికి కథావశేషుఁడు కొమర్రాజు లక్ష్మణరాయఁడు మున్నుడి వ్రాసినాడు. ఇట్లు:

"'నీతిసుధానిధి' అను నీపొత్తము ముప్వురు కవులచే రచింపఁబడినది. వీరుముప్వురు భిన్నజాతి - మతముల వారయినను సోదరులవలె గ్రంథరచనయందు నైక్యము జెందుట కడుచిత్రము; అభినందనీయము. ఇదివఱకున్న కవిత్రమునందలి వారు భిన్నకాలీనులు, ఏకజాతివారు. కాలక్రమమునఁ గవిపుంగవులన్న ఖ్యాతింజెంది ఆధునికసమకాలిక భిన్నవర్ణకవిత్రయమన్న బిరుదుఁ బొందుదురుగాక.........ఈ గ్రంథమున సులభమయిన వృత్తము, మృదుశైలి, నీతిబోధ, మనోరంజనము అను గుణములన్నియు బాలుర నాకర్షింపఁదగినవి కలవు... .........ఇంగ్లీషు కవిత్వపద్ధతి ననుసరించి ఆంధ్రమున నూతనమార్గముఁ ద్రొక్కిన యీ నవకవులకు విద్యాశాఖవారును, ఆంధ్రదేశమందలి విద్యాధికులును తగిన గౌరవప్రోత్సాహములఁ గలుగఁజేయుదురని నా నమ్మకము."

ఈ లక్ష్మణరాయఁడు వస్తువునకుదగిన ప్రశంస చేసినాఁడు. 1916-17 సం॥ లో ప్రొద్దుటూరు నగరమునఁ బ్రవర్తిల్లిన 'ఆంధ్రచంద్రిక' యందు ఈ కవిత్రయము పురుషకారము చేరినది. సఖ్యమునకు సహృదయత్వమునకు, సహనశీలమునకు ఉదాహరణభూతముగ వర్తించినది ఈ కవిత్రయము.

ప్రసక్తమునందలి మహబూబుమియాఁ కవిని గూర్చి ప్రత్యేకముగఁ గొన్నిమాటలు: ఈయన "అభినవ సుమతిశతకము" నొకదానిని రచించెను. అది పెక్కురు పండితకవుల అభినందనములంగన్నది. ఈ సాహెబు తెలుఁగువ్యాకరణమర్యాద ఎఱిఁగినాఁడు. తెలుఁగు నుడికారమునందలి తీఁపికి మఱిగినాఁడు. కృషి కిఁదగిన పదను నగపడినది; మొగ్గదొడిగినది; వికసించి పరిమళింప నుండినంతలో జీవయాత్రముగిసినది. సంసారలాంపట్యమునకన్న సాహిత్యాలసత్వముననే ఎక్కుడు కాలము గడచినది. తగిన నేస్తుఁడని, దయగల ఉపాధ్యాయుఁడని, నీతిమంతుఁడని, నిజమయిన ముసల్మానుఁడని, సాధుశీలుఁడని ఉగ్గడింపఁబడినాఁడు. మంచితనమును పంచిపెట్టి, ఊరివారికూర్మిని దారిబత్తెముగాఁ గొని తరలినాఁడు. ఇస్లామ్ మతమునకు తనువిచ్చి, హిందూమతమునకు మనసిచ్చినాఁడు.

ఈతని రచనకు నమూనా:

"పట్టుమని పట్టెడన్నము పెట్టువార
లెవ్వరీయెడఁగల? రింక నెవరుదిక్కు;
ప్రభువెఱుగుఁగాక, ఎన్నాళ్లు ప్రజలనెల్ల
రక్షణ మొనర్పు నది యెంత రాజ్యమైన!
..............................."

"అన్నహీనమై యిభ్భంగి నలమటించు
ప్రజను గావకయున్న నీపాపిరాజ్య
మేమిసేయను! కాల్పనా! యింక నేమి
కాలహరణము లేక రక్షణమొనర్ప
వలయు నేర్పాటులొనరింప వలయు' ననుచుఁ
గ్రిందిక్రమము ప్రతిగ్రామమందు నిలిపె.
..............................."

—('నీతిసుధానిధి')

—మున్నంగి శర్మ.

---

* బ్రహ్మశ్రీ భూతపురి నారాయణస్వామిగారు. మ-రా-శ్రీ కసిరెడ్డి వేంకటసుబ్బారెడ్డిగారు.

# "భ్రమ"

సీతే కోరి దీక్షితుల్ని వీణావాయిద్యం నేర్పడానికి గురువుగా స్వీకరించింది. * * *

ప్రక్కగదిలో శివరావు వాలుకుర్చీలో కూచొని పేపరు చదువుకుంటున్నాడు. ప్రక్కగదిలోంచి వీణ శ్రుతికి సరిపెట్టుకుంటూన్నట్టు, అతనికి వినిపించింది. వెంటనే పేపరు కుడిచేతిప్రక్కనున్న స్టూల్ మీద విసిరి ఒక్కమారు ఒళ్ళువిరుచుకొని పాటవినడానికి సావకాశంగా కుర్చీకిచేరబడి కూచున్నాడు. ఇంతలో చైతన్యంలేని ప్రోడు ఉక్కుతీగల్లోంచి మనోహరంగా "విడెమూ సేయావే" అన్న త్యాగయ్యకృతిని ఒక్కసారి ఉబికించింది. జీవంలేని మొరకుకఱ్ఱ ఇంత సుకుమారంగా పాడుతుందా! సీతే యిలాగ పాడుతూందేమో అనుకున్నాడు తనముందు సిగ్గుచేత సీత బాగా పాడలేదని శివరావుకి తెలుసును. ఇంతలో ఒండొకటి మిళితమై రెండు సన్ననిస్వరాలు 'విడెమూ సేయావే' అంటున్నాయి. ఆ రెండుపాటలకూ దీక్షితులు లయ వేస్తూన్నట్టు చిరుచప్పట్లు వినిపిస్తున్నాయి. శివరావు శీగ్గా కూచున్నాడు. పాట స్పష్టంగా అర్థమవుతూంది. పువ్వులతోటలో పిల్లవాయువును కౌగిలించుకొన్న పుష్పసౌరభంలాగ, సీతకంఠస్వరం వీణలో కలిసిపోయి గదిలోంచి పైకొస్తూంది. శివరావు తలతిప్పుతూ కాలి స్లిప్పరుతో లయవేస్తున్నాడు. ఆపాట అతనిచెవిలో రింగుమంటూంది. ఒకప్పుడు శరీరమంతా చెవిచేసుకొని వింటున్నాడు. సీతకంఠస్వరంలో వీణ యెలాగ లీనమైపోయిందో శివరావుయొక్క హృదయం పాటలోఅలాగ లీనమయిపోయింది. కళ్ళుమూసుకొని కుర్చీకి చేరబడి వింటున్నాడు...హఠాత్తుగా పాట ఆగిపోయింది.

ఇంకా పాడవలసిన చరణాలున్నాయని శివరావుకి తెలుసును. ఎందుకిలాగ సగంలో నిలిపేసిందా? అని ఆశ్చర్యపడ్డాడు. దిగ్గునలేచి ఓరవాకిలిగా వేసిన ప్రక్కగది తలుపులోంచి లోపలికి చూచేడు. దీక్షితులు ఒకచేత్తో సీతఎడంచెయ్యి పట్టుకొని యింకోచేత్తో ఆమె చేతివేళ్ళు తనపెదవులదగ్గిర పెట్టుకుంటూన్నట్టు శివరావుకి కనిపించింది. కళ్ళుమూసుకొని గిఱ్ఱునతిరిగి రోడ్డుమీదకురికి వెఱ్ఱెత్తినట్టు పరిగెత్తడం ప్రారంభించేడు శివరావు. తీగలుతెగిన వీణ ఆమెప్రక్క దొర్లుతూంది. ఆమెకట్టుకున్న తెల్లటిచీరమీద రక్తపు చినుకులు కెంపురవ్వల మోస్తరుగా మెరుస్తున్నాయి.

"అమ్మా! వేలికింత పలాస్త్రీయేనా పెట్టండి" అని దీక్షితులు లేచిపోయేడు.

"వీణతీగలు తెగి ఎంతపని చేసేయండీ!" అంది సీత.

—మల్లాది వేంకటకృష్ణశర్మ.

# నిరీక్షణము

అబ్బా! నేను వారి నిరీక్షణమున విలపించి గడపిన ఆ ఘడియలుగూడ ఎంత అభాగ్యమైనవి!! ఆ ఘడియలు ఆశనుగొల్పుచుండెను గాని నిరాశనే ఎదుర్కొనుచుండెను! వానిలో మాధుర్యముండెను, గాని రుచిలేదు! ఉల్లాసముండెను, గాని అది వియోగాగ్నిమధ్యమున భస్మీపటలమగుచుండెను! ప్రకాశముండెను, గాని దానిపై నిరాశాఘనము ఆచ్ఛాదితమైయుండెను! ఉన్మాదముండెను, గాని అది మాదకతాశూన్యమైయుండెను! మత్తుండెను, గాని అంయుస్మృతి హీనతలేదు! నా అనురాగమంతయు అర్థరహితముగానే ఉండెను!

అయ్యో! ప్రేమసముద్రమున దావానలము రగుల్కొనెను! మరి నేత్రములో? స్నేహానురాగముల నొలికించు ఆవీక్షణములు నిరాశావేదనమున వెచ్చని కన్నీరు నొలికించుచుండెను! ఆ చూపులు—నిట్టూర్పులు, వ్యథాట్టహాసమును, సంతాపమును, దెలుపుచుండెనేగాని ఆశను పురికొల్పుటలేదు! ఆ నేత్రములు దగ్ధమగుచు కొన్ని చల్లనిరాత్రులను, వెచ్చని పగళ్ళను గాంచినవి! కాని భాగ్యముపండలేదు! ఆ కోమలాక్షి విలపించి అలసిసొలసి డస్సినప్పుడు, నిరీక్షించి నిరీక్షించి పరాజయమొందినప్పుడు, తాను దగ్ధమగుచున్న తన జీవనమును నిరీక్షణసమాధిపై, దర్శనసాధనముపై, రూపుమాపివైచినప్పుడు, తుదకు దర్శనమబ్బెను!!

—ద్రోణంరాజు నరసింహారావు.

# మూడు ప్రశ్నలు

[టాల్‌స్టాయి మహాశయునిచే రచియింపబడిన - మానవుని ఉద్గతికి సాయపడు.
భావములుగల - కథావ్యాసమున కనువాదము.]

ఒకానొక రాజున్నాడు. ఏదైనా పని ప్రారంభించటానికి తగిన ముహూర్తమేదో ముందుగానే తనకు తెలిసివుంటే; ఎటువంటి మనుష్యులసలహాలు అవశ్యంగా వినదగినవో, ఎవళ్ళమాటలు వినగూడనివో తనకు తెలిసివుంటే; తానుచేసే పనులలోకల్లా అతిముఖ్యమైనపని యేదో తెలిసివుంటే, తానుపట్టిన ప్రతిపనీ నిర్విఘ్నంగా నెరవేర్చి హాయిగా బ్రతకవచ్చుననుకుంటూ వుండేవాడు.

ఇట్లనుకొని తనరాజ్యమంతటా ఒక ప్రకటన చేయించాడు రాజు. ఏపనిగాని ప్రారంభించటానికి ఉత్తమమైన సమయమేదో, ఎటువంటిమనుష్యుల సలహా తనకత్యవసరంగా కావలసివుంటుందో, అన్ని పనులలో ఉత్కృష్టమైనపని యిదియని తెలుసుకొనటమెట్లాగో చెప్పగలిగిన వానికి గొప్ప బహుమానమిస్తానని ప్రకటింపజేశాడు.

రాజు పిలుపువిని మహాపండితులనేకులు వచ్చారు. అనేకులనేకవిధాల రాజు ప్రశ్నలకు జవాబిచ్చారు.

మొదటిప్రశ్నను గూర్చి కొందరిట్లా సలహా యిచ్చారు: రోజులు, నెలలు, సంవత్సరాలు స్పష్టంగా తెలుస్తూవుండేలాగున ఒకపంచాంగం తయారుచేసి, యెల్లప్పుడూదాన్ని ముందుంచుకొని, దీక్షతో దానినే అనుసరించి నడుచుకొంటూవుంటే, విధిగా ప్రతిపనీ మంచిముహూర్తాన్నే జరుగుతుందన్నారు. మరికొందరు యీ యభిప్రాయాన్ని ఖండిస్తూ యేపనికైనా అనుకూలమైన సమయమేదో ముందుగా నిర్ధారణ కావడం అసంభవమన్నారు. ఎల్లప్పుడూ యేవో అనావశ్యకపు గొడవలలో మునిగి వృధాకాలక్షేపం చేయకుండా, యెక్కడ యేపనెట్లా జరుగుతున్నదో మెలకువలో కనిపెడుతూవుంటే, యెప్పటికేపని అత్యవసరమో తెలుస్తుందని కొందరన్నారు. మరికొందరు మరొకరీతిగా చెప్పినారు. ఎంత జాగ్రతతో కాలగతిని కనిపెడుతూవున్నా, యేపనికేసమయం తగినదో ఒక్కమనిషి కనుగొనటం చాల కష్టసాధ్యం. బాగా ప్రపంచానుభవంగల ఒక ఆలోచనసంఘాన్ని దగ్గర పెట్టుకుంటేనే గాని రాజొక్కడూ, తనంతటతాను, యేపనికిగాని కాలనిర్ణయం చేసుకోలేడన్నారు

"ఆలోచనసభను సమకూర్చి విషయం చర్చకు పెట్టేవరకూ వ్యవధిలేని కొన్ని జరూరువిషయాలుండవచ్చు. పని ప్రారంభించదగునో కూడదో తక్షణమే నిర్ధారణకావలసిన సందర్భాలుంటాయి. పోనీ యేదో ఒకరీతిగా నిశ్చయంచేదామంటే, పర్యవసాన మెట్లా తేలుతుందో ముందే కొంతవరకు తెలిసివుండటంకూడా అవసరమే. తంత్రగాళ్ళకు, గారడీవాళ్ళకు మాత్రమే ముందురాబోయే విషయాలు తెలుస్తాయి. కనుక యేపనికైనా ముహూర్తనిర్ణయం చేసేటప్పుడు ముందుగా గారడివాళ్ళలో సంప్రదించాలి" అన్నారు మరికొందరు.

రెండోప్రశ్నకు కూడ అనేకరకాల జవాబులు వచ్చాయి. రాజుకి అందరికంటే మంత్రులే యెక్కువ అవశ్యకమైన వాళ్ళన్నారు కొందరు. మంత్రులుకాదు, పురోహితులే రాజు కత్యవసరమైన మనుష్యులన్నారు మరికొందరు. మంత్రులూ కాదు, పురోహితులూ కాదు, వైద్యులకంటే ఎక్కువ అవసరమైనవాళ్ళు రాజుకి మరెవ్వరూ కారని కొందరన్నారు. ఇంకాకొందరన్నారు యుద్ధభటులే చాల ఆవశ్యకమని.

ఇక మూడవప్రశ్న: పనులలోకల్లా ముఖ్యమై, యెక్కువగా శ్రద్ధవహించి చేయవలసిన పనియేది? ప్రకృతిశాస్త్రపరిశోధనే అవశ్యంగా చేయవలసిన పని

అన్నారు కొందరు. యుద్ధంచేయటంలో నైపుణ్యం సంపాదించటమే మహావిద్యయని కొందరు. భగవధ్ధ్యానం, భగవత్ప్రార్థనమాత్రమే పరమకర్తవ్యమని కొందరు అన్నారు.

ఇట్లా యెవరికితోచినట్లుగా వారు జవాబిచ్చారు పండితులు. ఈ అభిప్రాయాలలో విపరీతమైన వ్యత్యాసాలుండటంచేత, ఒక్కరిమాటకూడా రాజుకి నచ్చక మనస్సు మరింత కలవరపడ్డది. సరియైన జవాబుచెప్పగల సమర్థునికి ఆనా డియ్యవలసిన బహుమానం ఒక్కరికీ యియ్యలేదు. రాజు తనప్రయత్నంమాత్రం అంతటితో విరమించలేదు. మహాజ్ఞానియని ప్రసిద్ధిపొందిన సాధువు ఆరాజ్యంలోనే ఒకడున్నాడు. తనప్రశ్నలకు సరియైన సమాధానం ఆసాధువు నడిగి తెలుసుకోవాలని రాజు నిశ్చయించుకున్నాడు.

ఒక అరణ్యంలో నివాసమున్నాడు సన్యాసి. ఆ చోటువిడిచి యెప్పుడూ యెక్కడికీ కదిలిపోయేవాడు కాడు. డాబుదర్పాలులేని సామాన్యప్రజలకేగాని మరెవ్వరికీ దర్శనమిచ్చేవాడుకాడు. రాజంతుకే తానుకూడా సామాన్యదుస్తులే ధరించా డారోజున. సాధువుయొక్క కుటీరానికి కొంతదూరాన్నే గుఱ్ఱందిగి, రక్షకభటుల నక్కడనే దిగవిడిచి ఒంటరిగా సాధువువద్దకు పోయినాడు.

రాజువచ్చి చూచేసరికి సాధువు తనకుటీరం ముందున్న నేల తవ్వుతూ కూర్చున్నాడు. సంతోషపూర్వకంగా రాజుకి స్వాగతమిచ్చి, తిరిగి తవ్వేపని ప్రారంభించాడు. సాధువు బహుఅర్భకుడు. తవ్వకోలతో ఒక్కొక్క బెడ్డచొప్పున పెల్లగిస్తూ, బలహీనతచేత యెక్కువగా అలసి ఆయాసపడుతున్నాడు.

రాజు సాధువును సమీపించి యిట్లన్నాడు: "మహాత్మా! నిన్ను మూడుప్రశ్నలడిగి వాటికి తగిన సమాధానం పొందగలననే నమ్మకంతో ఇక్కడికి వచ్చాను. ఏదైనాపని ఆరంభించటానికి సరియైన ముహూర్తమేదో తెలుసుకోనేదెట్లా ? నే నెల్లప్పుడూ యెవరిసలహా యెక్కువగా అపేక్షించవలె ? అన్ని పనులలో యెక్కువ శ్రద్ధతో నేను నెరవేర్చవలసిన పని యేది ?"

రాజడిగిన ప్రశ్నలు సాధువు శ్రద్ధతోనే ఆలకించాడు. కాని జవాబుచెప్పలేదు. తిరిగి తవ్వటం ప్రారంభించాడు.

"అయ్యా, నీకలసటగావున్నట్లున్నది. గునపం నాకిచ్చి కొంతసేపు నన్ను తవ్వనియ్యి—నీవు కూర్చో" మన్నాడు రాజు.

రాజుమాటకు సాధువు సంతోషం వెలిబుచ్చి, వందనపూర్వకంగా తవ్వకోల రాజుచేతికిచ్చి పక్కనే కూర్చున్నాడు.

రాజుకూడా రెండుమళ్ళుతవ్వి, అంతటితో పని నిలిపి, తానడగవచ్చిన ప్రశ్నలు మూడు తిరిగి యేకరువు పెట్టినాడు. సాధువు ప్రత్యుత్తరం చెప్పకుండానే లేచి నిలబడి రాజువద్దనున్న తవ్వకోల అందిపుచ్చుకోబోతూ "ఇక నీవు విశ్రాంతి తీసుకోవయ్యా—మరి కొంతసేపు నేను తవ్వుతాను" అన్నాడు.

కాని రాజు తవ్వకోల సాధువుకియ్యలేదు. తిరిగి తానే తవ్వటం ప్రారంభించాడు. అట్లా ఒకగంట గడిచింది. ఇంకా తవ్వుతూనేవున్నాడు. రెండవగంట కూడా గడిచింది సూర్యుడు పడమటిదిక్కున చెట్ల చాటుకి దిగిపోయినాడు అంతటితో పని నిలిపి, గునపం భూమిలోగుచ్చి, రాజు సాధువుతో యిట్లన్నాడు : "మహాత్మా! నాప్రశ్నలకు సరియైన జవాబు దొరుకుతుందనే ఆశతో నీదర్శనానికి వచ్చాను. నీవు నాకు చెప్పే సమాధానమేమీ లేనట్లయితే, లేదని చెపితే తిరిగి యింటికైనా పోతాను"

"ఇదిగో, యిట్లాయెవరో పరుగెత్తుకొని వస్తున్నాడు. అత డెవరో చూదాం వుండు." అన్నాడు సాధువు.

వెనక్కుతిరిగి చూచాడు రాజు.

ఆవైపునుంచే ఒకపెద్ద గడ్డంతాత అడవిలోనుంచి పరుగెత్తుకొని వస్తున్నాడు. చేతులతో పొట్ట గట్టిగా నొక్కిపట్టుకొని తొందరగా వస్తున్నాడు. నొక్కిపెట్టిన చేతుల కిందనుంచి రక్తం యేకధారగా బయటికి

వస్తున్నది. ముసలివాడు రాజుపక్కకు వచ్చి సొమ్మసిల్లి మూలుగుతూ క్రిందపడ్డాడు. రాజూ సాధువూ యిద్దరూ కలిసి ముసలివాడు తొడుక్కున్న దుస్తులు విప్పిచూచారు. పొట్టమీద పెద్ద గాయమొకటి కనిపించింది. నీళ్ళు తెచ్చి గాయం శుభ్రంగా కడిగినాడు రాజు. తనవద్దనున్న జేబురుమాలు, సాధువువద్దనున్న మరొక తువాలు, రెండూ మడతపెట్టి గాయానికి కట్టు కట్టినాడు. ఐనా రక్తప్రవాహం కట్టుబడలేదు. రాజు మరిరెండుమూడు తడవలు కట్టువిప్పి గాయంకడిగి, తిరిగి కట్టుకడుతూవుండేవాడు. కొంతసేపటికి రక్తం కారటం ఆగింది. అక్కడితో ముసలివాడు కొంత తేరుకొని తాగటానికేదైనా యిమ్మని అడిగినాడు. కొంచెం మంచినీళ్ళు తెచ్చియిచ్చాడు రాజు. ఈలోగా సూర్యుడస్తమించి గాలి చల్లబడ్డది. సాధువుయొక్క సహాయంతో రాజు ముసలివాణ్ణి కుటీరంలోకి మోసుకొనిపోయి, పక్కమీద పరుండబెట్టినాడు. ముసలివాడు పక్కమీదికి చేరి కళ్ళుమూసుకొని నిశ్శబ్దంగా పడుకున్నాడు. రాజు ఆదినం నడిచిన నడకవల్లను, చేసిన పనివల్లను అలసిపోయి గుమ్మంలోనే పడుకొని నిద్రపోయినాడు. గాఢమైన నిద్రపట్టింది. రాత్రంతా నిద్రతోనే గడిచింది. తెల్లవారిలేచి కూర్చున్నాడు రాజు. తానిప్పుడెక్కడున్నాడో, పక్కమీద పడుకొని తనవంక తీక్షణంగా తేరి పారచూస్తున్న ఆ ముసలివాడెవరో జ్ఞప్తికి తెచ్చుకొనేసరికే కొంతసేపు పట్టింది.

రాజుకూడా నిద్రలేచి తనవంక చూస్తున్నాడని తెలుసుకొని, ముసలివాడు హీనస్వరంతో "నన్ను క్షమించవా? నాయనా!" అన్నాడు.

"అసలు నీవెవరవో నేనెరుగనే! నిన్ను నేను క్షమించవలసిన కారణమేమున్నది? ఏమీ కనిపించదు" అన్నాడు రాజు.

దానికి ముసలివాడిట్లా జవాబిచ్చాడు "నీవు నన్నెరుగవేమో కాని నిన్నుమాత్రం నే నెరుగుదును. నీవు నా సోదరుని చంపించి వానిఆస్తికూడా అపహరించినందుకుగాను ఎప్పటికైనా నీమీద పగతీర్చుకుంటానని శపథంచేసిన నీశత్రువును నేను. నీ వొంటరిగా సాధువు వద్దకు పోతున్నావని తెలుసుకొని, తిరిగి నీవింటికిపోయే దారిలో నిన్ను చంపేవుద్దేశంతో యిట్లావచ్చాను. దినమంతా వేచి కూర్చున్నా. నీజాడెక్కడా కనిపించలేదు. నేను దాగివున్నచోటు విడిచి బయటికివచ్చి నీకొరకు చూస్తుండగా, నీరక్షకభటులు నన్ను గుర్తుపట్టి కత్తితో పొడిచారు. అదే యీగాయం. అక్కడనుంచి పారిపోయి యిట్లావచ్చాను. గాయంకడిగి కట్టుగట్టి నీ వీయుపచారం చేయకపోతే, అప్పుడే ప్రాణంపోయివుండేది. నిన్ను చంపటానికే నేను వచ్చాను. నీవు నన్ను చావునుండి తప్పించావు. ఈగండంగడిచి నేనింకా బ్రతికివుండి, నీవొప్పుకుంటే, నాజీవితకాలమంతా నీ దాసానదాసుడనై సేవచేస్తూ బ్రతుకుతానయ్యా! నాతరువాత నాకుమారులుకూడా అదేవిధంగా నీసేవకులై వుండేటట్లు చేస్తాను. నాఅపరాధం క్షమించు తండ్రీ!"

ఇంత అద్భుతంగాను, సునాయాసంగాను శత్రువుతో సఖ్యత కుదిరినందుకు రాజు అమితానందభరితుడైనాడు. బద్ధశత్రువు పరమమిత్రుడైనాడు. రాజు ముసలివాణ్ణి క్షమించటమే కాకుండ తన సేవకులను కొందర్ని, తన స్వంతవైద్యునీ పంపి, తగిన చికిత్సకూ ఉపచారానికీ యేర్పాటుచేయిస్తాననీ; తానపహరించిన ఆస్తి తిరిగి ముసలివానికి స్వాధీనంచేస్తాననీ వాగ్దానం చేశాడు.

ముసలివానివద్ద సెలవుతీసుకొని తిరిగి సాధువు దర్శనార్థం పోయినాడు రాజు. తానింటికి పోయేముందు మరొకసారి సాధువునుచూచి తన ప్రశ్నలకు జవాబడిగి పోదామనుకున్నాడు. సాధువు నిన్న తవ్వివుంచిన మళ్ళలో విత్తనాలు చల్లుతూ కనిపించాడు.

సాధువును సమీపించి రాజు యిట్లన్నాడు: "అయ్యా! నాప్రశ్నలకు నీవు చెప్పగలిగిన జవాబుంటే చెప్పి, నాకు సెలవిచ్చి పంపమని ఆఖరుసారి తిరిగి ప్రార్థిస్తున్నాను."

"నీకు కావలసిన జవాబులు యిదివరకే వచ్చేశాయి" అంటూ మడిలోనే కూర్చుని గింజలుచల్లుతూ,

తలయెత్తి రాజువంక చూచి ప్రత్యుత్తరమిచ్చాడు సాధువు.

"ఇదివరకే జవాబులు రావటమేమిటి? అదెట్లా?" అని ఆశ్చర్యంతో రా జడిగినాడు.

"అయ్యో, నీకింకా తెలియనేలేదా? నిన్న నీ విక్కడికివచ్చి నాబలహీనతచూచి జాలిజెంది కష్టపడి యీమళ్ళన్నీ తవ్విపెట్టినావు. అట్లా సాయపడకుండా నీదారిని నీవు పోయివున్నట్లయితే, ఆముసలివాడు శత్రువై నిన్నెదుర్కొనేవుండునుకదా? అప్పుడు నా వద్దనే మరికొంతసేపుండకపోతినని విచారించి వుందువు. కనుక నీవిక్కడ మళ్ళుతవ్వుతూ కూర్చున్నసమయమే అమూల్యమైన సమయం. అప్పటికి నేనే ముఖ్యమైన మనిషిని. నాకుపకారంచేయటమే నీవుచేయువలసిన అతి ముఖ్యమైనపని. తరువాత కొంతసేపటికి ముసలివాడు మనవద్దకు పరుగెత్తుకొని వచ్చాడు. అతనికుపచారం చేయటంలో నీవు వినియోగించినసమయమే అతిపవిత్రమైనసమయం. ఎందుచేతనంటే, నీనుంచి ఆవుపకారం జరిగివుండకపోతే ముసలివాడప్పుడే చనిపోయుండేవాడు. మీ ఇద్దరికీ సఖ్యతకుదరటానికే అవకాశంలేకుండాపోయేది. కనుక ఆసమయానికి అతడే నీకత్యవసరంగా కావలసిన మనిషి. అతనికొరకు నీవుచేసిన సేవయే నీకు ముఖ్యకర్తవ్యమయింది. ఎప్పటికైనా యీమాట జ్ఞప్తియందుంచుకో! ఏక్షణాని కాక్షణమే అమూల్యమైన సమయమని గుర్తించవలె. ఎప్పటికప్పుడు "ప్రస్తుతక్షణమే" చాల విలువైనకాలం. గడచిపోయిన సమయం తిరిగిరాదు. ముందురాబోయే కాలం మనకు తెలియదు. ఇప్పుడు మనకండ్లముందర జరుగుతున్న క్షణమే మన సమస్తశక్తులు వినియోగపరచి పాటుపడి ఫలితానికి తేవలసినసమయం. భవిష్యత్తెట్లా వుంటుందో మనకు తెలియదుకనుక "ఇప్పుడు" అనగా ఎప్పటికప్పుడు ఎవరి సమక్షంలో నీవుంటావో వాడే నీకత్యవసరమైనమనిషి, ఉపకారచింతతో ఆమనిషికి సేవచేయటమే నీకు విధాయకమైనపని. పరోపకార చింతతో నిరంతరంమానవసేవ చేయటానికేకదా మానవు డీ ప్రపంచంలో సృష్టింపబడ్డాడు!

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం.ఏ.

# విషాదచ్ఛాయలు

## ౧

ఏయురస్సీమపైని నా యీ విషాద
భారమును దించుకొందు, నెవ్వరికినై బ
హూకరింతు నీనాటి కవోష్ణబాష్ప
మాలికలు ; సంతసంబెల్ల మాటు మణఁగి
యుండ, ఈనాటి నాదుఃఖ ముబికియుబికి
గానముఖమునఁ బ్రవహింపఁగాఁదొడంగె.

ఆమధురగానసీమ రమ్యంబె కాని
అందు పువుతోట లేలొకో అటునిటుకద
లాడివణకుచున్నవి యకారణముగానె.

## ౨

నే నొకవిషాదఘోరవార్నిధిని మునిఁగి
తేలుచున్న యేకాకిని, తీరభూమి
కెంతదవ్వంటినో యని యిటునటు మొగ
మెత్తి చూచుచుందును ; అది దృక్పథంబు
దాటిపోయిన దెన్నడో—ఏటి కింక
కాలుసేతు లాడించు చిక్కరణి లేని
పోని యాసలు, లోతుకు మునిగిపోయి
అచటి రత్నాల రత్నంబునై అగాధ
గహ్వరములందు వెన్నెలల్ గాతుగాక.

## ౩

ఈనిశార్ధభాగంబునం దీజగంబు
సాంతమును సుషుప్తిగని ప్రశాంతవడియె
నాకుమాత్రము కనుమూత లేక స్మృతి ప
థానఁ బూర్వానుభూతముల్ తలలుసూపె.

ఎవరెఱుంగుదు రీలేతహృదయమందు
రవులుచున్న దావానలప్రభలసెగలు,
ఎవరితోఁ జెప్పికొనఁబోదు, ఎవరుతీర్పఁ
గలరు, నేనే అనుభవింప వలెనుగాక.

నీరయిన నేత్రముచుక్కలే ధారగట్టి
కనుగొనలనుండి చెంపలఁ గారికారి
హృదయ మంతకంతకును శుష్కించిపోవ
నెందుకీ వ్యర్థజీవితం బీజగాన.

దట్టముగ సూచిభేద్యమై దశదిశాంత
రముల వ్యాపించు నీఘోరతిమిరమందు
లీనమైపోదునా యేమి? నేను, ఆత్మ
శాంతియగునేమొ అందైన కొంతవరకు.

౪

ఏలనో స్వర్గవాటిక యేని కాదు
మబ్బులలముకొని తెలివిమాలినదివి
పాండువర్ణమై; అలసతఁ బవనవీచి
కలు ఒరసికొనుచున్న వొకటి మరొకటి.

ముకుళితవనేజమై ఖరిం బొలుచు నా హృ
దంతరమున అనంతశబ్దంబొకటి ధ్వ
నింపసాగె.—తీరనికోర్కె యేమొ, లేని
చో ప్రణయతిరస్కారమో, నీప్రశాంత
భంగమునకు కారణము, ఈపగిది నాదు
హృదయమూ? ఏలఊరక మథనపడెదు?.

౫

ఇదియు చీకటిరాత్రియా? ఈమహాంధ
కారమున దారిగనుపడక యెటు పోవు
చుంటినో యెందుకోసమో, ఒక అవార్య
మైన శక్తియేదో నను వెన్నంటి తరుము.

ఎంతదూర మీగతిని గమింపవలెనొ
ఒక వెలుఁగుచాలుఁగూడ లేకుండ; ఎందు
దాగియున్నదో ననుఁజూచి తారకాగ
ణమ్ము, కావునలుపు గ్రమ్మినది నభమ్ము.

ఇకయెటు నడచిపోవుటో, ఏ యగమ్య
పర్వతశ్రేణు లెక్కుటో; పాడువడిన
బావులందెందు కూలుటో, పడగరాని
యిసుములెన్ని కుడుచుటో యికేది గతియొ.

గ్రుడ్లు తెరచి ఒక వెలుగుకొరకు ఎదురు
తెన్ను లరయుచున్నాను ప్రాగ్దిశనుదుట
నే యపరరాత్రికైన క్షీణేందురేఖ
వదలునో లేక యిది అమావాస్యనిశియొ.

౬


అంధతమసంబు గ్రామిన యాకసంబు,
మించి యున్మాదవశత వీతెంచు వాయు
వీచికలు, నల మృత్యుదేవీప్రచండ
నాట్యరంగస్థలంబులైనవి గదన్న!

పొంగి పేరార్చు రాకాసివోలె నైన
యీ మహాబ్ధి యుల్కాధ్వను లన్నదీయు
హృదయకుహరాన బిట్టు మ్రోగింపసాగె;

మృత్యుదేవతపిలుపు గొంతెత్తె ఈ య
నంతగాఢాంధకారగహ్వరమునుండి;
ఒక మెరుపుగూడ లేని యీ యుగ్రనిశిని
ప్రళయ మిది భయంకరకేళి వలచెకోలు-
ఆదితుదిలేక నాయంతరాత్మ నిండి.

పోయినది యాత్మపా నిక, మునిగిపోవు
చున్నయది నామనోనౌకయును రయంబె.
ఈ ప్రళయజలమందు, ఈ మృత్యుతటము
నందు నాహృదయ మస్తమయమై పోయె.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.




# మహాకావ్యరచన : ఖండకావ్యరచన

ఇది ఖండకావ్యములే కాని మహాకావ్యములవతరించు కాలముగాదని కొందఱు విమర్శకులందురు. మనుష్యజాతికంతయు నీ న్యాయమెంతవఱకన్వయించునో చెప్పఁగల విశ్వదృష్టి నాకు లేదు. ప్రకృతము మన దేశమునమాత్రము ఇది చాలవఱకు సత్యమనక తప్పదు. ఎందుకనఁగా మహత్త్వము అను ధర్మము తక్కిన జీవితవ్యవహారములలో లేనిది కావ్యములందుమాత్ర మెట్లు పొడసూపఁగలదు? ఇప్పటి మన ఆశలు ఆస్తులు ఉద్రేకములు ఓర్పులు—అన్నియు నల్పములు. మనలో నిజముగా వేదాంతము బ్రదికియున్న కాలమున ఉపదేశింపఁబడిన అల్పతృప్తి యిప్పుడు సిద్ధించినది. సముద్రమునకు సేతువుగట్టు సాహసమునకుఁ బూనువారికాలమున 'శతకోటి ప్రవిస్తర' మగు కావ్యమును రచించు యోచనజనించుట వింతకాదు. అట్లే అరకప్పు కాఫీతో ఆఁకలి తీర్చుకొనువారి చేతిపనులు చిన్నవిగా నుండుటయు నరుదుకాదు. కావ్యము లెట్టివో కార్యములు నట్టివేయగును. ఈమాట కావ్యపుఁ బ్రమాణమునకు మాత్రమేకాక యందలి వస్తువు, పాత్రములు, సన్నివేశములు మొదలగు నన్నిటికిని అన్వయించును.

అనఁగా చిన్నకావ్యములు పరిత్యాజ్యములని చెప్పరాలేదు. మహాకావ్యములు వ్రాయలేక పోయితిమేయని పరితాపపడవలసినదే కాని లఘుకావ్యములు వ్రాయుచున్నామేయని లజ్జపడవలసిన పనిలేదు. సృష్టిలో పిన్నపెద్దలు రెండును స్వతంత్రములు, ఆవశ్యకములు. గుణదోషములు రెండును రెంటను గలవు. గొప్పవస్తువునందలి గాంభీర్యము చిన్నవస్తువున కుండదు; చిన్నదానికిగల చెలువము గొప్పదానికి రాదు. పెద్దలకు మ్రొక్కులు, పిల్లలకు ముద్దులు. వస్తువు పెద్దదియగునట్లెల్ల నయనాణ్యములుతగ్గును. చిన్నదియైనట్లెల్ల గౌరవగాంభీర్యములు కృశించును. రెండు గుణములును ఒకచోఁ జేరుట సృష్టిలోని యుద్దేశమే కాదేమో!

మన ప్రాచీను లీరెంటి తత్త్వము నెఱిఁగినవారు. కేవలము పరిమాణప్రియులై వారు మహాభారతమువంటి మహాకావ్యములనుమాత్రమే వ్రాసి యూరకుండలేదు. మేఘసందేశమువంటి మురిపెముల మూటలను వ్రాసిరి. ప్రాకృతములో సేతుబంధము వంటి గంభీరకావ్యములతోపాటు 'గాథ'లను రసఘుటికలను వేలకొలఁదిగా గాలికి విసరి భరతఖండము వీధివీధులందును వెల

యించిరి. శృంగారనైషధము నూఱిన శ్రీనాథుఁడే సీసకమలములవంటి చాటుపద్యముల నెన్నింటినో వెదచల్లెను. ఇట్టి 'చాటు' కవితలు మహాకవితలకెందును వెలలో తీసిపోనివి. మఱియు అనేకమహాకావ్యములకంటె అనేకచాటువులలో రామణీయక మెక్కువ యనుటయు అనుభవవేద్యము.

ఖండకావ్యములు మహాకావ్యములకంటె సులభముగా రచింపవచ్చునని తలఁచుటయు పొరబాటు. కొన్ని విషయముల వానికన్న నివి కష్టములును. మహాకావ్యములందలి కథ, పాత్రములు మొదలగువాని మహత్త్వము మఱుఁగులో చిల్లర రచనాలోపము లెన్నియో తలదాఁచుకొనును. చిన్నకావ్యములలో నట్లుగాదు. అన్నియు చిన్నవిగావున ఇందంగాంగపరీక్ష యెక్కువ. కాఁబట్టి అత్యల్పలోపములనుగూడ గమనించి తొలఁగించుకొను శక్తిలేని కవి దీనికిఁ జేయివేసిన నగుబాట్లపాలగును. ఇదిగాక గొప్పకావ్యములలో భావములకును అభిప్రాయములకును తగినంత గొప్పతనమును బలమును ఇచ్చి రూపుగొల్పుటకు వలసినంత పూర్వోత్తరసందర్భములను వివరించుట కవకాశమున్నది. ఖండకావ్యములలో అతిముఖ్యమైన విషయములు తప్పఁ దక్కినవి విస్తరింప వీలులేదు. సంగ్రహము వీనికిని, విస్తరము వానికిని స్వాభావికలక్షణము. పనికిమాలిన విస్తరము మహాకావ్యములలో నెంతదోషమో పనిచెఱుచు సంగ్రహము ఖండకావ్యములలో నంతకన్న దోషముగును. కావ్యము కొలఁతను తగ్గించుటలో నందలి విషయపు తీవ్రతనుగూడ తక్కువపఱచు నపాయముగలదు.

—రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

# ప్రాతినిధిక ప్రభుత్వము

(Representative Governmet)

ఏ ప్రభుత్వవిధానమున నొకదేశము యొక్క ప్రజలందఱును పాల్గొందురో అది యాదర్శప్రభుత్వ మనఁబడును. పూర్వము రాజ్యము లనతివిస్తృతములై యుండుటచే, యట్టి రాజ్యాంగపద్ధతిలో ప్రజలు ప్రత్యక్షప్రవేశమును ప్రాపించుటకు వీలుండెడిది. అప్పుడు పురాతనగ్రీసు రాజ్యాంగవిధానమునవలె, ప్రజలందఱు నొక్కయెడ సమావేశమై, దైనందినము ప్రభుత్వమును సాగించుట సుకరముగానుండెడిది. ఆధునికరాజ్యములు విస్తృతియందును, జనసంఖ్యయందును గరిష్ఠములగుటచే, ప్రజలందఱు నొక్కయెడకూడుట కష్టము. అందుచే ప్రజాసమితి తనచే తాత్కాలికముగా నెన్నుకొనబడిన ప్రతినిధులద్వారా తన సర్వసమ్మతిని వెలిబుచ్చుట యావశ్యకమైనది. ఈ ప్రతినిధులే తమ్మెన్నుకొనిన ప్రజాసమితి మారుగా రాజ్యాంగవిధానమును సాగింతురు. ఇట్టి ప్రభుత్వవిధానమునకే ప్రాతినిధ్యప్రభుత్వమని పేరు. మిల్లు మొదలగు పలువురు రాజకీయశాస్త్రజ్ఞులచే నిట్టి ప్రభుత్వపద్ధతి మిక్కిలి శ్లాఘింపబడినది.

రాజకీయసిద్ధాంతములలో ప్రాతినిధ్యప్రభుత్వసూత్రములు వెలువడినప్పుడు కొన్నిదేశములలో ప్రజాసామ్యము కొంత తలచూపినది. వర్తమానకాలమున నిట్టి ప్రజాసామ్యప్రభుత్వములే బహులముగా నెలకొల్పబడినవి. ప్రజాప్రభుత్వమున, ప్రజాసమితిచేతనే యధికారము చలాయింపబడును. కాని రాజ్యములు పెద్దవగుటచే సర్వజనులును సమానాధికారమును వహించుట కవకాశములేదు. కావున నీప్రజలు రాజ్యనిర్వాహమునకై కొందఱు ప్రతినిధుల నెన్నుకొందురు. అందుచే వర్తమానకాలమున ప్రాతినిధ్యప్రభుత్వవిధానము మిక్కిలి ప్రముఖమైయున్నదని చెప్పవచ్చును.

రాజ్యాంగవిషయములలో నెన్నికదారులందఱును అభిమానమును, ప్రవేశమును గలిగియుండుటమీదనే ప్రాతినిధ్యప్రభుత్వ మాధారపడియున్నది. జాతీయ

శాసనసభలకు ప్రతినిధులను పంపునప్పుడు ప్రజలు దేశముయొక్క యావశ్యకములనేగాక ఎవరుసమర్థతతో తమ ప్రాతినిధ్యమును వహించుట కర్హులో గుర్తెంగి యుండవలెను. ఈ ప్రయోజనమును సాధించుటకై ప్రజలు విద్యావంతులై యుండుటలెస్స. ఏలన వారప్పుడు దేశసౌకర్యములను బాగుగా నెఱింగి, పూర్వ ప్రతినిధులు సంతుష్టికరముగా పనిచేయనియెడల సమర్థులైన క్రొత్తప్రతినిధులను బాగుగా నాలోచించి ఎన్నుకొనుటకు చాలియుందురు.

మంచిప్రపత్తిగల యొకని ప్రభావమునకులోబడి ప్రజలు తమతమ ఎన్నికయధికారమును పరాశ్రయము గావింపకుండుట రెండవ యావశ్యకము. శిఫారుసులకును, పరుల వాక్ప్రభావమునకును లోబడి ప్రజలు ప్రతినిధుల నెన్నుకొనుచో నది యదార్థమును, అభ్యుదయావహము నగు ప్రాతినిధ్యము కాజాలదు. ఏలయన అప్పుడు ప్రతినిధుల సామర్థ్యముపై, ప్రజలకు నిశితమైన దృష్టియుండజాలదు. ఇంక నప్పుడు ప్రాతినిధ్యప్రభుత్వము యొక్క పరమార్థమే లుప్తమగును.

మఱియు నెన్నికదారులు లంచములుగైకొనుట, ఉద్యోగసంపాదనాభిలాష మొదలగు దుర్వ్యవసాయములకు వశులగుట కాగూడదు. అమెరికాదేశమున లబ్ధజయుడైన వ్యక్తినుండి ఉద్యోగమునుబడయు నాశతో ప్రజలు వోటు నొసఁగుదురు. ఇట్టి చెడు అలవాటులు ప్రాతినిధ్య ప్రభుత్వముయొక్క మూలసత్త్వమునకు భంగము కలుగజేయును. ఎన్నికదారులతో సంబంధించినంతవరకు పై మూడుగుణములును ప్రాతినిధ్యప్రభుత్వము జయప్రదముగా సాగుటకు మిక్కిలి యావశ్యకములు.

ఇప్పటి ప్రాతినిధ్యప్రభుత్వములోని ముఖ్యలక్షణము పక్షప్రభుత్వము. రాజకీయపక్షములు స్థిరస్థాయులుగా నెలకొల్పబడినవనియు, జయాకాంక్షియగు ప్రతి వ్యక్తియు నేదో నొకపక్షమునకు దాసుఁడై యుండవలయుననియు మనమెఱుఁగుదుము. ఆధునికరాజ్యాంగవిధానము మిక్కిలి విశాలమైయుండుటచే ప్రాకృతులైన ఎన్నికదారు లాసంకీర్ణప్రభుత్వపద్ధతియందు ప్రాముఖ్యమునొందు నవకాశము లేకున్నది. ఎన్నికకాలమునకు వారన్నిపక్షముల బలమును విచారించి తమ నమ్మికకునికిరైన పక్షనాయకునికి వోటు నొసఁగుదురు. ఎన్నికదారులలో ప్రచారము సలుపుటకును, ఎన్నికకగు వ్యయమునంతటిను భరించుటకును, అభ్యర్థులకేదోనొక పక్షము నాశ్రయించుట విధియగుచున్నది. కాన యభ్యర్థుల నిర్ణయించుట పక్షముల చేతులలోనున్నది. ఎన్నికదారులు తమకు నమ్మకముగల పక్షము నిర్ణయించిన యభ్యర్థికే వోటునొసఁగ నిశ్చయింతురు. దీనిని బట్టి వర్తమానకాలమున నెన్నికదారుల ప్రభావముకన్న పక్షములప్రభావమే మిక్కిలి ప్రబలమాయెనని తెలియుచున్నది. ఒక యభ్యర్థి ఎన్నికలో జయించినను, అతడు శాసనసభకు ఒక ప్రత్యేకపక్షసభ్యుడుగానే అరుగును గాని సర్వజాతిప్రతినిధిగా నరుగజాలడు.

ప్రతినిధుల ధర్మములు పెక్కుగలవు. ఎన్నికదారులు తమ్మెన్నుకొన్నప్పుడు వారు యదార్థముగా వారి ప్రాతినిధ్యమును వహింపవలయును. ప్రజాసామాన్యము తనపేరుమీదుగా ప్రభుత్వవిధానమును నడిపించుటకై ప్రతినిధుల నెన్నుకొని శాసనసభలకు పంపును. అందుచే ప్రతినిధులు తమబాధ్యతను గుర్తించి, తమ ధర్మములను నిశ్శేషముగా నిర్వర్తింప యత్నింపవలయును. మఱియు వారు సమర్థులును, దుర్వ్యవసాయముల కతీతులునయి యుండవలెను. ఈ గుణములన్నియుం ప్రతినిధులలోనుండి తీరవలయును. ఏలయన దేశముయొక్క సౌభాగ్యమంతయు వారిమీదనే యాధారపడియున్నది.

సిద్ధాంతములను బట్టిచూచినచో ప్రాతినిధ్యప్రభుత్వము సర్వాతిశాయియైన రాజ్యాంగవిధానమని చెప్పవచ్చును. కాని ప్రయోగానుభవమునుబట్టి చూడ నందు కొన్నిలోపములును అపాయములును ఉన్నట్లు స్పష్టమగుచున్నది. ఎన్నికదారులు విద్యాగంధములేనివారగుటయు, రాజకీయవృత్తమునంతయు సమగ్రముగ నెఱుంగకుండుటయు నందలి మొదటిలోపము. వర్తమానకాలమున రాజ్యాంగవిధానము మిక్కిలి సంకీర్ణమును, విశాలమును నయియుండుటచే ప్రాకృతులైన

ఎన్నికదారులందరి యథార్థపరిస్థితిని బాగుగ గుర్తెరుంగ కున్నారు. ఇందుచేతనే వీరందఱును కలిసి జాతీయ శాసనసభలకు తమకు, మారుగా నొక ప్రతినిధిని పంపు కొనుట. కాని ప్లేట్టు పండితవర్యుడు చెప్పిన ట్లొకరు మఱియొకరి ప్రాతినిధ్యమును సమగ్రముగ వహించుట దుర్లభము. ప్రతినిధులు తమ్మెన్నుకొనిన ప్రజల యభిప్రాయముల కెంత ప్రయత్నించినను సంపూర్ణప్రాతినిధ్యము నొసంగజాలరు. కాని వానికి సన్నిహితముగ మాత్రము వర్తించుట కవకాశము గలదు.

ప్రాతినిధ్యము స్థలవిభాగమునుబట్టి నిర్దేశింపఁబడుచున్నది. ఈ పద్ధతి ఇంగ్లండులోని దానిని బట్టిచూడ కొంచె మించుమించుగా నధికసంఖ్యాకుల (మెజారిటీ) యధికారప్రాబల్యమునకు తావొసగుచున్నది. కాన శాసనసభ యప్పుడు ఎన్నికదారు లందఱి యభిప్రాయములకు ప్రతినిధిగానుండజాలదు

పక్షములు ప్రబలములై ఒండొంటితో విభేదించి యుండుట మఱియొక ఎన్నదగినవిషయము. పక్షములొక యభ్యర్థిని నిర్ణయించును. ఎన్నికదారులు స్వపక్షనిర్దిష్టులైన యభ్యర్థులకు ఓటు నొసంగకతప్పదు. అదియుకాక ఎన్నికకాలమున పక్షములు ప్రజాసామాన్యము నాకర్షించుటకనేక ఆకర్షకములను ప్రదర్శింతురు. ఒక్కొక్కప్పుడు దేశపరిస్థితిని తమ కనుకూలించు విధముగా నతివచింతురు. ఇంక ప్రజాసామాన్యమున కీసూక్ష్మవిషయములతో పెనగులాడుటకు తగినంత యవకాశములేకుండుటచే వారేదో యొక పక్షమువారికి ఓటు నొసంగివేయుదురు. ఇంక నీప్రతినిధులైనను తమ స్వతంత్రత ప్రయోగింపజాలరు. వారు తమ నాయకుని యాదేశములను యథాక్షరముగా ననుగమించుచు శాసనసభలో నేదేని వివాదము సంభవించి నప్పుడు నాలోచితముగా నొకపక్షమువారందఱును సమ్మతినో లేక అసమ్మతినో చూపుచుందురు. కాబినెట్టు ప్రభుత్వవిధానము ప్రచారముననున్న దేశములలో నది నధికసంఖ్యాకులుగల పక్షమునకే ప్రతినిధిగా నుండును. వా రెట్టి చట్టములను ప్రవేశపెట్టినను అధికసంఖ్యాకులవారి పక్షముననే యుండుటచే నవి సులువుగా శాసనములయిపోవుట తటస్థించును.

అల్పసంఖ్యగల పక్షము కాబినెట్టు వారి చర్యలను విమర్శించి తిరస్కరింపవచ్చును. కాని యది నిరర్థకము. అందుచే శాసనసభలలో ఫలవంతమగు విమర్శల కవకాశములేదు. అది కేవలము కాబినెట్టువారి నిరంకుశత్వము. ప్రస్తుతము నేషనలు కాబినెట్టు వారికి శాసనసభలో మంచి ప్రాబల్యముకలదు. ప్రతిపక్షులు సుమారు అరువదిమంది యుందురు. వారు కాబినెట్టుపై ప్రయోగించిన విమర్శలు నిష్ప్రయోజనములై పోవును. కాబినెట్టువారు ప్రవేశపెట్టిన బిల్లులన్నియు చట్టములైపోవును. అందుచే కాబినెట్టువారి సాహాయ్యములేకున్నచో, నే ప్రయివేటు బిల్లు చట్టముకావుట కవకాశములేదని తెలియుచున్నది. ఇంగ్లండులో కాబినెట్టువారు పార్లమెంటు ననుశాసింతురు. పార్లమెంటు సైతము వారి శాసనములను నిరాటంకముగా రిజిష్టరు చేయును. అందుచేతనే ఒకరాజకీయశాస్త్రజ్ఞుఁడు "Parliament is only registering body of the dictates of the cabinet." అని చెప్పియున్నాడు. సాధారణముగా కాబినెట్టువారు తాముచెందు పక్షము వారిపద్ధతి ననుసరింతురు. అందుచే సార్వజాతికసౌలభ్యములు కుంఠితములగును. దీనినిబట్టి ప్రాతినిధ్యప్రభుత్వముయొక్క మూలసత్వమునకే భంగము వాటిల్లుచున్నది. పార్లమెంటుగల దేశములలో ప్రాతినిధ్యప్రభుత్వమనగా కొందఱు వ్యక్తులయొక్క లేక కాబినెట్టుయొక్క నిరంకుశానుశాసనమని తేలుచున్నది.

ఈ విధముగా నిటలీ,జర్మనీ, రష్యా, మధ్యయూరోపా ఖండమునందలి మఱికొన్ని దేశములలో వలెనే నేకైక వ్యక్తులయందు (డిక్టేటర్ షిఫ్) గాని, ఇంగ్లండులో వలె నొక వ్యక్తిసమూహమునందుగాని యధికారమంతయు నుండిపోవుట తటస్థించుచున్నది. వర్తమాన కాలమున నిట్టి నిదర్శనములు బహుళములు. జర్మనీలో హిట్లరు నేతృత్వముననున్న నాజీపక్షమువారి యధికారమును బట్టిచూడ ప్రస్తుత ప్రాతినిధ్యప్రభుత్వము ఏకైక వ్యక్తి గతమని తేటతెల్లమగుచున్నది. ప్రస్తుతము హిట్లరు జర్మనీదేశపు సర్వరాజ్యాంగవిధానమును తన

చేత నిమిడించుకొన్న సార్వభౌమునివలెనున్నాడు. దీనికంతయు నిపుడచ్చట నాజీపక్షము ప్రాబల్యము వహించుటయే కారణము. ఈ పక్షమువారు తమ నాయకునికి సర్వాధికారమును ఒసంగియున్నారు.

దీనినిబట్టి ప్రజాసముదాయముయొక్క యథార్థాభిప్రాయములు శాసనసభలో పూర్తిగా ప్రతిఫలించుట లేదని స్పష్టముగా దెలియుచున్నది. దేశముయొక్క సర్వవిషయములందును అధికసంఖ్యగల పక్షమువారియొక్కగాని, ఏకైకవ్యక్తియొక్కగాని యిష్టమే నిరంకుశముగ కొనసాగుచున్నది. ఈపైవిషయములను బట్టి ప్రాతినిధ్యప్రభుత్వము తనయందు లోకమునకుగల యాశలనన్నిటిని గంగ కలిపినదని తెలియుచున్నది. ప్రాతినిధ్యప్రభుత్వమనగా నొకదేశములోని ప్రజలందరుగాని వారిలో నొక యధికభాగముగాని, తమచే తాత్కాలికముగా నెన్నుకొనబడిన ప్రతినిధుల ద్వారా రాజ్యాంగముయొక్క సమస్తవ్యాపారములను సర్వంకషముగ కొనసాగించుటయే. ఈనిర్వచనమునకు వర్తమానప్రాతినిధ్యప్రభుత్వము తాళలేదు. ఏలయనగా నది మర్యాదనతిక్రమించి వ్యక్తిగతప్రభుత్వము క్రిందమారిపోయినది.

—రాంపల్లి విశ్వేశ్వరరావు, బి.ఏ. (ఆనర్సు)

# వీరును అంటరానివారేనా?

## ౧ లాయడ్ జార్జి.

బ్రిటీషు సామ్రాజ్యపు యుద్ధకాలమంత్రిమాణిక్యమగు లాయడ్‌జార్జి మూడేండ్ల బాలుడైయుండగా ఆతనితండ్రి చనిపోయెను. అగుటచే లాయడ్‌జార్జి బాల్యమున తనతల్లి అన్నగారి (మేనమామ) వద్ద పెరిగెను. ఆ మేనమామ వృత్తియేమి? చెప్పులుకుట్టుట. చెప్పులుకుట్టి ఎట్టులో పొట్టపోసుకొనుచుండిన ఆ పేద మేనమామకడ పెరిగిన లాయడ్‌జార్జి భావికాలమున ఆంగ్లసామ్రాజ్యమునకు అమాత్యశేఖరుడయ్యెను.

## ౨. జోసెఫ్ స్టాలిన్.

నేడు సోవియట్ రష్యాకు నిరంకుశప్రభువైయున్న స్టాలిన్‌తండ్రి చెప్పులుకుట్టువాడైనకాడు. గోడారివాడు (కాబ్లర్) మాత్రమే. స్టాలిన్ తన చిన్నతనములో గోడారివానిపనిచేసియే పొట్టపోసికొన్నాడు.

## ౩. థామస్ బేటా.

బేటా ప్రపంచమెఱిగిన కోటీశ్వరులలో నొకడు; గొప్ప చెప్పులవర్తకుడు; జెకోస్లావాకియాకు చెందినవాడు. ఆతడొక గోడారివాని కొడుకు. ఆతడు మరణించి రెండుసంవత్సరములైనది. ఆతని కొమారునకిప్పుడు పందొమ్మిదేండ్లు. గోడారివాని మనుమడు, చెప్పులవర్తకుని కొమారుడు అయిన బేటాకు వర్తకరీత్యా యూరపునందును, ప్రపంచమునందును పర్యటనము సల్పుటకు పందొమ్మిది గాలివిమానములుగలవు.

## ౪. లూయి పాస్టర్.

రోగకారకక్రిమివిజ్ఞానశాస్త్రమునకు జనకుడై మానవసౌఖ్యమునకు అనంతముగ తోడుపడిన గొప్ప రసాయనికశాస్త్రవేత్త లూయిపాస్టర్ తోళ్ళను పదునుచేయు వృత్తివలన జీవించిన ఒక పేదవాని పుత్రుడు.

## ౫. రాబర్టు.

నార్మండీదేశపురాజు రాబర్టు అనువాడు. ఒకనాడు ఒక చిన్ననావపై నదీవిహారము చేయుచుండెను. నీలాటిరేవున నిలచియున్న తోళ్ళు పదునుచేయువాని కుమార్తెనుచూచి వలచి రాబర్టు ఆమెను పరిణయమయ్యెను. ఆమెకుపుట్టిన కొడుకు విలియమ్ అనువాడు గొప్ప విజేతయై బ్రిటీషుదీవులను జయించి వానికి ప్రభువయ్యెను.

## ౬. విలియమ్ కారీ.

విలియమ్‌కారీ పదునెనిమిదవ శతాబ్దికిచెందిన ఒక మిషనరీ. వంగరాష్ట్రమునందలి శ్రీరామపురమున ఆతడు నివసించుచుండెను. భారతవర్షపు దేశభాషలెన్నియో ఆతడు దీక్షతో నేర్చెను. అందు ముఖ్యముగా వంగభాషయందు ఆతడు గొప్ప పాండిత్యము నార్జించెను. అగుటచే 1800 సంవత్సరమున ఫోర్టు విలియమ్ కాలేజీయందు ప్రథమ వంగభాషాధ్యాపకుడుగా నియమింపబడెను. వంగసారస్వతమున ఆధునికవచననిర్మాత ఈ విలియమ్‌కారీయే. అట్టి ఈతడు తన జీవితారంభపు దినములలో గోడారివాడైయుండెను.

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొన పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

24 వర్ణములు జన్మసిద్ధములా?

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు పుట్టుకచేతనే సిద్ధించినవా? ఎట్లు?

—కొత్త వీరభద్రయ్య చౌదరి.

25. వర్ణములనుగూర్చి సచ్ఛాస్త్రిగారి అభిప్రాయము.

బాల్యమున సామాన్యముగ అజ్ఞానావస్థలోనుందురు గనుక దానికి శూద్రదశయనియు, పైన యుక్తవయస్కులై వివాహాది కార్యముల నిర్వర్తించుకొని కుటుంబపోషణార్థము పశుపాలన వాణిజ్యాది వృత్తుల నవలంబించుట వైశ్యదశయనియు, అనంతరము స్వార్థరహితులై గ్రామసేవగాని దేశసేవగాని యొనర్చుట క్షత్రియత్వమనియు, ఆపైన సంసారకాంక్షాదికముల వీడి వీతరాగుడై మోక్షముకొరకు ఈశ్వరసేవజేయుట బ్రాహ్మణ దశయనియు, చాతుర్విధవర్ణములు లేవనియు, పై నాల్గు దశలే మానవునిదశలనియు వెల్లడించు శ్రీ దుగ్గిరాల రాఘవచంద్రయ్య సచ్ఛాస్త్రిగారి యభిప్రాయ మెంతవరకు సమంజసము?

—కొత్త వీరభద్రయ్య చౌదరి.

26. ఫోటోలు : ముఖవర్చస్సు

ఫోటోలు తీయించుకొంటే ముఖవర్చస్సు - ముఖముయొక్క కళ - తగ్గిపోతుందని కొందఱంటారు. దీనిని శాస్త్రసమ్మతమనవచ్చునా?

—కర్రా చంద్రశేఖరము.

12. కొన్ని నేలలలోని పొగాకు కాలకుండుట.

పొగాకుకాల్పు ముఖ్యముగ రెండు విషయములపై ఆధారపడి యుండును. ౧. దానిలోని బూడిద అను పదార్థముయొక్క పరిమితి. ౨. పొగాకు పదునుచేయుటలోగల మంచి చెడ్డలు. బూడిద అను పదార్థము 'పొటాసు' అను ధాతువుగలది. ఒక యెకరము పొగాకుపంట, భూమినుండి 85 పౌనుల 'పొటాసు'ను గ్రహించునని నిర్ణయింపబడినది. ఈపొటాసులోని కొంతభాగము బూడిదగా మారి, పొగాకుకాల్పునకు కారణమగుచున్నది. ఈబూడిద' పరిమితి చాలినంత లేమిచే పొగాకుకాల్పు సరిగా నుండదు. కావున, పొగాకు పదును చేయుటలో లోపము లేకపోయినచో, మరిలోపము నేలలోనే ఉన్నదని గ్రహింపవలసి యున్నది. ఇట్టి నేలను సరిచేయుటకు అనగా కాలునట్టి పొగాకు పంటకు అనువుగా నేలను తయారు చేయుటకు, 'పొటాసు' యెక్కువగాగల యెరువుల వాడుట ఒకమార్గమగును. మున్ముందు నేలను రసాయనశాస్త్రజ్ఞునిచే పరీక్ష చేయించి, దానిలోని లోపములను గుర్తెరిగి, వానిని సరిపుచ్చుకొని పొగాకు పండించుట శ్రేయస్కరమగును. —జాగు గోపాలరావు.

రావుసాహెబ్ గారపాటి ఆంజనేయ చౌదరిగారు పొగాకు ఉత్పత్తినిగూర్చి పరిశోధించియున్నారు— నేలయందు సున్నము కొరవడినపుడే పొగాకునకు కాలుపుశక్తి

నశించుననియు, ఆ భూమియందు పైరు నాటుటకు రెండుమాసములకు పూర్వము నాల్గుబస్తాలు (భూమినిబట్టి కొన్ని నేలలకంత అవసరముండదు) రాతిసున్నమువేసి వర్షం కురిసినపుడల్లా దున్ని మట్టిలో కలియునట్లు చేయవలయుననియు, అట్లుచేసినచో ఆ నేల యందు ఉత్పత్తియగు పొగాకు చక్కగా కాలుననియు వారొకయుపన్యాసమున జెప్పియున్నారు—అనేకమంది అట్లొనర్చి ఫలితమును కనులారగాంచినట్లుకూడ వచిం చుచున్నారు. —మేకా రామస్వామి.

### 13. బెండచెట్ల నారనుండి పట్టు.

ఆంధ్రులు బెండకాయలను కూరకొరకు మాత్రమే వినియోగింతురు. అంతకంటె నా చెట్లనుండి యెక్కువ ప్రయోజనమును పొందజాలకున్నారు—ఎపుడు బెండచెట్లు పుష్పించునో అపు డాపువ్వులను త్రుంచి వేయుచున్నచో, ఆ చెట్లనుండి సుందరమైనట్టియు, ఉజ్వలమైనట్టియు నార ప్రస్తుతము కాగలదు. భాద్రపదమాస ప్రాంతమున ఈవిధముగా పెంచిన బెండచెట్లను మొద లంటకోసి నీటిగుంటలలో నానవేయవల యును. పది, పన్నెండు దినములు నానిన పిమ్మట నారనుచీరి నీళ్ళలో నుడకబెట్టి, పిమ్మట యెండబెట్టవలయును. కాశీ సిల్కు యొక్క ప్రశంసను మనము తరుచుగా విను చున్నాము. ఆ నయనముగ్ధకరములగు బెనా రస్ చీరెలు యీ బెండచెట్ల నారనుండి ప్రస్తుతమగుచున్న సిల్కువలననే తయారు చేయబడుచున్నవి. —పడమట నారాయణదాసు.

### 15. మూలికల వ్యవసాయము.

వేలకొలది, లక్షలకొలది మూలధన ముతో నిర్మింపబడుచున్న ఆంగ్లాయుర్వేదౌ షధ కర్మాగారములు మన దేశమున లెక్కకు మిక్కిలియగుచున్నవి. వానిలో తయారు కాబడు తరళసారము, నిర్యాసము, వటిక మొదలగు వానికొరకు ఆకులు, కాడలు, బెరడు, వేళ్ళు మొదలగునవి ప్రచురపరిమా ణముగ గావలసియున్నవి. వీనిని సంగ్రహ మొనర్చి ఆయా కర్మాగారములతో నేర్పా ట్లుచేసికొని, సరపరాచేయుచు, మూలధన మక్కరలేకుండగనే అర్థోపార్జనము గావింప వచ్చును. (1) కలబంద (2) పిల్లితేగలు (3) తెల్ల జిల్లేడు (4) నేలగుమ్మడి (5) మద్ది చెక్క (6) నేలవేము (7) యేడాకులరటి (8) అశోకచెక్క (9) పెన్నేరు (10) సుగంధి పాల (11) కలువదుంప (12) తెల్లగల్జేరు (13) అడ్డసరము (14) తిప్పతీగె (15) వాకు డు (16) వేపచెక్క (17) బ్రహ్మీ (18) పల్లేరు (19) దురదగొండి విత్తులు (20) లొద్దుగ చెక్క (21) తెగడ. ఈ మూలికలను ఔషధకర్మాగారము లెల్లప్పుడు అధికముగ గొనుచుండును. —తోలేటి ఆంజనేయులు.

### 16. 'మౌంటు ఎవరెస్టు' అను పేరు.

ఆదిలో ఇపుడు మౌంటు ఎవరెస్టు అని పిలువబడుచున్న శిఖరమును, గౌరీశంకర శిఖ రమును ఒకటియేశిఖరమని తలంచబడినది. కాని వెనుక సర్వేయర్ ఆఫ్ ఇండియాగా ఉండిన జనరల్ వాకరు అనునతడు ఈ రెం డును వేరువేరు శిఖరములగుట కనిపెట్టి నాడు. ఈ శిఖరముల ఎత్తును శాస్త్రరీత్యా (ట్రిగొనొమెట్రికల్ శాస్త్రరీత్యా) కనుగొ నుటకు పూనినవాడు కల్నల్ ఎవరెస్టు అను వాడు. ఆతడు ఇండియాలో సర్వేయరు జన రల్‌గా ఉండినాడు. 1857-వ సంవత్సరమున మే మాసమునందు లండను మహానగరమున రాయల్ జ్యాగ్రాఫికల్ సొసైటివారి సభలో దీర్ఘమగు చర్చజరిగిన అనంతరము ఈ శిఖర మునకు ఆ ఎవరెస్టు నామము ఈయబడినది. —సాగి శ్రీహరిరావు బి. ఏ.

# ఆల్బర్టు వాల్టర్ గామాజి

[''మంచిసరుకు : కొద్దిలాభము'' అనునది ఆతనివ్యాపారనీతి. కాతాదారుల తృప్తియే విశేషవ్యాపారమునకు పునాది అని ఆతని విశ్వాసము. ఆనీతియు, ఈవిశ్వాసమును గామాజిని ప్రపంచమందలి వణిక్పుంగవులలో నొకనిగా నొనర్చినవి.]

తన తలిదండ్రులకు ఆల్బర్టువాల్టర్ గామాజి పసునేడవబిడ్డ; తన తలిదండ్రులకు ఆతడే కడగొట్టువాడు. గామాజితండ్రి సామాన్యకర్షకుడు. అతడు సేద్యము చేయు నేల ముక్కారునుండెడు కేదారముకాదు. ఇంగ్లండునందలి హెరిఫర్డుషైరులోని కటికినేల ఆతని వ్యవసాయక్షేత్రము. ఆ కటికినేలయైనను ఆతనికి విస్తరించిలేదు. కొద్దియకరములు. కుటుంబమునకు సరిపోయెడు కూడుపొందుటయే దుర్ఘటమైయుండెను. అట్టివానికి కడగొట్టుపుత్రుడైపుట్టి స్వయంకృషిచేత లోకమెఱిగిన వణిక్పుంగవుడై వెలయుటకు అల్బర్టువాల్టర్ గామాజి ఎంతటి ప్రజ్ఞావంతుడు, కార్యదక్షుడు అయి ఉండవలయునో సులభముగా ఊహింప ఎడములేదు. సులభముగా ఊహించుటకు ఎడములేని ఆ విషయము తెలిసికొనుటకు పాఠకులకు కుతూహలముగ నుండకమానదు.

అభివృద్ధినందుటకు ఆ చిన్నిగామాజికి ఎట్టి అవకాశములును లేకుండెను. తాను ఉండిన కుగ్రామమునందలి చిన్నబడిలో నేర్చినవిద్య తప్ప ఆతడు మఱి ఎట్టి విద్యాలాభములును పొంది ఎఱుగడు. గామాజిబాల్యమున అనగా ఇప్పటికి డెబ్బదియేండ్లకు పూర్వము ఆంగ్లావనిలోని గ్రామసీమలయందలి పాఠశాలలలోని విద్యయనగా చదువను, వ్రాయను నేర్పుటమాత్రమే. గామాజి నేర్చిన విద్య అట్టిది. కాని చిన్నతనమునుండియు గామాజి కష్టపడి పనిచేయువాడు. అభివృద్ధికి రావలయునను తీవ్రకాంక్ష తప్ప ఆదినములలో ఆతని కడ ఆతని భావి అభివృద్ధిని దిజ్మాత్రముగనైన సూచించు సూచన ఒక్కటియైన లేకుండెను.

అప్పటికి ఇంకను గామాజి చిన్నవాడే. కాని ఆతని తండ్రిస్నేహితు డొకడు వచ్చి బక్కింగుహామ్ షైర్ లోని విన్‌స్లో పట్టణమునందలి తన దుకాణములో ఆతనికి పనిఇత్తుననుటతోడనే ఆతడు ఎగిరిగంతువైచెను. లండనుమహానగరమునకు విన్‌స్లో నలుబదిమైళ్ళదూరముననుండెను. విన్‌స్లో దుకాణమున పనిచేయుచుండు ఆ దినములలోనే గామాజి తొలిసారి లండనుమహానగరమును చూడగలిగెను. అప్పటి లండనుకును నేటి లండనుకును పోలికలేదు. ఆనాడు లండనులో గుఱ్ఱములులాగు బస్సులు, బండ్లు, - బైసికిళ్ళుకూడ విస్తరించిలేవు, అండర్‌గ్రౌండు రైల్వేలు చాలకొద్ది, విద్యుద్దీపములు లేవు,—చూచుటతోడనే నేటి లండనుమహానగరమును ఆకర్షణీయముగ చేయజాలు ఒక్క విషయముకూడ నాడులేకుండెను. లేకుండునుగాక లండనుపై గామాజి మోజుపడినాడు. లండనులో ఎటులైన పని సంపాదించుటకు ఆతడు కృతనిశ్చయుడై ప్రయత్నింప దొరకొనెను. ఆ ప్రయత్నములు అచిరకాలముననే ఫలవంతములయ్యెను. లండనునందలి ఒకానొక బట్టలకొట్టులో ఆతడు అసిస్టెంటుగా ప్రవేశించెను.

ఆ దినములలో లండనునందలి బట్టలదుకాణముల అసిస్టెంటులు ఎంతటి శోచనీయపరిస్థితులయందు పనిచేయవలసియుండెనో హారీ సెల్‌ఫ్రిడ్జి గార్డాన్ జీవితము (చూడు : 1934, ఏప్రియల్, ఆంధ్రభూమిసంచిక) చదివినవారికి తెలిసిన విషయమే. పనిచేయవలసిన కాలము హెచ్చు; ఇచ్చెడుజీతము మిక్కిలి తక్కువ. చేయుపనిలో జీతము హెచ్చింపబడు అవకాశములుగాని, చేయుపనికంటె పెద్దపనికి ప్రమోషనుపొందు అవకాశములుగాని లేకుండెను.

అట్టి బట్టలషాపు అసిస్టెంటుగా గామాజి ప్రవేశించెను. అందలి కష్టములు ఆతనికి తెలియకపోలేదు. ఆ పనియే శాశ్వతముగా ఆతడు భావింపలేదు. జయమం

దుటకు అది యొక మెట్టుగామాత్రమే ఆతడు తలంచెను. వ్యాపారమున నిజముగా జయమందదలచినవ్యక్తి సొంతముగా దుకాణము పెట్టవలసియుండుననుమహాసత్యమును ఆతడు మొదటినుండియు ఎఱుగును. కాని సొంతముగా దుకాణముపెట్టుటకు ధనమువలయును. బట్టలషాపుఅసిస్టెంటు ఉద్యోగరీత్యా వచ్చు జీతపురాళ్ళు తప్ప ఆతనికడ ఒక్క పెన్నీకూడ అదనముగా లేదు. కావున ఆతడు ధనము కూడబెట్టుటకే పనిచేయ దొడంగెను. వారములక్రమమున ఆతడు తనవద్దనున్న చిన్నిమొత్తమునకు మఱి నాలుగైదు నాణెములను చేర్చుచుండెను. ఆ బట్టలషాపులోనే వస్తువిక్రేత ఉద్యోగముననున్న ఫ్రాంక్ స్పెయిన్ అను నతనితో గామాజికి నేస్తముకుదిరెను. ఇద్దరును బ్రహ్మచారులు; ఇద్దరును ఒకేచోట ఉద్యోగమున కుదిరియున్నవారు— కాగా దినములవెంట వారిస్నేహము దృఢతరమయ్యెను. అవకాశము లభించినపుడెల్ల ఆ స్నేహితులిద్దరును తమ భావిస్థితినిగూర్చి హృదయపూర్వకముగ ఆలోచించువారు. గామాజి తన హృదయవాంఛితమును స్పెయిన్‌కు వెళ్ళడించెను, ఆతనికికూడ పురికొల్పి ధనము కూడబెట్టునట్లుచేసెను.

ఒకనాడు గామాజి తన గడియారమును బాగుచేయించుకొనుటకై హాల్‌బార్న్ వీధియందలి ఒకానొక గడియారముల వర్తకునికడకు వెళ్ళెను. సంభాషణావసరమున ఆ వీధిలో మేజోళ్లు, ఇజారులు మొదలగునవి అమ్ము దుకాణమునకు ఎంతయో అవసరముండుట ఆ గడియారములవర్తకుడు చెప్పెను. తోడనే గామాజి కోడిపిల్లనుచూచిన గద్దయయ్యెను తన స్నేహితుడు స్పెయిన్‌వద్దకు పరుగెత్తెను. ఇరువురును ఈ విషయమునుగూర్చి దీర్ఘముగ ఆలోచించిరి. ఈ వ్యాపారమున దిగుటకే ఆ మిత్రులు ఇరువురును నిశ్చయించిరి. ఆ వీధిలో ఒకకొట్టు బాడుగకు తీసికొనవలసియున్నది. ఉఱకలువేయుచుపోయి గామాజి ఒకకొట్టు చూచినాడు. ఇంటియజమాని ఏడాదికి ఆ కొట్టుకు 220 పౌనులు అద్దెచెప్పినాడు; పైగా 80 పౌనులు ధరావతు కట్టవలెనన్నాడు. గామాజి, స్పెయిన్‌కలసి ఇన్నాళ్లుగ కూడబెట్టినధనము 150 పౌనులు మాత్రమే. కాగా ఈ కొద్ది పెట్టుబడితో ఇందు దిగినచో రాగల అపాయమునుగూర్చియు, ఇంతటి కొద్దిధనము పెట్టుకొని అంతటి పెద్దఎత్తుకుపోవుట సమంజసమా అనియు ఆలోచించుచు వారు నిద్రఎఱుగక రాత్రులు వేగించువారు.

కాని ఒకసారి కృతనిశ్చయము అయినచో గామాజి విషయమున ఇక వెనుబాటు అనునదిలేదు. కొట్టు అద్దెకు పుచ్చుకున్నాడు. ఇంటియజమానితో మాటలాడి ఏబది పౌనులు మాత్రము ధరావతుకట్టినాడు. దుకాణమున వస్తువులుంచుటకువలయు పరికరములు కూర్చుటకు ఎనిమిదిపౌనులు సెలవైనవి. కాగాపోగా ఇక ఆ దుకాణదారుల చేతులలో నూరుపౌనులైనను నిండుగాలేవు. షాపుకువలయు స్టాక్ అంతయు కొనివచ్చుట ఎట్లు? పెద్దవర్తకులకడకు వెళ్ళి గామాజి క్రెడిట్ మీద సరకు ఇమ్మని కోరినాడు. ఆ దినములలో చిల్లర దుకాణములన్నియు ఇట్టి క్రెడిట్ పద్ధతిమీదనే ఏర్పడుచుండునవి తానును అట్లే స్థాపింపవచ్చునని గామాజి తలంచినాడు. కాని కలగనగనే తెల్లవాఱదను సామెత ఇప్పట్టున గామాజియెడ సార్థకమయ్యెను. గామాజికి తొలుతనే పెద్ద ఆశాభంగముకలిగెను. క్రెడిట్ మీద సరకుఅడిగిన గామాజినిచూచి పెద్దవర్తకుడు అనాదరమందస్మితముగావించి "ఒకపెన్నీ విలువగల సరుకును గూడ క్రెడిట్ మీద ఈయజాలను. నీదగ్గఱ వలయు పెట్టుబడిధనము లేదు. కావున ఈతరుణమున నీవు తిరిగి నీపాతఉద్యోగములోనికి పోవుట మంచిదనియు, ఈ వ్యాపారసాహసమునకు గడంగవలదనియు నీకు నేను గావించు ఉపదేశము." అన్నాడు.

గామాజి ఈ ఆశాభంగముతో స్తబ్ధుడు కాలేదు. వాక్చాతుర్యమునంతయు నుపయోగించి పెద్ద వర్తకుని తనకు సుముఖునిగా చేసికొన్నాడు. ఆనాటి గామాజి వాదము ఎట్టిదో వినుటకు ముచ్చటగానుండును. కాని నాడు గామాజివాదముకంటె ఆతని ఆకారరేఖయే ఆతనికి జయముకూర్చినదని చెప్పవలసి యున్నది. ఏమైననేమి పెద్దవర్తకుని మనస్సులో మార్పువచ్చినది. గామాజి అడిగిన సరకులన్నియు క్రెడిట్ మీద ఇచ్చు

టకు ఆతడు అంగీకరించినాడు. క్రొత్తషాపు తలుపులు తెఱువబడినవి. ఆయిరువురు భాగస్వాముల హృదయములందు అప్పుడెట్టి ఆశలు, భయములు క్రోడాడినవో పాఠకులే నిర్ణయించుకొనగలరు.


ఇది 1878-వ సంవత్సరమునాటి ముచ్చట. ఆనాడు ఆషాపువారి కాషుబుక్కు, లెడ్జరు అయిఉన్న చిన్న గ్రంథసంపుటము హాల్‌బారన్ వీథియందు నేడొక పెద్దకంపెనీ అయిఉన్న గామాజి దుకాణములో భద్రపఱుపబడియున్నది. ఆపుస్తకమువలన ఆనాటి అమ్మకము లెక్కలు తేల్చవచ్చును. మొదటివారములో 24 పౌనుల విలువగల వస్తువుల అమ్మకము. రెండవవారమున అమ్మకము ఇంత బాగుగా లేదు. ఆవారమున 21 పౌనుల వెలగల వస్తువులుమాత్రము విక్రయమయ్యెను. మూడవవారమున అమ్మకమునకు చుఱుకుతగిలెను. ఆ వారమున 40 పౌనుల వెలగల సరుకు విడుదలయయ్యెను. నాలుగవవారమున తిరిగి తగ్గుదల. 36 పౌనుల ఖరీదుచేయు సరుకుమాత్రము వెలబోయెను. ఆవారములో ఒకరోజు ముసురుదినము. నాడంతయు మంచుపడుచుండెను. సాయంకాలమగువఱకును ఒక్క కాతాదారుడుకూడ రాలేదు. సాయంకాలము ఆరుగంటలు దాటినమీద ఒకరిద్దఱు కాతాదారులు వచ్చిరి. నాటిజమ అంతయు కూడినచో ఒక పౌనును మించలేదు.

ఈయవలసిన బాడుగ పెద్దమొత్తము – క్రెడిట్ మీద తెచ్చినస్టాక్ యొక్క బిల్లుల మొత్తము అంతకంటెను అధికమైనది—దీపపుఖర్చు మొదలైన చిల్లర వ్యయములుకూడ ఆక్రొత్త దుకాణదారులు ఉపేక్షచేయదగినవికావు. అగుటచే ఆభాగస్వాములు అవకాశముగల అన్నివిధములచేతను డబ్బు ఆదాచేయవలసిన నిర్బంధము ఏర్పడెను. భాగస్వాము లిద్దరును ఒకచేగది అద్దెకు తీసికొని అందు నివసించువారు. ఆగదికి వారమునకు ఏడుషిల్లింగుల ఆరుపెన్సులు అద్దె. ఈఅద్దె కూడివచ్చుటకుగాను వారు తమ దుకాణపుకొట్టుకు వెనుకతట్టునగల ఒక ఖాళీగదిని ఒకనికి వారమునకు ఏడుషిల్లింగుల ఆరుపెన్సుల అద్దెకుఇచ్చిరి. ఇక ఆహారవిషయము. అతికష్టముగా ఉండువారు. ఆదినములలో ఉదయకాల భోజనమునకు ఆరుపెన్సులకు మించి వ్యయము చేయజాలకుంటిమని గామాజి లిఖితమొనర్చియున్నాడు. ఇప్పటికంటె అప్పుడు ఆహారపదార్థములు కారుచౌకయైయుండినమాట సత్యమే. కాని ఆహారపదార్థములు ఎంతచౌకగనున్నను ఒక్కొక్కనికి ఉదయకాల భోజనము మూడుపెన్సులలో సరిపెట్టవలసియుండెనన్నచో ఆంగ్లదేశపు పరిస్థితులెఱిగిన వారికి ఆ తిండితో సగము ఆకలియైన తీరదనుట తేటతెల్లమగును.

సగము ఆకలిమెతుకులతో ఎట్లో దినములు సాగించుచున్నవారికి మఱియొకదెబ్బ. వారికి ఏడుషిల్లింగుల ఆరుపెన్సులు అద్దెయిచ్చుచుండినవాడు గది ఖాళీచేసి వెళ్ళిపోయెను. మఱియొకడెవ్వడును ఆగదికి అద్దెకు రాలేదు. అందుమీద వారు తాముకాపురమున్న తావును వదలి ఆగదిలో తామే నివసించుటకు కోరకొనిరి. ఖర్చు చేయవలసి ఉండిన ప్రతి ఒక్కపెన్నీని గూర్చియు వారు దీర్ఘముగా ఆలోచించువారు. కొన్ని మాసములు గతించిన తరువాత వ్యాపారము కొంచెములాభమును గూర్చుచున్న దినములలోకూడ వారు తమ ఈపొదుపరితనమును విడనాడలేదు. ఆభాగస్వాము లిరువురును ఆదినములలో వారమునకు పదునాలుగుషిల్లింగులకు మించి తిండిమొదలగు సొంతఖర్చులకు వాడియెఱుగరు. మనిషికి వారమునకు ఏడుషిల్లింగులు అనగా తిండికే చాలీచాలని సొమ్ము. ఆకలితీరని అట్టితిండిలో మఱియొకని ఆరోగ్యము పూర్తిగ చెడియుండును. కాని విశేషముగా కాయకష్టపడు కర్షకకుటుంబమునకు చెందినవాడగుటచే గామాజి ఆదినములలోకూడ ఆరోగ్యవద్దేహుడై యుండెను.

దుకాణమువలన ప్రథమవత్సరపు వరుమానము 1632 పౌనులు; ద్వితీయవత్సరపు వరుమానము 1850 పౌనులు; తృతీయవత్సరమున 2300 పౌనులు. క్రమాభివృద్ధియే కాని అభివృద్ధి చాలమందముగ నుండెను. ఆదినములలో గామాజి భావికాలమున ఒకప్పుడు తనస్టోరు యొక్క వత్సరపు వరుమానము పదిలక్షల పౌనులకు మించియుండునని కలనైన భావించుటకు ఏమాత్రమును సూచనలు లేకుండెను.

"ఆంధ్రభూమి"



ఆల్బర్టు వాల్టర్ గామాజి



నదీతీర దృశ్యము.

గామాజీ షాపు తెఱచిన ఆక్రొత్తదినములలో తోడి వర్తకుల కన్నెఱ్ఱకు గుఱియైన సంఘటన మొకటి సంభవించెను. ఆదినములలో బ్రష్షుల కొంట్రకులతో చేయువారు. రబ్బరుమెత్తకు సన్నని ఉక్కుపుల్లలు తాపడము చేయుటచే తయారైన తలబ్రష్షులు క్రొత్తగా రానారంభించెను. ఈక్రొత్తబ్రష్షులు లండనులో అన్ని షాపులయందును సాధారణముగ ఒక్కొక్కటి అరక్రౌను వెలకు అమ్మబడుచుండెను. గామాజీషాపు గవాక్షమున ఇవి ఒక్కొక్కటి ఒక షిల్లింగు ఆరుపెన్నీలు అను వెలసూచించు కాగితము ముక్కలతో వ్రేలాడదీయబడెను. లండనునందలి ఇతరవర్తకులు ఇందుకు కక్కసించుకొనిరి "ఒట్టిపిచ్చి! పడుచువాళ్ల వర్తకము! దివాలాఎత్తుటకు దివ్యమైనమార్గము!" అని వర్తకులు ఎలుగెత్తి పలుకదొడంగిరి కాని బ్రష్షులను కొనుప్రజలు ఈమాటలు వినిపించుకొనలేదు; వినుపించుకొనినను పాటింపలేదు. బ్రష్షులు కొనుటకువచ్చినవారితో గామాజిదుకాణము పిక్కటిల్లెను, గామాజి స్టాకుచేసిన బ్రష్షులన్నియు అచిరకాలముననే చెల్లిపోయెను. ఈ బ్రష్షుల అమ్మకమువలన గామాజీకి విశేషలాభము లేకపోవుగాక, ఎందఱో క్రొత్త కాతాదారులు ఏర్పడిరి. అదియే తనకుగలిగిన మహాలాభముగ ఆతడు భావించెను. కొన్నిఏండ్లతరువాత ఒకానొక అమెరికను టోకు వర్తకుడు గామాజివ్యాపారసరళిని గూర్చి ఇట్లు చెప్పెను: "గామాజి కొద్దిలాభముతో తృప్తిపడును. అద్భుతమైన ఆతని విశేషవ్యాపారమునకు అదియే కారణము." వెలతగ్గించి బ్రష్షులను అమ్ముటవలన తోడివర్తకులు భావించినటుల గామాజిపరము దివాలాతీయలేదు. పైగా ఆవిధానము ఆదుకాణమునకు మాటాకు హత్తించినది. నాటినుండియు 'మంచిసరుకు: కొద్దిలాభము' అనునదియే వ్యాపారమున గామాజి ఆదర్శముగ ఉన్నది.

నిరంతర పరిశ్రమతో మూడువత్సరములు గతించినవి. ఇంతలో భాగస్వామి స్పెయిన్ ఒకనాడు గామాజితో తన వివాహమునకు వధువునిశ్చయమగుటను తెలిపెను. పైగా గామాజికూడ కొలదిదినములలోనే వివాహప్రయత్నములు కావింపకుండనుండలేడను తన అభిప్రాయమును వెల్లడించెను. "ఇప్పుడు మనకేదిదారి? రెండుకుటుంబముల వ్యయమును మన ఈక్రొత్త వ్యాపారము భరింపజాలదనుట నీకు తెలియును. కావున ఈ వ్యాపారమంతయు నీవుగైకొని నాకు నష్టక్రింద నాలుగువందల పౌనులనిమ్ము" అని స్పెయిన్ చెప్పెను.

వ్యాపారము ప్రారంభించునపుడే భాగస్వాము లిద్దఱును అనుకొనిరి: నడుమలో ఇద్దఱిలో ఎవరైన ఒకరు మానివేయునో మానుకొనువానికి ఈయదగు ధనము మధ్యవర్తులద్వారా పరిష్కారము కావలయునని. అట్లే మధ్యవర్తుల పరిష్కారము జరిగెను. గామాజివలన 425 పౌనులను - తాను అడిగిన మొత్తముకంటె కొంచెము ఎక్కువయే - పుచ్చుకొని స్పెయిన్ తనకు ఆ వ్యాపారమునగల స్వామ్యమును వదలుకొనెను

ఒకరెక్క. కార్యనిర్వహణము విశేషప్రయాసమూలకమైయుండెను. కాని గామాజి నిరుత్సాహపడలేదు; వెనుకంజవేయలేదు. హాల్‌బారన్‌వీధి అప్పటికింకను గొప్ప వ్యాపారపు రస్తాకాలేదు. అగుటకు అప్పుడప్పుడే ప్రారంభమగుచుండెను. ఆదినములలో కూడ అది లండనుపట్టణము పోవువారికి గల పెద్ద రస్తాలలో నొకటియైయుండెను. హాల్‌బారన్ వయాడక్టు అప్పటికి ఎంతయోకాలమునకు పూర్వమే 1869 వ సంవత్సరముననే తెఱువబడెను. గామాజిషాపు ప్రారంభింపబడిన వత్సరముననే హాల్‌బారన్ టవున్‌హాలు నిర్మాణము ప్రారంభమయ్యెను. ఇతరతావులయందు అమ్మబడుధరలకంటె తక్కువధరలకు మంచివస్తువులు అమ్ముటవలన గామాజి విశేషసంఖ్య కాతాదారులను ఆకర్షించువాడు. ఈ పద్ధతి కాతాదారుల విశేషామోదమునకు పాత్రమైనను తోడివర్తకుల కన్నెఱ్ఱకు గుఱియయ్యెను. ఈసువహించి తోడివర్తకులు ఆతని వ్యాపారమును కూలద్రోయ పలుయత్నములు గావించిరి.

తోడివర్తకుల ఈ యత్నములనే గాక టోకువర్తకుల ఒత్తిడినికూడ ఆతడు ఎదుర్కొనవలసివచ్చెను. బజారులో అందఱు చిల్లరవర్తకులు అమ్ముధరలకే

గామాజి వస్తువులమ్మకలయునని టోకువర్తకులు నిర్బంధింపసాగిరి. కొద్దిలాభమును తీసుకొని వస్తువులు విక్రయించుటవలన అవి శీఘ్రముగాను, విశేషముగాను విడుదలయగుటకు వీలుకలదని ఆతడు ఎంతయో దూరము చెప్పెను. వారు వినలేదు. ఆతనిని అన్నివిధములచేతను నిరోధించిరి. తుదకు న్యాయస్థానమునకు కూడ పోయిరి. వ్యాపారవిషయమున ఆ టోకువర్తకులు మహామహోపాధ్యాయులే కావచ్చును. కాని ఈ ప్రాథమకల్పకుడు క్రమమున వారిని జయించి తన వ్యాపారమును మిక్కిలి అభివృద్ధిపఱచెను. స్థాపించిన పదునైదేండ్ల యనంతరము ఆ చుట్టుపట్లకు గామాజి దుకాణమే మిగుల పెద్దదియయ్యెను.

ఆదిలో గామాజి దుకాణమున మేజోళ్ళు మొదలైనవిమాత్రమే అమ్మబడుచుండెనని చెప్పియుంటిమి గదా. కాలక్రమమున ఆతని దుకాణమున విక్రయింపబడు వస్తువులసంఖ్య హెంపొందింపబడెను. 1890-వ సంవత్సరప్రాంతమున గామాజి పలువిధములైన సరుకులు విక్రయించుచుండుటయేగాక మార్కెట్టులోనికి ఏ క్రొత్తవస్తువువచ్చినను దానిని తన దుకాణమున గూడ స్టాకుచేయుటకు ఉఱకలువేయుచుండువాడు. అవి ఆంగ్లప్రజలు సైకిళ్ళపై విస్తారముగ మోజుచూపుచున్న దినములు. లండనులో ఈసైకిళ్ళపిచ్చి హద్దుమీరి యుండెను. కొనుటకు శక్తిగలవాడు ప్రతివాడును ఒకసైకిలు కొనితీరువాడు. ప్రజలు తమ ఆఫీసులకు సైకిళ్ళపై పోవుట ఫాషనుఅయ్యెను. యువకులు సైకిళ్ళపై రాత్రిషికారులకు పోవువారు. సైకిళ్ళ షాపులు విశేషముగ స్థాపింపబడదొడంగెను. సైకిళ్ళ విషయములను చర్చించుటకు ప్రత్యేకముగ పత్రికలు స్థాపింపబడి విశేషప్రచారము నందెను.

కాని ఆ దినములలో సైకిళ్ళు చాలగిరాకిగా నుండెను. ఒక్కొక్కసైకిలు మెషీనేసుండెండు మొదలు పదిహేనుగిన్నీలవఱకు వెలయుండెను. అవి చౌకచేసినచో చాల అమ్మకమగునను సత్యమును గామాజి గ్రహించెను. విశేషసంఖ్య సైకిళ్ళకు ఆర్డరు ఇచ్చుటచే గామాజి వానిని తక్కువవెలకు సేకరింపగలిగెను. అట్టి చౌకవెలకు ఇతరులు ఎవ్వరును వానిని ఈయజాలకుండిరి. కాగా సైకిళ్ళు కొనవచ్చినవారితో ఆతని దుకాణము నెట్టుకొనియుండునది. "మంచిసరుకు : కొద్దిలాభము" అను ఆతని ఆశయము సఫలమై ప్రజలకు ఆతని దుకాణమును ఒక యాత్రాస్థలముగ నొనర్చెను. బైసికిళ్ళవ్యాపార విస్తృతి చే ప్రోత్సాహితుడై గామాజి తన దుకాణమున స్పోర్టింగుసరుకులను స్టాకుచేయ ప్రారంభించెను. నేడు స్పోర్టింగుసరుకులమ్ము దుకాణములలో గామాజి దుకాణము అద్వితీయమైయున్నది.

1897-వ సంవత్సరమునాటికి గామాజి వ్యాపారము అతివిస్తృతమయ్యెను. కావున దానిని ఒక లిమిటెడ్ కంపెనీగా మార్చెను. లిమిటెడ్ కంపెనీగా మార్చినను వ్యాపారమును తనపూర్తి స్వాధీనమునందే యుంచుకొనెను. నేడు ఆతని కొమారుడు ఎరిక్. యమ్. గామాజి ఆ విస్తృతవ్యాపారమునకు అధ్యక్షుడై యున్నాడు. ఆ వ్యాపారముయొక్క నేటి మూలధనము 650,000 పౌనులు. ఏడాదికి పదిలక్షల పౌనులకుమించిన వెలగలసరుకులు ఆ దుకాణమున అమ్మబడును. హాల్ బారన్ ఉత్తరభాగమున నెలకొనియున్న గామాజిమందిరములందు నేడు రెండువేల మంది పనిచేయుచుందురు.

ప్రస్తుతము గామాజి వ్యాపారవిషయములనుండి విశ్రాంతిగొనియున్నాడు. తాను బాలుడుగా ఉండినపుడు పనిచేసిన ఉద్యానవనకృషి, వ్యవసాయములందు ఆతడిపుడు పూర్తిగ నిమగ్నుడైయున్నాడు. పల్లెటిపట్టుల జీవనమునన గామాజికి అమితప్రీతి. గార్డాన్ సెల్ఫ్రిడ్జి జీవితమువలెనే గామాజి జీవితముకూడ ఒకానొకడు పల్లెటిపట్టులందు పుట్టినను, ఎట్టి విద్యాసౌకర్యములకు నోచిపెట్టకపోయినను మంచి ఆరోగ్యము, కార్యాచరణమున దీక్ష, జయమందవలయునను కాంక్షఉన్నచో జయశిఖరమునంటి విశేషధనమును ఆర్జింపగలుగుట రూపించుచున్నది.

గామాజివంటి వణిక్పుంగవుని జీవితమును చదువునపుడు ఆ వర్తకుడు అసాధారణమేధావియై యుండ

వలయుననియు లేనిచో అలవోకగా ధనమును పండింప గల సంస్థకు ఆతడు అధ్యక్షుడై యుండుట పొసగదనియు తలంచుచు. అట్టి తలంపు పెట్టుకొనవలదని పాఠకులకు మనవి. ఏమన గామాజివద్ద అసాధారణత ఎందునులేదు. మానవసహజమగు దయార్ద్రహృదయము ఆతనికినిగలదు. తనదుకాణమున పనిచేయువారి నందఱి నాతడు కన్నతండ్రివలె చూచును. అగుట యజమానిఅనిన ఆపనివాండ్రు ప్రాణమిత్తురు. వ్యాపారమున తగిలియున్న దినములలోగూడ నాతడు ఆఫీసునందే అంటిపెట్టుకొని యుండలేదు. వ్యాపారాభివృద్ధి విషయమున ఆతడు ఐరోపా, ఉత్తరఅమెరికాఖండము లను చుట్టివచ్చినాడు.

ఆత డొకసారి ఆస్ట్రియాదేశమునందలి ఒక పట్టణమున ప్రయాణముచేయుచుండెను. అచటి ఒక దుకాణముయొక్క గవాక్షమున క్రొత్తమోస్తరు ఆటవస్తువు ఒకటి ప్రదర్శింపబడియుండుట చూచెను. దానిపై ఆతని కన్నుపడినది. తోడనే దానిని కొనెను. దానిని తయారుచేయు వర్తకుడు అచటికి సుదూరముననున్న ఒక మారుమూల పట్టణమున ఉన్నాడని తెలుసుకొనెను. వెంటనే ఆపట్టణమునకు ప్రయాణమయ్యెను. రెండురోజులు ప్రయాణముచేసినకాని ఆపూరు చేరలేక పోయెను. ఆవర్తకునిసెలవు కనుగొనుటయు కొంచెము కష్టమేఅయ్యెను. కాని ఆంగ్లదేశమున ఆ ఆటవస్తువును స్టాకుచేయగలిగిన దుకాణము తనది ఒక్కటియేయైన తృప్తిలో ఆత డాకష్టమును మఱచిపోయెను.

మఱియొకప్పుడు ఆతడు అమెరికాఖండమున ప్రయాణము చేయుచుండెను. ఆ ప్రయాణమున ఆత డొక వింత ఆటబొమ్మను చూచెను. దాని నిర్మాతకొఱకు ఆతడు అన్వేషణ ప్రారంభించెను. ఈ వర్తకుడుకూడ ఒకమారుమూలపల్లెయందు నివసించుచుండెను. అది శీతకాలము. పెక్కుమైళ్ళు నాటుప్రయాణము చేసిననాని ఆ గ్రామము చేరరాదని ఆతడు తెలిసికొనెను. అగుగాక. ఆతడు సందేహించలేదు. ఒకబండిని అద్దెకుకుదుర్చుకొని ప్రయాణమయ్యెను. మంచువాన ప్రారంభమైనది. దానికి తోడు గాలి. ఆ గాలికి వడగండ్లు ఎగిరివచ్చి కళ్ళను గ్రుడ్డియొనర్చునవి. అట్టి పరిస్థితులలో గామాజికి ఇతరుడైనవాడు ఆటబొమ్మకొసంగతిదైవమెఱుగునని ప్రయాణము మానియుండును. గామాజి మాత్రము మానలేదు. చలికి కొయ్యవారిపోవుచునే యాతడు తన గమ్యస్థానముచేరెను. ఆ వింత ఆటబొమ్మలకు పెద్దఆర్డరు ఇచ్చెను.

కాతాదారులను సేవించుటలో గామాజి ఘనము వారు చాల కుతూహలము కలిగియుందురు. కాతాదారులకు అసంతృప్తికలిగించుట వారికి బొత్తిగా కిట్టదు. ఒకానొక క్రిస్టమసుపండుగ సందర్భమున. ఒకస్త్రీ వారి దుకాణమునకువచ్చి తన చిన్నికొడుకునకు ఒక ఊగెడు గుఱ్ఱముబొమ్మకు ఆర్డరుఇచ్చెను. క్రిస్టమసుకు పూర్వపుదినమువచ్చినది. కాని ఊగెడు గుఱ్ఱముబొమ్మ ఆమెకు బట్వాడాచేయబడలేదు. సాయంకాలమైనది. కాని బొమ్మ తనకు చేరలేదు. తిరిగి ఆమె దుకాణము వద్దకువెళ్ళెను. దుకాణము మూయబడియున్నది. తోడనే ఆమె టెలిఫోనుడైరెక్టరీ తెఱచి గామాజి ప్రయివేటు చిరునామా కనుగొని నేరుగా ఆతనికి టెలిఫోను చేసినది "సరే. మీ పిల్లవానికి అది పంపబడును" అని సమాధానము.

మఱునాడు ఉదయమున పెందలకడనే గామాజి కారువేసుకొని హాల్బోరన్కు వెళ్ళెను. స్వయముగ దుకాణముయొక్క తాళములను తెఱచి గుఱ్ఱపు బొమ్మను బయటకు తెచ్చి తాను ఫాదరు క్రిస్టమసు వేషముధరించి ఆకాతాదారు ఇంటికిపోయి ఆమె పిల్లవానికి దానిని తనచేతులతో బహుమానముచేసెను. ఆ పిల్లవాని అప్పటి ఆనందము ఎట్టిదిగానుండునో మీరు సులభముగనే ఊహించుకొనవచ్చును. 650,000 పౌనులు మూలధనముగల కంపెనీకి తాను అధ్యక్షుడు-తన క్రింద రెండు వేలమంది పనివాండ్రు - ఏడాదికి పదిలక్షల పౌనుల విలువగల వ్యాపారమునకు తాను యజమాని అయినప్పటికూడ గామాజి కాతాదారుల తృప్తికొఱకు ఎట్లు శ్రమించునాడో తెలిసికొనుటకు ఈ ఒక్క నిదర్శనమే చాలును.



[శ్రీ ఊటుకూరు వేంకటసుబ్బారావు శ్రేష్ఠిగారు గ్రంథాలయోద్యమ విషయకమగు రెండు సమస్యల నీ వ్యాసమున చర్చించుచున్నారు. గ్రంథాలయోద్యమాభిమానులు వానినిగూర్చి అర్హమగు ఆందోళనము సలుపవలసియున్నది. —సంపాదకుడు.]

## గ్రంథాలయోద్యమము

# గ్రంథాలయములు : నిషిద్ధగ్రంథములు

మన దేశమున నవీనాదర్శములతో గ్రంథాలయోద్యమము పునరభివృద్ధి జెందుచుండుటాదిగా, భారతభూమి శీఘ్రగమనమున పరివర్తనము జెందుచున్నది. మతాచారములు, సాంఘికమర్యాదలు, రాజకీయ వ్యవహారములు, వ్యవసాయవాణిజ్యములు, వృత్తి వ్యాపారములు, భాషాసంప్రదాయములు సమస్తము మార్పుజెందుచున్నవి. ఈమార్పులన్నిటికిని గ్రంథాలయోద్యమమే మూలకందమనిన నతిశయోక్తి కాజాలదు. నవనాగరికతకు నిలయములై ఐశ్వర్యాభివృద్ధులతో తులతూగుచున్న పాశ్చాత్యదేశముల నెన్నిటినో పెంపొందింపజేసి, జేయుచున్న గ్రంథాలయోద్యమము మనభారతదేశమును మాత్ర మభివృద్ధిపరచకుండునా?

మన దేశమున యాధునిక గ్రంథాలయోద్యమము ముఖ్యముగా ప్రజల సహాయ సానుభూతులపై నాధారపడియున్నది. ప్రభుత్వసహాయము లేనిది యెంతటి సదుద్యమమైనను సంపూర్ణముగ నభివృద్ధి చెందజాలదనుట తథ్యము. మనపాలకులు తమ స్వదేశాభ్యుదయము ముఖ్యముగ గ్రంథాలయోద్యమఫలితమేయని గుర్తెఱింగిన వారయ్యు, మన దేశమున గ్రంథాలయోద్యమమున కింతదనుక సార్థకముగ సహాయపడకుండుట శోచనీయము; మన దురదృష్టము.

గ్రంథాలయములు రాష్ట్రీయప్రభుత్వశాఖకు చెందినవగుటచే దేశమునందుగల వివిధరాష్ట్రములవారు తమతమ ప్రాంతములగల గ్రంథాలయముల సహాయార్థము విరివిగ విరాళములొసంగుటకు తమతమ ఆదాయవ్యయపట్టికలందు ధనమును ప్రత్యేకింపవలసి యున్నారు. శ్రీయుత దేశభక్త కొండ వెంకటప్పయ్యపంతులుగారు శాసనసభాసభ్యత్వమును కలిగియుండిన దినములలో వారు గావించిన కృషిఫలితముగ, రాజధానిలోని గ్రంథాలయముల సహాయార్థము సంవత్సరమున కిరువదివేల రూప్యములను విరాళముగ నొసంగుటకు మన చెన్నరాష్ట్ర ప్రభుత్వమువారు సంకల్పించిరి. ఒకటిరెండు సంవత్సరములు మాత్ర మా విరాళము గ్రంథాలయముల కొసంగబడినది. పిదప యేకారణముననో యాగ్రంథాలయ విరాళ మాపుచేయబడినది. గత సంవత్సరమున ఈగ్రంథాలయవిరాళమును పునరుద్ధరించి గ్రంథాలయముల కొసంగిరి. ఈ

సంవత్సరముకూడ గ్రంథాలయ విరాళమును వినియోగించుట కుద్దేశించి ప్రకటించి యున్నారు. చెన్నరాష్ట్ర ప్రభుత్వమువారిందులకు వందనీయులు. చెన్నరాష్ట్రీయప్రభుత్వమువారు రాజధానియందుగల గ్రంథాలయములన్నిటికై, వత్సరమున కిరువదివేల రూపాయలను మాత్రము ప్రత్యేకించుటనునది తృప్తికరముగ సంతోషింపజాలినది కాదు. రాజధానిలో చక్కగా పనిచేయుచున్న గ్రంథాలయముల కొసంగుటకైనను యీవిరాళ మత్యల్పమనుట సిక్కము. ఏ గ్రంథాలయమునకైనను తృప్తికరముగ విరాళ మొసంగగలుగుటకు రాష్ట్రమొత్తము మీద యీవిరాళము బహుస్వల్పమనిపించుకొనుట నిక్కము. కనుక రాష్ట్రప్రభుత్వమువారీవిషయమును పునరాలోచించి విరాళ మొత్తమును హీనపక్షము యేబది లేక యఱువదివేలకు వృద్ధిజేయుట వారికనీస ధర్మము. ఇందువిషయమై శాసనసభ్యులు కూడ తగు కృషిచేయు టవసరము.

గ్రంథాలయము లీప్రభుత్వసహాయమును బడయుటకు కొన్ని నియమముల పాటింపవలసియున్నది. అందుముఖ్యమైనది నిషిద్ధ గ్రంథములను కలిగియుండకుండుట, దీనిని కాదనువారెవ్వరుండరు, కాని గ్రంథాలయములను తనిఖీచేయు జిల్లా విద్యాశాఖాధికారులు తమవ్యక్తిగతాభిప్రాయములను పురస్కరించుకొని తమకు తోచిన గ్రంథములనెల్ల తీసివేయుడని చెప్పుచుండుటచే చిక్కులుకలుగుచున్నవి. ప్రభుత్వమువారు నిషేధించుచుండు గ్రంథముల పట్టికలను క్రోడీకరించి సంవత్సరమున కొకతూరియో, లేక అప్పటప్పటికో గ్రంథరూపమున ప్రచురించుచుండినచో వానిని గ్రంథాలయములవారు తెప్పించుకొని, యందు నిషేధింపబడిన గ్రంథములను తమతమ గ్రంథాలయములనుండి తొలగింప సులువగును. ముందుముందట్టి గ్రంథములను గ్రంథాలయమున చేర్పకుండుటకును వీలగును. ప్రభుత్వమువారు యేగ్రంథమునైన నిషేధించినపుడు తమరాష్ట్రీయ గజెటునందు ప్రచురించుచుందురు. గ్రంథాలయములవారందరు రాష్ట్రీయగజెటును తెప్పించుకొనగలిగియుండుట దుర్లభము ప్రభుత్వమువారాగజెటును గ్రంథాలయముల కుచితముగ నొసంగరు. అట్టితరి ప్రభుత్వమువారెప్పుడేయేగ్రంథములను నిషేధించి ప్రకటించుచున్నారో గ్రంథాలయములవారు గాని వ్యక్తులుగాని తెలిసికొనజాలకున్నారు. మఱియు జిల్లా విద్యాశాఖాధికారులు గ్రంథాలయములను తనిఖీచేయునప్పుడు నిషిద్ధగ్రంథములను తక్క తక్కినవాటిని తీసివేయించకుండ ఉత్తరువులుండవలసిన యగత్యముగలదు.

ఇదమిద్ధమను నియమములేని కారణమున నొక యధికారి కిష్టమున్న గ్రంథము మఱొక యధికారివచ్చి తీసివేయించుటయు, నొక గ్రంథాలయములో యంగీకరింపబడిన గ్రంథము మరొకగ్రంథాలయములో నిషేధింపబడుటయు నేర్పడుచున్నది. ఇట్టి యసంగతములు జరుగకుండుటకై ప్రభుత్వమువారప్పుడప్పుడు నిషేధించుచుండు గ్రంథముల పట్టికలను గజెటులో ప్రకటించుటయేగాక వానినప్పుడప్పుడు క్రోడీకరించి గ్రంథరూపమున ప్రకటించు నావశ్యకత యెంతయో నేర్పడుచున్నది. నిషిద్ధ గ్రంథములను కలిగియుండక సర్వజనసామాన్యమునకు సాధారణముగ యుపకరించుచున్న ప్రతిగ్రంథాలయము తమ సహాయము పొందగలుగునట్లు చేయుట ప్రభుత్వమువారి ధర్మమైయున్నది. —ఊ. వెం. శ్రేష్ఠి.

# తేనెటీగలు

[గత సంచికలలో లక్కపరిశ్రమనుగూర్చియు, పట్టుపరిశ్రమనుగూర్చియు విస్తరించిన యనంతరము ఈవ్యాసకర్త తేనె పరిశ్రమనుగూర్చి విస్తరింప దొరకొనిరి. ఆపరిశ్రమనుగూర్చి వ్రాయుటకుపూర్వము దానికి ప్రధానాంగములగు తేనెటీగల జీవిత విశేషములను వివరించుట ముఖ్యముగావున ఈవ్యాసమున ఆవిశేషములు చెప్పబడుచున్నవి. తేనెటీగల ఉపయోగము, వాని సంఘవిభజనము, రాణిఈగ వర్తనము, పోతుటీగల సోమరితనము, కార్మికపుటీగల నిరంతర పరిశ్రమ, తేనెటీగల ఆహారము మొదలైన విషయము లీవ్యాసమున చక్కగ వివరింపబడినవి. విజ్ఞానదాయకములగు నిందలి విషయములు విశేష శ్రద్ధతో పఠింపదగియున్నవి.

—సంపాదకుడు.]

మానవుడు నూరింట నూరుపాళ్ళు స్వార్థపరుడు. పశు పక్షి కీటకాదులను తనకైవసము చేసుకొని కాలక్షేపము చేయుచున్నాడాతడు. పశుపాలన మాతని కెంత ఆవశ్యకమో, కీటకపాలనము సైతమంతే. అందు ముఖ్యముగ మధుమక్షిక మాతనికి ముత్తాతలనాటి చుట్టం. కవికుమారులు, జుంటీగ ఝుంఝుం నినాదములతో మేళవించి తమ కావ్యగీతికలు ఆలపించి వినోదించి వినోదింపజేసినారు. పామరజనులో జుంటితేనె లారగించుచూ తమ చుట్టరికమును నిలువబెట్టుకొనగలిగినారు. సామాన్యముగ ప్రజాసముదాయమునకు ప్రాపంచకదృష్టి; పరమార్థదృష్టి కవులది. పరిశ్రమలన్న బ్రతుకుతెరువు మార్గములే; కాబట్టి, యీ వ్యాసమును ప్రాపంచకదృష్టితోనే వ్రాయవలసి యున్నది. అయినను ప్రకృతిపుస్తకమునందు, తన పాఠమును పెద్దక్కరములతో వ్రాయించుకొనగలిగిన తేనెటీగల జీవిత మాధుర్యమును తొలుత గ్రహించుట లెస్స.

తేనెటీగ అను పేరునుబట్టి దీనిని యీగలగోత్రమునకు చెందినదని తలంచరాదు. అది తుమ్మెదగోత్రమునకు చెందినది. ఆంగ్లమున తుమ్మెదను 'బీ' అందురు. ఇట్టి వివిధములైన తుమ్మెదలు నాలుగువేలకు పైబడియున్నవి. అందు మధుకరుడొండు. శాస్త్రరీత్యా పిలువదగిన పేరు తేనెతుమ్మెద. తేనెటీగ కాదు. కాని, చిరకాలానుగతమైన సర్వసాధారణనామముచేతనే వ్యవహరించుట శ్రేయస్కరమగుట జేసి మధుకరుని తేనెటీగ అనియే అందము. ఈగలకును తుమ్మెదలకును కొండొక విశాలవ్యత్యాసము గలదు. ఈగలకు రెండేరెక్కలు. తుమ్మెదలకో నాల్గు.

తేనెటీగనుండి వచ్చుతేనె మధురపదార్థములలోని కెల్ల మధురపదార్థము. సులభముగ జీర్ణమగుటచేసి పిల్లలకును రోగులకును మధు వమృతతుల్యము. తేనె అనేకములగు ఔషధములలో వాడెదరు. అతిమూత్రవ్యాధి, కుష్టు, ఉబ్బసము, పేగులలో పురుగులు మొదలగు జాడ్యముల కిది గురిగా వాడబడుచున్నది. తేనె సుల్లనీరులకు, ఆటజెట్టీలకు నీయదగిన టానిక్. తేనెకు లావుపాటి వారిని సన్నముచేయు శక్తిగలదట. అదియునుగాక, తేనెకు తోడుగ లభించు మైనము వివిధరీతుల ఉపయోగమును బడయుచున్నది. తేనెటీగ యింకొక విధమున మనతో మిత్రత్వమును నెఱపుచున్నది. తమ సహజవిహారములలో, తెలిసియో తెలియకయో జుంటీగలు పుప్పొడిని చెట్టుచెట్టుకు, పూవుపూవునకు మార్చి, పుష్పములు ఫలించుటకు కారణములగుచున్నవి. తేనెటీగ సంఘజీవి. దాని తెలివితేటలు, కష్టసహనము, ఉదారాశయము, దానికి గౌరవము గడించిపెట్టినవి. అట్టిచో, హిందూదేశమందేకాక, పాశ్చాత్యదేశముల

యందు సైతమది సగౌరవముగ నెన్నబడుచున్నదనుటలో సందియములేదు. ఈజిప్టుదేశపు రాజులు జుంటీగను తమ కిరీటములపై శుభచిహ్నముగ ధరించియుండిరట; పోప్ చక్రవర్తి తన అంగరఖాపై భుజములయందమర్చుకొను వాడట; నెపోలియన్ రాజకీవిచిహ్నముగ యీ తేనెటీగను రాచదుస్తులపై పెట్టుకొనువాడట. ఈ నమ్మకము క్రీస్తుమతమునందును కలదు. బాప్టిజము పండుగదినమున పిల్లలకు తేనెనిచ్చు నాచారము, చర్చీలలోని వత్తులు అసలుమైనము (అనగా తేనెతెట్టులనుండి గ్రహించబడినది)యై యుండవలయునన్న సిద్ధాంతము దీనికి తార్కాణములు. ఏది యెట్లయినను, తేనెటీగ ఆర్థికముగను, పారమార్థికముగను మానవుల మన్ననలనందుచు, అతనికి చిరపరిచితయై యున్నదనుట నిర్వివాదాంశము.

## తేనె తెట్టు

దీనిని మధుదుర్గమని పిలువదగియున్నది. మానవునకు సాధ్యముగాని అమోఘశిల్పచాతుర్య మీతేనె పట్టునిర్మాణము నందిమిడి యున్నదని ప్రకృతిశాస్త్రజ్ఞులచే వేనోళ్ళ పొగడబడుచున్నది. తెట్టునకు రెండు వైపుల గదులు. వానికి ఆరేసి గోడలు (ప్రక్కలు). రాయిలేదు, రప్పలేదు. సున్నముగాని, సిమెంటుగాని అనవసరము. మైనము—తమ శరీరములో తయారుచేసి సిద్ధపరచి వెలువరించిన మైనము, జుంటీగ తన యిచ్చవచ్చినట్లు మెలచుకొనుటకు తగిన మృదులపదార్థమగు మైనము—యీ మహాదుర్గమును నిర్మించుట కేర్పడిన పదార్థము. ఒక్క పౌను మైనమును తయారుచేయుటకుగాను, ఒక జుంటీగ 15 పౌనుల పుష్పాసవమును గ్రోలవలసి యున్నది. ఇట్టి మైనపుగదులు కొన్నివేలుగా (20 మొదలు 50 వఱకు) ఒక మధుదుర్గమునందుండును. వానివాని భాగనిర్ణయము, కేటాయింపునందుగల చమత్కారమును గ్రహించుడు. ఆహారపదార్థముల నిల్వచేయు కొట్లు, పై అంచున నిర్మింపబడి యున్నవి. వానికి క్రిందుగా పిల్లలబెంచుటకు గదులు; వానికి దిగువభాగమున 'కార్మికుల' క్వార్టరులు; తెట్టునకు దిగువఅంచున సోమరిపోతుటీగల దివాణములు; వేరుగా తుట్టెను అంటియుండి పొడవుగ వ్రేలాడుచుండునవి రాణిగారి అంతఃపురము—జనానా. ఎంతటి నేర్పు! ఎట్టికట్టడి!!

## సంఘవిభజనము

మధుదుర్గములోని రాజ్యాంగము నేటి ఒకరిపబ్లిక్ వంటిది. నిన్నమొన్నటి వఱకు మానవుడు నిర్మించుకోలేని రాజ్యాంగవిధానము కీటకములగు జుంటీగలు పుట్టుకతోనే నేర్చుకొని వచ్చినవి. మధుదుర్గమునందలి సభ్యులనెల్ల నాల్గువిభాగములుగ చేయవచ్చును.

1. రాణి.
2. పోతుటీగలు (రాజులు)
3. పిల్లలు.
4. కార్మికులు.

## రాణి

'రాణి' ఆదిమాత. అనగా పిల్లలబెట్టు తల్లి. సర్వకార్యములపై అధికారిణి యయ్యును, ఆమె చెప్పుచేతలు అంతగా అవసరములేకనే కర్మకాండమంతయు జరిగిపోవుచుండును. పొడుగుపాటిపొట్ట, తక్కినవానికంటెను స్థూలకాయము గలిగి యుండుట రాణిగారి గుర్తు. కార్మికులకువలె రాణికి కొండి (కుట్టుటకు) లేకపోయినను, అదియే వేరొకవిధమయిన రక్షణాంగముగ మారియుండును. రాణి తనసహజరీవితో తన జనానాయందు దిరుగాడుచూ, అప్పుడప్పుడు పిల్లలుండు తావును పరీక్షించుచుండును. సామాన్యముగ ఒక మధుదుర్గమునం దొక్క రాణియేయుండును. రాణి సుస్తిగా నుండినను, వేఱొకదుర్గమును కార్మికులు స్థాపించదలచినను, మఱి ఒకటిరెండు రాణులు సహాయభూతురాండ్రుగా నుండవచ్చును. సామాన్యముగ రాణి మూడేండ్లు జీవించగల్గియుండినను, ప్రభుత్వముమాత్రము యేరాణిగాని కొన్నినెలల పరిమితికాలము మించి చేసియుండుటఅరుదు. రాణిగారి ప్రభుత్వమునందలి మంచిచెడుగులను నిర్ణయించువారు కార్మికులు. ఏకారణము చేతనైననేమి రాణి తనకార్యములను సక్రమముగ నిర్వహించుట లేదని గ్రహించిన వెంటనే, కార్మికులు రాణి

గారికి సెలవిప్పింతురు. పదత్యాగ కార్యక్రమ మీవిధముగ జరుగును. రాణిగారి అంతఃపురము విశాలమొనర్చబడును. అది గ్రహించి, రాణి వెంటనే గ్రుడ్లుపెట్ట సాగును. అది దినమునకు 2000 గ్రుడ్లుపెట్టగలదు. క్రొత్తరాణి కావలసియున్న గ్రుడ్డు వేరుగ పొదగబడును. ఆగ్రుడ్డు పిల్లయై, పిల్లపెరిగి రాణీ అంశమును దాల్చులోపల 15-16 దినములు పట్టును. ఈలోపుగ పదచ్యుతయైన ప్రాతరాణి, యెటకో - యేకొని భూములకో - లేచిపోవును. లేనిచో కార్మికుల చేతులలో దానికి బలవన్మరణమే సిద్ధము.

## క్రొత్తరాణి గర్భధారణము

'క్రొత్తరాణి' తన జనానా వీడి ప్రణయవిహారమునకు బయలుదేరును. ముహూర్తము కుడిచి, పనిలేక సోమరులై రొదలతో కాలము వెళ్ళబుచ్చుచుండు పోతుటీగలు కొన్ని యీ జవరాలి వెంటనంటి మరులుగొని పరుగులిడసాగును. రాణి సులువుగ లొంగునదియా! అది పోతుటీగల రెక్కబలిమి, పిక్కబలిమి గూడ లెక్కింపదలచెనో యన్నట్లు వాయువేగమున పరుగిడుచుండును. ఏ పోతుటీగ దాని ననుసరించి యెగురగలుగునో, అదే దాని మనసునకు నచ్చిన మగడు. జవరాలు రాణి ఆ పోతుటీగను రాజుగా పరిగ్రహించి, దానితో కలసి విహరించినపిదప తనగూడు చేరుకొనును. రాణీ యనుగ్రహమును సంపాదించగలిగితినిగదా యని యువ్విళ్ళూరి, యుబ్బితబ్బిబ్బయి దానితో విహరించిన పోతుటీగ, పాపము! సంగమమునందు, తన మర్మాంగమును త్రెంపుకొని, తద్విహీనుడై 'కష్టసుఖములు ద్వంద్వములో' యను సామెతను చాటుచున్నదో యనురీతి తన దురదృష్టమునకు వగచుచు, శరీరమును వీడును. అల్పజీవులలో (అందు ముఖ్యముగ కీటకములలో) యిదే విషమపరిస్థితి పెక్కిటియందు కలుగుట కడుంగడు విచిత్రముగనున్నది.

ఆ విధముగ గర్భధారిణియైన క్రొత్తరాణి తనకొఱకై ఖాళీచేయబడిన జనానా చేరి, 2-3 దినముల పిమ్మట గ్రుడ్లుపెట్ట నారంభించును. పోతుటీగనుండి గ్రహించబడిన శుక్లము, రాణి కడుపులోనున్న ఒకానొక సంచిలో ఇమిడియుండును. ఈ శుక్లమును కావలసినపుడు వెలువరించుకొనుటకుగాని, వెలువరింపక పోవుటకుగాని రాణికి స్వేచ్ఛ. పిండముతో శుక్లము కలిసినప్పుడే, కార్మికులుగాని రాణిగాని అగు గ్రుడ్లేర్పడును, పిండముతో శుక్లము కలియనిచో, పోతుటీగలగు గ్రుడ్లేర్పడును. ఇట్టి విచిత్రశక్తిసామర్థ్యములు పెద్ద జంతువులలో లేకుండుట విచిత్రము. అల్పజీవులలో కొన్నిటికి ప్రత్యేకింపబడిన యిది మహత్తరమయిన హక్కు!

## పోతుటీగలు

ఇవి సోమరితనమునకు పెట్టిన పేరు. ఒక తేనెతెట్టునందు వీనిసంఖ్య చాలాకొద్ది—వందకు లోపే. ఇవి అన్నిసమయములందును కానరావు. క్రొత్తరాణి పుట్టినపుడే, వీనినిగూడా పుట్టించుట మామూలు. ఈ సోమరి పోతుటీగల గుంపునుండియే స్వయంవరము జరుగవలసియున్నది. ఈ గుంపులోని, ఒక్క రాజశేఖరుడే రాణిగారి మనసునకెక్కి, ఆమెతో భోగించుటకు నోచుకొన్నవాడు. మిగిలిన పోతుటీగల పని, రాణిగారి ననుసరింపలేక తిరస్కృతి నందునంతవఱకే. వీని జీవిత పరిమాణము రెండుమాసములు మాత్రమే. ఇవి తమ జీవితశేషమును, తయారుగ నిల్వచేయబడిన ఆహారమును ముహూర్తము భుజించుచు, రొదలతో కాలము వెళ్ళబుచ్చుచుండును. అందులకే వాని సార్థకనామము — సోమరిపోతుటీగలని.

## కార్మికులు

మధుదుర్గమునందలి సభ్యులలో ముప్పాతిక మువ్వీసము కార్మికులే. ఇవి స్త్రీత్వము సంపూర్తిగ లేని ఆడపురుగులు. అంగవైకల్యముచే నివి పిల్లలగనుట కనర్హములైనను, దైనిక కార్యకలాప మంతయు జరిగించు కార్మికులివియే. పుష్పరజపుష్పాసవాదిఆహారపదార్థముల స్వీకరించుట వీని పని. దానికై వానికి ప్రత్యేకాంగములు ప్రసాదింపబడి యున్నవి. పుష్పాసవమును గ్రోలుటకు (పీల్చుటకు) పొడుగైన నాల్కలు, పుష్పొడిని గ్రహించుటకై వెనుకకాళ్ళపై దువ్వెనలబోలు అంగద్వయము, గ్రహించిన దానిని నిల్వజేసి తమ గీము

నకు చెప్పుటకు 'పుప్పొడిబుట్టలు,' వీనికున్నవి నిశితమయి, అతితీక్ష్ణమయిన, కొండి—కుట్టుముల్లు—వీనికున్న రక్షణాంగము. దాని పోట్లు తిన్నవారికి దాని చురుకు తెలియకపోదు.

ఈ కార్మికులు నిర్వర్తించు కార్యము లనేకములు. కార్మికులే తెట్టెల నిర్మించునవి. అవి పుష్పాసవమును గ్రోలి, తనశరీరమందు మయినము తయారుచేసి, తమ పొట్టయందలి రంధ్రమునుండి దానిని వెలువరించి, ఓపికతో, తమ అమోఘశిల్పనైపుణికి తార్కాణము లనదగిన మధుజములను—తేనె తెట్టెలను—నిర్మించుకొనగలవు. పిల్లలపెంచు వృత్తి కార్మికులదే. రాణి పెట్టిన గ్రుడ్లను గదులకుజేర్చి. అవి పిల్లలైనపిమ్మట వానికి కాలానుగుణముగ ఆహారమిచ్చుచు, పోషించి రక్షించు భారమంతయు కార్మికులపై ఆధారపడియున్నది.

రాణిగారి కనుసన్నల మెలగి, ఆమెను, ఆమె పిల్లలనుగూడ కాపాడు గౌరవము కర్మధారులగు కార్మికులకే చెల్లినది. అంగరక్షకు లనేకులు రాణిచుట్టు మూగియుండి, పలయు సపర్యలు చేయుచుందురు. చెట్టుచెట్టుకు, కొమ్మకొమ్మకు, పూవుపూవునకు జేరి పువ్వులు కందకుండ పుప్పొడి, పుష్పాసవమును గ్రహించి, తమ నెలవులయందు దాచు నీ లఘుకీటకములకున్న ఓర్పు, సహనము, కార్యదీక్ష, చురుకుదనము యింతింతకాదు. అంతటితో వానిపని తీరలేదు. తాము త్రాగిన పుష్పాసవమును తమకుక్షిలో మధువుగా మార్చి, వెడలగ్రక్కి, నిల్వకొట్లకునింపి, ఆ కొట్లను మయినపు బీగములచేత బిగించి, లోని తేనె చెడిపోకుండునట్లు అప్పుడప్పుడు పరీక్షించుచూ, కావలసినపుడు వాడుకొనుచూ కాలము వెళ్ళబుచ్చు నేర్పు లఘుకీటకములగు జుంటీగల కున్నదని ప్రతిమానవుడెరిగి తీరవలయును. కార్మికులే మధుదుర్గముయొక్క రక్షణాసైన్యము, ఈ రక్షణాసైన్యము తమ ప్రాణముల నర్పించియైనను దుర్గమును కాపాడ జూచుచుండును. పెఱజుంటీగ యేదైన తమ నివాసమును జేరిన, పసిపట్టి గ్రహించి, దానిని కుట్టిచంపుటో, త్రోలుటో చేయువఱకు వానికి నిద్రపట్టదు. చలికాలమందు కార్మికులు గదులలోదూరి, తమ శరీరోష్ణముచే గదులను వెచ్చగనుంచును. ఎండకాలమునకో పంకాలవంటి తమ రెక్కలతో వీచి, గదులను చల్లపరచుచుండును. ఏవిధమలిన పదార్థమేనియు తమగూటిని దుర్మలిన మొనర్పకుండ చూచు నారోగ్యశాస్త్ర నిబంధనలన్నియు నీ కార్మికు లెల్లవేళల ఆచరించుచుందురు.

## కీటకముల ఆహారము.

తేనె, పుప్పొడి ముఖ్యములు. వీనితో తయారుచేయబడిన మఱికొన్ని పదార్థములుగూడ వాడబడుచున్నవి. 'తుమ్మెదపాలు'—అనబడు నొక పలుచని పదార్థము కార్మికుల నోటినుండి వచ్చునది. ఇది బాలామృతము వంటిది. రాణి కావలసియున్న తుమ్మెదకొదమను కార్మికు లీయాహారముతోనే మేపుదురు. 'తుమ్మెదరొట్టె'—తేనె పుప్పొడి, నీరు మిశ్రమముచేసిన పదార్థము, కార్మికులు కావలసిన పిల్లలను కొన్నినాళ్ళు తుమ్మెదపాలతోడను కొన్నినాళ్లు రొట్టెతోడను మేపుదురు.

* * * *

ఈ విధమున మధుదుర్గ రాజ్యపాలనము ప్రశాంతముగ జరిగిపోవుచుండును. కీటకమాత్రములగు నీ జీవులు, తమ బుద్ధినైపుణ్యముచే శ్రమ విభాగమొనర్చుకొని, సంఘశ్రేయమే వ్యక్తిశ్రేయము గాదలంచి, యొడలు దాచుకొనక నిరంతరము కార్యనిమగ్నులై యుండుట మానవుడు పొగడకపోడు. ఎక్కడ అత్యంత కార్యోత్సాహ మున్నదో, అక్కడనే సోమరిపోతు టీగలకుగూడ స్థానముండుట జూడ విచిత్రముగ నున్నది. అయిననేమి? ఎట్టినియమము! సర్కస్ గుంపుగాదు; సైకాదళము గాదు; ఏ మానవసంస్థగాని ఆ కట్టుబాటుతో కార్యముల నెరవేర్చుననుట సంశయింప దగియున్నది. ఆదర్శప్రాయమగు 'కీటక మిలిటరీ డిసిప్లిన్'లో మానవుడు తర్ఫీదు కావలసియే యున్నదని శాస్త్రవేత్తల విశ్వాసము ఎంతయు అనుసరణీయము!

—జా గు గోపాలరావు.

# ముక్తిమార్గం

సిద్ధులూ, బైరాగులూ, సన్యాసులూ, వీళ్ళందరి దగ్గిరా మహత్తరమైన మూలికలుంటాయన్నీ, కటాక్షం కలిగినప్పుడు భక్తులకూ, తదితరులకూ, వాటిని అవ్యాజంగా యిస్తారనీ అందరికీ నమ్మకమైన విషయమే! నా తలనెప్పిబాధకూడా పోగొట్టుకోడానికని అట్లా ఎదన్నా లభ్యమౌతుందేమోనని ఆశపడి, బూడిద పూసుకున్న ప్రతివాడి వెనకా తిరుగుతున్నాను రామేశ్వరంలో. వాళ్ళభాష నాకు రాకపోవడం గట్టి చిక్కొచ్చింది వొచ్చీరాని అరవంలో ఒక బోసిమునిని తలచూపి మందిమ్మని అడిగేటప్పటికి, "ముసలి యోగిని, నాకో కాలనాయిమ్మ"ని వెంటపడ్డాడు. ఇంకోడు తన వొంటిబూడిద నాతలకిరాసి, పావలా డబ్బులు లాగాడు. అరవసన్యాసులు, మళయాళ యతులు, పంజాబు బైరాగులు, బెంగాలీ జోగులు, అందరూవున్నారుగాని, ఒక తెనుగు బూడిదవాడెవడూ కనిపించలేదు, అర్థమయ్యేట్టు నాబాధ చెప్పుకోవాలంటే.

ఇంక మా వూరికి తిరిగిపోదామనుకుంటో, గంధమాధనంచూసి మరీపోదామని బైలుదేరాను. బైలుదేరేప్పటికే నాలుగున్నరదాటింది. మెల్లిగా యిసికలో కాళ్ళీడ్చుకుంటో పోగాపోగా గంధమాధన శిఖరదర్శన మయ్యేప్పటికే సూర్యుడు కుంకుతున్నాడు. ఈ పత్రలన్నీ రాముడూ తమ్ముడూ యెట్లాతిరిగారా, వాళ్ళకి ఏంతోచిందా, అన్నిరోజులు యిద్దరూ ఏం మాట్లాడుకుంటున్నారా, అనుకున్నాను. ఒక ఆడది వుంటే, యెన్నికబుర్లన్నా వొస్తాయి. కాలంతెలీకండా గడిచిపోతుంది. కాని యిద్దరుమొగాళ్ళు—అందులో అన్నతమ్ములు—వాళ్ళని తలుచుకుంటే జాలేసింది. కవికేం? మూడు నెలలు చాలాసుఖంగా సంచరించారు, అని ఒకపద్యంలో మూడునెలలకాలం అరనిమషంలో కొట్టేస్తాడు. దోవలో, ముళ్ళు రాళ్ళు, షాములు, యివి కవి కంటికి కనిపించవు. ఎక్కడ పడుకున్నారు? ఏంతిన్నారు? అని ఆలోచనేఅక్కర్లేదు ఆకులుతిని ఆర్నెల్లు సుఖంగాబతికారని సులభంగా అంటాడు ఒక కందపద్యంలో, ఏ ఆకులు, అవి రుచియెట్లావున్నాయి, నోరుపొక్కి యెంతయేడ్చారు, జీర్ణమెట్లా ఐనాయి, ఆర్నెల్లు తిన్నతరువాత ఆ మనుషులు గుర్తుపట్టేట్టువున్నారా, ఆ సంగతి యేమీ మాట్లాడడు కవి. పోనీ ఆర్నెల్లుకాదు, ఆరురోజులు నువ్వు ఆ అడివిఆకులు తినివుండు ఆనందంగా అని ఆకవిని నట్టడివిలో వొదిలితె తెలుస్తుంది ఆ రాతలేమిటో.

ఆ పర్వతాన్ని హనుమంతుడు తొక్కాడుగావును ఇప్పుడు వుత్తగుట్ట దానిమీద. దానిమీదవున్న గుడిమీద, గుడిమీదవున్న డాబామీదా ఎక్కాను. ఆ పర్వతంమీదనించి రాముడు మొదట చూశాట్టలంకని. లంకకోసం వెతికానుగాని కనపడ్లేదు. కాని దృశ్యం మాత్రం అతి గంభీరమైనది. రాముడంతటి చక్రవర్తి చూడతగినది. ఆ గుట్టమీద రామలక్ష్మణులు అజానుబాహులు నుంచుని, మూడువేపుల సముద్రాలను, ఆ యిసిక పర్వతాలనూ, ఆ పెద్ద సముద్రప్రదేశాలనూ, పరిశీలించడం తలుచుకున్నాను. అట్లా ధ్యానంలోపడ్డాను. మెల్లిగా చీకట్లుకమ్మాయి. చంద్రుడు బలంతెచ్చుకుంటున్నాడు. సముద్రంమీద పక్షులు గట్లకువొస్తో అరుస్తున్నాయి. స్పష్టంగా కనపడే చెట్లూ కొండలూ, చీకట్లో దాక్కుంటున్నాయి. వెనకాలయెవరో

"జయ్‌శీతారామ్" అన్నారు.

మొదట వాల్మీకివొచ్చాడనుకున్నా—బాగా బలిసిన పెద్దశరీరమువాడు పెద్దగడ్డము, రుద్రాక్షులూ, కమండలము కలవాడొకడువొచ్చి మంటపందగ్గిరగా కూచున్నాడు. ఆయనముఖం స్పష్టంగా కనపడకపోయినా, ఆయన తప్పక నాబాధ మాన్పగలడనిపించింది. సమీపానికివెళ్ళి కూచున్నాను

"ఏవూరు అబ్బాయీ" అని గోదావరిజిల్లా తెలు

గులో పలకరించాడు. నాఘోష చెప్పుకున్నాను. అంతా కళ్ళుమూసుక విన్నాడు. ఆనాటితో నాబాధ గట్టెక్కి ఉండనేధైర్యం యెక్కువైపోయింది."

"ఈ తలనొప్పి వొక్కటేనా నీబాధ?"

"ఇంకేంలేదు—అదే నాప్రాణం తీసేస్తోంది."

చిరునవ్వునవ్వాడు

"తలనొప్పి కుదురుస్తానను కో. ఇంక బాధలుండవా? తరవాత?"

"వుండవేం? మానవజన్మ మెత్తింతరవాత వుండకండా వుంటాయా? అప్పుడు చూసుకుంటాను వాటి సంగతి."

"అవును. మానవజన్మమే బాధ—ఒకటిపోతే ఇంకోటి, ఒకటిలేకపోతో యింకోటి, అసలు బాధ లేని వుపాయం, కనిపెట్టాలనిగా—"

"అసలు బాధలేనివుపాయం ఏముంది—చావు తప్ప"

చస్తే బాధలుపోతాయా? పోతే, అందరూచత్తురు, కాని వొకటేసాధనం—"

"అది—?"

"ముక్తి."

యోగుల చిట్కాలలో నమ్మకమున్నా, వాళ్ళ మహిమల్లో మంత్రాలలో నమ్మకంలేదునాకు. అందులో ముక్తి, స్వర్గం అంటే, ముసలమ్మ కబుర్లలాగుంటాయి నాకు,

"ముక్తిఅంటే—"

"ముక్తిఅంటే—జన్మరాహిత్యం"

"ఈ తలనొప్పులతో, యీ బాధలతో, దారిద్రంతో అన్నిటితోటీకూడా జీవితమంటే నాకుచాలా మధురంగావుంది. జీవితం లేకుండా శూన్యం తలుచుకుంటేనే నాకు భయంకలుగుతుంది, నాకు జన్మరాహిత్యం వొద్దు."

నవ్వాడు—పెద్ద వుపన్యాసానికి తయారవుతున్నట్టు కాళ్ళూ, వెన్నూ సద్దుకున్నాడు. నా తలనొప్పి కుదురుతుందనే ఆసలు అడుగంటుతున్నాయి. పైగా అర్ధరాత్రిదాకా, యీ వేదాంతోపన్యాసంపట్టుకుంటే, వొదిలించుకోడం యెట్లానా అని ఆలోచించాను.

"నీకు జన్మరాహిత్యం వొద్దుగాని, ఏంకావాలి?"

'అన్నీకావాలి, ధనము, కీర్తి-ఆరోగ్యం, అధికారం-'

'ఇవన్నీ యెందుకునీకు?'

'అవంటే నాకుయిష్టం.'

'ఎందుకు యిష్టం?'

'వాటివల్ల నాకు ఆనందం.'

'కనక నీకు కావలిసింది, ఆనందం—వీటన్నిట్లోనూ కావాలి?'

ఒకటే సూత్రంవుంది—ఆనందం—తిండిలో, నిద్రలో, అధికారంలో, అన్నిటిలోనూ ఆనందమే ప్రధానం—కాని కొన్ని చిన్నిఆనందాలు, కొన్ని గొప్పవీ, కొన్ని క్షణికాలూ, కొన్ని దీర్ఘాలూ—కాని అన్నిటిలోనూ కలిసి మిశ్రమములై బాధలువున్నాయి. ఆనంతమై, అత్యున్నతమై, బాధరహితమైన ఆనందాన్ని ముక్తిఅంటాము—కడుపునొప్పి వెగటూలేని తిండీ—భయములేని కీర్తి, అధికారమూ, అలసటలేని మైధునమూ, విసుగులేని రాగమూ—యివన్నీ కలిసి యింతేకాదు, నీ మనసుకుఅందని అనేక కోట్ల సౌఖ్యాలు ఏకమైన ఆనందము ముక్తి 'ముక్తిఆనందమా? ముక్తి అంటే జన్మరాహిత్యంకాదూ?'

'అవును. జన్మరాహిత్య మెప్పుడవుతుంది? పరమాత్మలో ఐక్యమైనప్పుడు. ఆ ఐక్యంకావడమే, నిరంతర అవ్యయానందం ఆ లోకంలోకూడా.

'ఆనందంఅంటే ఐక్యం.'—దుడ్డుతో, పువ్వువాసనతో, రంగులకాంతితో, ఐక్యంకావడం ఆనందం. వీటికన్నిటికీ కారణమైన పరమాత్మతో ఐక్యం కావడంముక్తి. జీవాత్మా, పరమాత్మా సంయోగం.

'యెట్లా అది పొందడం?'

'అసాధ్యం. ఎట్లా పిల్లవాడికి స్త్రీవాంఛ అసంభవమో అట్లానే మీరందరూ పిల్లలు—యీ విద్యలో-ఆ యౌవనం పదేళ్ళకో వస్తుంది. ఈ యౌవనం పదియుగాల్లోకూడా రాదు—'

'ఐతే ఎందుకీ ఉపన్యాసం?'

అన్నాను వొళ్ళుమండి.

'తొరగా ఎదగమని చెపుతున్నాను.'

'ఎట్లా?'

'ముందు రాబోయే మహదానందం అనేకరూపాల మీద ధ్వనిస్తోనేవుంది. ఈపరమాత్మకీ జీవాత్మకీ సంయోగంలోవుండే మాధుర్యం - జీవాత్మకీ, జీవాత్మకీ సంయోగంలో కనపడుతోంది. అదే ప్రేమ - ఆ ఆత్మలు నివసించే దేహాల సంయోగంలో వుంది అమాధుర్యం. తలుచుకో - ప్రతి నరమూ, ప్రతి అవయవమూ, ఆవేశంతో వొణికిపోతూవుంటే, మనసూ ప్రాణమూ ఏకాగ్రమై, ఐక్యమైపోయే సమయంలోని ఆనందం - అదేముక్తి. కోర్కెలు, తలపులు, భావనలు, అన్నీ యింకో వ్యక్తితో ఐక్యమైన ప్రేమని తలుచుకో అదేముక్తి. అది కొన్నినిముషాలే, లభ్యమౌతుంది జీవులకి-. కాని పరమాత్మలో ఆ అనుభవం అనంతమౌతుంది. అన్ని అనుభవాల్లలోకీ శ్రేష్టమూ, అప్రమేయము, సంయోగం - అది సృష్టికర్త చెందే అనుభవము-ఇంకోనూతన ప్రాణిని కల్పించే ఆనందం—''

''ముక్తిసాధన అదేనా?''

''సందేహంలేకండా! ఆత్మవికాసమే ముక్తిమార్గం. యోగం, జ్ఞానం, కర్మ, భక్తి అన్నికూడా ఆత్మవికాసానికే సాధనాలు. ఈప్రపంచంలో ఎంత ఐక్యమైతే అంత ఆత్మవికాసం కలుగుతుంది. ప్రపంచమంటే సృష్టి. సృష్టి శరీరాల ఐక్యంవల్ల కలుగుతోంది. ముక్తిఅంటే ఐక్యం. ముక్తివల్ల సృష్టికల్గుతోంది సృష్టి మళ్ళీ ముక్తిపొందుతోంది. ఈ నదులు పర్వతాలు, వృక్షాలు, జంతువులు, మనుషులు,అందరూ నీవేఅనే ఐక్యభావంరావాలి. ఈ భావం ప్రతివాడికి సంయోగంలోని రెండు నిముషాలలోనూ తోస్తోంది. అవునా? కనక ఆ కార్యంలో ప్రతివ్యక్తీముక్తిని రుచిచూస్తున్నాడు. ఆత్మవికాసానికి ముఖ్యసాధనం సంయోగం - ఏ వ్యక్తి ఆ జాతివ్యక్తితో ఎంతమందితో, ఎన్నివిధాల సంయోగం పొందుతాడో అంతముక్తికి సన్నిహితుడౌతాడు

'మరి పాపమంటారు.'

'అంటారు—పాపమేమిటి? ఆత్మవికాసమే, ముక్తి పొందం యీ మూర్ఖులకి. వాళ్ళకి ఆ ఆనందం తెలుసా? వృక్షాలకితెలుసు. కీటకాలకు అంతకన్న ఆనందం తెలుసు. జంతువులకి యింకాకొంత. మనుషులకి అధికానందముంది దాంట్లో. అందులో రసికులూ, ఆత్మ ఔన్నత్యం కలిగినవాళ్ళూ, పరిపక్వం చెందినవాళ్ళూ, ఇంకా అతీతమైన ఉన్నతావస్తను పొందుతారు. క్షుద్రులకు ఆ ఆకర్షణేవుండదు. పశుప్రాయులు వాళ్ళకి ఆత్మవికాసంలేదు. ఒక్కవ్యక్తి అనుభవంతో-ఏ జంతువైతేనేం—దాంతో తృప్తిపడతారు—ఆత్మ యెప్పుడూ ముక్తికోసం బాధపడుతుంది—పరమాత్మ పిలుపువిని రెక్కలుకొట్టుకొని విజృంభించడానికి ప్రయత్నిస్తుంది—ఈశ్వరుడు సౌందర్యమూర్తి, సౌందర్యమంతా యీశ్వరుడు. సౌందర్యమే ఆనందం—సుందరతేజం, సుందరధ్వని, సుందరరసన—సౌందర్యాన్నిగుర్తించి అన్వేషించి, వాంఛించనివాడు అధముడు—సౌందర్యంతో—వివిధరూపాలు, వివిధములైన మార్పులుపొందే, సౌందర్యాన్ని అనుభవించడంలోనే ఆనందం—ఇంతకన్న ఆనందదాయకమైనది ఆ ముక్తిమాత్రమే!

వింతరసికుడో, యెంత సౌందర్యోపాసకుడో, అంత యీశ్వరప్రియుడు—ఎంత అనుభవాన్ని వాంఛిస్తాడో, ఎంత సంయోగాన్నిపొందుతాడో—అంత యీశ్వరుణ్ణి ప్రేమిస్తాడు—ఎన్నివిధాలైన సౌందర్యంతో—యెంతమంది వ్యక్తులతో ఐక్యమౌతాడో—యెంతమంది స్త్రీలను ప్రేమించి కామిస్తాడో, అంత ఆత్మవికాసం పొందుతాడు—'

దిగ్భ్రమచెంది కళ్ళుతెరిచాను

యోగి అంతర్థానమైనాడు—నా తలనొప్పితో సహా—

నా చుట్టూ ప్రపంచమంతా వెన్నెట్లో ముసరించుకుని పడుకుంది. నా హృదయంలో నూతనజ్ఞాన జ్యోతి వుదయించింది.

—''చలం''

# భ్రాంతులు - కలలు

చల్లని పిల్లవాయువులు వీచుచుండెను. సూర్యుఁడు పడమటిదిస నల్లని మేఘములమధ్య కనపట్టుచుండె. అంతకుమున్న వర్షము కురిసియుండుటంబట్టి వాపీకూప తటాకాదులు జలమయంబులై యుండ, ప్రకృతిరమ యొక నూతన శోభవహించి నట్లుండెను.

ఆ సమయంబున నొక సెలయేటిం జేరి, దానిమధ్యనుండిన యొక చట్రాతిమీఁద చతికిలఁబడితిని అవ్వాహిని నెవ్వరపాటునం జూచుచు, చకితుండనైతిని. అప్పుడప్పుడ ప్రొద్దుగ్రుంకుచుండెను. సూర్యకిరణములా ప్రవాహపు నీటిమీఁద ప్రతిఫలించుచుండ, చూచుటకెంతయు రమ్యముగా నుండెను. దానిని కనుగొంటిని. ఉన్మత్తుఁడనై, మైమఱచితిని. నేనెచట ఉండినది నాకప్పు డెఱుకపడదయ్యె. ఆ యవస్థలోనూ హా ప్రపంచమునం బ్రవేసించి, యారమణీయతంగూర్చి యీవిధిని తలపోయం దొడంగితిని !—

ఎఱ్ఱని వండుచే కలసి నీరుపారుచుండ చూచి, యలనాఁడు తల్లికోట యుద్ధమున మడసిన యాంధ్రుల మహోజ్వల రక్తము కరుడుకట్టియుండి నేఁడీ ప్రవాహరూపంబున ప్రవహించుచున్నదా యని భావించితి. ఆ భావ మనంతమైనది. ఒక్కనిముసము !— ఆఁ ! నెత్తురేమి - వాహినీరూపంబున ప్రవహించుటేమి !! ఇట్టిది సంభవించునా ? ఇప్పుడు తెలిసినది. ఇయ్యది అరుణకిరణు నిరసించు నెపంబున నిట్టివన్నెతో కనుపట్టుచున్నది. అంతె. అనుకొంటిని.

కవితావేగంబునం జిక్కి భావనాహర్మ్యమందున నెంతకాల ముమరుండనై యుంటినో నాకు తెలియదు. కాని కొంతవడికి తెప్పరిలితిని. ఈప్రపంచమున బడితిని. అప్పుడు ధన్యుఁడనైతి ననుకొంటిని. ఇట్టి యవస్థ విరోధికికూడ వలదు అనుకొంటిని.

ఏమి అవివేకము ! మతిచెడినవానివలె వానచే నెఱ్ఱబారి పారుచుండిన నీటిని చూచి, రక్తమని భ్రమించితిని. శాస్త్రజ్ఞుండనై (Scientist) కూడ యిట్లు పిచ్చివాఁడనగుట చూడ ఆశ్చర్యముగానున్నది ! ఆంధ్రుల రక్తమెక్కడ - తల్లికోట యుద్ధమెక్కడ !!—ఎన్ని శతాబ్దములు కడచిపోయినవి. నేనొక కవివలె వెఱ్ఱినై లేనిపోని యూహలచేసి, బుద్ధిలేనివాడ నైతినె. బుద్ధిజాడ్యజనితోన్మాదుండ నైతినె.

ఈప్రపంచమున పిచ్చివారు మూఁడు తెగలుగా నున్నారు. పుట్టుకతోడన పిచ్చివారైనవారు మొదటితెగకుం జెందినవారు; కోరికొని (By option) పిచ్చివారైనవారు రెండవపక్షమువారు; మూఁడవ తెగవారు యేదే నొక కారణాంతరమున వెఱ్ఱివారై, కార్యము ముగిసినతోడన చక్కబడువారు. ఈ మూఁడు పక్షములవారిలోను రెండవతెగకుం జెందినవారు—కోరి కొని (By option) పిచ్చివారైనవారు.—కవులు! తక్కిన రెండుతెగలవారి పిచ్చికుదుర్చ ప్రయత్నించవచ్చునుకాని, రెండవ తెగవారిని చక్కపెట్ట నా బ్రహ్మకును సాధ్యము కానోపదు !!

కవితావేగమఁట ! భావనా ప్రపంచమఁట !!—ఈ కవులు కల్లుత్రాగిన వారివలె యావేశముచే మైమఱచి, భావనా ప్రపంచ

మను లోకములోని కితరులనుకూడ ప్రవేశింపఁజూతురు. 'తాఁజెడ్డకోఁతి వనమెల్ల చెఅచె, నన్నట్లున్నది వీరియూహ. ఆభావనాప్రపంచము గగనకుసుమంబని తెలియలేరేమొ కవులు? మనచేతులచే దాకుచు, కన్నులచే చూచుచు, అందువసియించు యీ ప్రపంచమె స్థిరమైనది కాదనినప్పుడు, యీ యూహాప్రపంచ మెట్టిదని వేరుగా చెప్పనేల? కవులవెఱ్ఱికి తుదిమొదలు లేదు. 'కాకిపిల్ల కాకికి ముద్దయినట్లు వెఱ్ఱికి వెఱ్ఱియే ఆనందముగా కనపట్టునేమొ?—వర్ణనలఁట! ఉత్ప్రేక్షలఁట!!—వర్ణనచేయుటకు మొదలిడెనన్న నెన్నిపద్దెములైననేమి, యెన్నిపుటలైననేమి యడ్డుదిడ్డులేక 'ఎద్దుచ్చపోయఁగ యేరులైపాఱఁగ'-అనినట్లు వెడలుచుండును. వసుచరిత్ర యొకటి చాలు నీ విషయమున నన్నింటిని మించును. భట్టుమూర్తి గనుక బ్రదికియుండిన పక్షమున కోర్టులో నాపై మానవష్టపుదావా తప్పక చేసియుండునేమో? ఉన్నదున్నట్లు చెప్పిన కోపమేరికి రాకుండును.

ఇఁక ఉపమలటుండు, ఉత్ప్రేక్షల కంతములేదు. వానికి మన వాఙ్మయము పుట్టినిల్లు కావచ్చును. అట్లనిన రెండుపద్యముల పాదములు జ్ఞప్తికి వచ్చుచున్నవి—

"పూర్వదిగంగనా - స్ఫురితఫాలస్థలీ
దీపిత సిందూర - తిలకమనఁగ,"

అని యొకకవియు, నింకొకఁడు—

"పాంథమానసపద్మ - వనిపాడు చేయను
త్వరపడివచ్చు చౌ - దంతియనఁగ,"

అనియు సూర్యోదయ వర్ణనజేసినారు. వీరి పేరేమొ నాకు జ్ఞాపకములేదు. ఇంతకన్నను బుద్ధిలేనితనముండునా? కవితోఁద్రేక ఫలములఁట ఆత్రాతలు! పోని యీయుద్రేకము అడంగిన పిమ్మటనైన నిజస్థితి తెలియక పోవుట చూడ ఆశ్చర్యముగా నున్నది. పూర్వదిగంగనయఁట! అంగన యీవిధి నసంగమై, శూన్యవ్యక్తియై యుండిన మనగతి-పురుషులగతి—యేమి? ఆయంగన—పూర్వదిగంగన—ఫాలమి కవివరులకు దక్క వేరొకరికి కనబడదు దానికికారణమేమొ? మరేరికి గనఁబడని వస్తుతతి, వీరికిమాత్రము కనబడవలెనన్న వారేకనుకట్టువిద్య నేర్చినారో? అట్టిదేదైన నున్నదాని నొకపుస్తకరూపమున ప్రచురించి పుణ్యముకట్టుకొనకూడదా? ఎంత స్వార్థపరులీ కవులు! ఇఁక రెండవకవి పిచ్చి మొదటిదానిని మించినది. 'అతనికన్న నితఁడు అర్థము హెచ్చు; అతఁడు వాలముద్రిప్ప నితఁడు శూలము ద్రిప్పు'—అనినట్లున్నది. చౌదంతి యమరపురివిడచి యీ యిలకేలవచ్చెనో తెలియదు. ఆ చౌదంతి గుంట్రముగానున్నదఁట. మనయేనుఁగు లట్లుండవె. ఓహో! తెలిసినది! అది దేవలోకములోనుండునదికదూ? అటువంటిదానిని చూచుట కెంతకష్టపడవలెను. ఎన్నేండ్లు తపస్సుచేయవలెను. కవి పుణ్యపురుషుఁడగుటంబట్టియే దానిని చూడగల్గెను. హృదయమొక పద్మవని! ఎట్టి యాశ్చర్యము!! 'యక్సురె' పెట్టిచూచినను హృదయము పద్మమువలె కనఁబడదుకదా? వీరికెట్లు కనఁబడినదో? అదిగదా మహాత్మ్యము. అంతేకాదు ఆ చౌదంతి కమరపురి నెచటను పద్మవని కనఁబడకపోవుట చూడ చాల ఆశ్చర్యముగానున్నది. ప్రపంచమున నెన్నియో వింతలు. ఇదిదానిలో నొకటి. అంతె!

ఇఁక నొకకవి 'సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్'—అని నుడివినాఁడు. ఇంతటితో పిచ్చి ముదిరినది. ఈవాక్య మాంగ్లమున నుండు:—"I am the monarch of all I

survey"—అనుదాని యర్థమును ప్రతిధ్వనించుచున్నది ఈమాట నిప్పుడు గట్టిగా పదుగురిలో చెప్పినచో, దానికి ప్రతిఫలము తప్పక అనుభవింపక తీరదు. ఇతరులేరైనను సరే—ఒక్కకవి తప్ప—యీ వాక్యమును బహిరంగముగా చెప్పిన తప్పక కృష్ణజన్మస్థానమును చూడగలరు. ఇంతటిశయోక్తి లేదు. ఒకవేళ కవియే అనినపక్షమున పిచ్చియాస్పత్రికి కొంపోఁబడకుండునా ? * * *

ఒక గంట. మఱల ఆవేగము. అందని మ్రాని పండ్ల కఱ్ఱుచాఁచినట్లు, కవితావేగంబున ప్రకృతిని తిలకించి దాని సొబగు నానందించి, దానిని పద్యరూపముగా లిఖించఁజాలని వానియవస్థ యింతేకాఁబోలునను కొంటి. 'చతురకవిత్వతత్వపటుసంపదయొక్కరిసొమ్ము కాదు'—అనినారొకరు 'నూతనప్రియుఁడ'ను నామము సార్థకపరచుకొందును దానికీ నూతనమార్గము ద్రొక్కుదును. చూతము !

—పి. యస్. ఆచార్య, బి.ఏ.

# హృదయార్చిక

పుష్కలావర్త కోగ్ర నభోపథమ్ము
పగిది సంక్షుభితారవార్భటి జగమ్ము
నల్లత్రాచు చూపులతోడ నన్నుఁ బట్టి
తిమిర విషగళసీమ బంధించివైచె.

అపుడు జీవితాశాలేశ మరయలేక
దిగులు గొనినాఁడ నిట్టూర్పువగలతోడ;
రక్త బాష్పాల తోడఁ గై వ్రాలినాఁడ—
వికృతహాసము పుడమి రా పెదవి నించె!

నాతనువు కంపమొందె; ధాత్రీతలమ్ము
కాఱు మొయిలు వన్నెల నీలినోరు తెఱచి
భీకరాట్టహాసముల నా వీపుతట్టె!
తిమిర గగనాంగణమ్ము ప్రతిధ్వనించె.

చేయునది లేక ధైర్యమ్ము చేతఁ బట్టి
మూగతనమూని కనుఱెప్ప మూసినాను,
గొనబుతలఁపు, బూమాలలు గ్రుచ్చినాను;
ఒకముహూర్తంబున హృదయార్చిక వెలింగె!

ఎడఁదదివ్వె తళుకు లీను పోడిమియందు
అడఁగి పోయినది తమాసితాభ;
మురువు నగవు లొల్కు ముగ్ధప్రకృతిఁ గాంచి
పాడినాను; నాట్యమాడినాను!

తొలుత నజ్ఞాన జీమూత గళితగాఢ
మసృణ తిమిరమ్ములోనట్లు మ్రగ్గినాను
అక్కటా! ఎదవెల్గు జ్ఞానార్చి మఱచి;
ఎన్ని ఒడిదొడుకులగలవీ బ్రదుకున!

పగులఁగొట్టితి ధ్వాంతకవాటములను
ఎసఁగు విజ్ఞానదీపికా హేతితోడ;
తోడుతో మోదకర్పూరధుని స్రవించె,
ఎగసె నైరాస్య, మిల మధురించె తనువు

బ్రతుకుపూవుటోవరియందు వలపుఁ దేనె
తీయఁదనమిడు ప్రకృతి మాతృకకు మ్రొక్కి
ఆమెవదనానఁ బూతగీతామహమ్ము,
ఉపనిషత్సూక్తి సౌరభం బొలయఁగంటి.

ఆమె గఱపెను:
"నీ హృదయార్చి నరుఁడ!
దివ్యమంగళరోచిస్సు; భవ్యభూతి;
ఈశ్వర విలాసరేఖయై శాశ్వత ప్ర
భూత విస్ఫుట సత్యసమ్మోద మగును."

"వికచమానస స్ఫురిత దీపికను బిడ్డ!
మఱచితివయేని అజ్ఞానదురితపంక
విగత సుషమయౌ నీదు జీవితసుమమ్ము;
జీవవాఱదు సుమ్మి ఆశారజమ్ము!"

—ఓలేటి సీతారామమూర్తి.



స్త్రీలు ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



# మహిళాలోకము

## గృహాలంకరణము

ఆంధ్రభూమి సంపాదకులు తమ పత్రికయందు 'మహిళాలోకము' అను శీర్షికతో స్త్రీ సమస్యలకై ప్రత్యేకించిన పుటలను పెంపొందింపదలచితిమనియు, ఆ పుటలయందు ప్రచురించుట కనువగువ్యాసము నొకదానిని వ్రాసిపంపవలసినదనియు కోరుచు లేఖవ్రాసిరి. వారిలేఖ నాకు చేరినసమయమున నేను శ్రీయుత వేమూరి శ్రీనివాసరావు బి. ఏ., బి. ఎల్ గారు రచియించిన చెన్నపట్టణములో అను నవలను చదువుచుంటిని. అందొక ప్రకరణమున గృహాలంకరణము విషయమున కొందఱు స్త్రీలుచూపు అశ్రద్ధ చమత్కారముగ వర్ణింపబడినది. ఆ పంక్తులు చూడుడు :

"ప్రియంవద సువర్ణయున్నగదిలోనికి వచ్చెను. అది పెద్దగదియే; విశాలముగనే యున్నది. అందొక చిన్నమంచమును దానిపైగలేబులేని యొక పరుపును నుండెను. గదిలోనే మాసినచీరలు పాతబట్టలునుండెను. ఆగది కిటికీయందు మూతవిఱిగిన బొట్టుపెట్టియు నందు గుంకుమ యొలికిన కాటుకకాయయు నొక మూతలేని కుంకుమబరిణియు నుండెను. మంచము ప్రక్కనే యొక చాపయుండెను. దానిమీదను సువర్ణ మాసిపోయిన యిటుకరంగు చీరకట్టుకొని వ్రేలుముడితోఁ బరుండియుండెను. ప్రియంవద గదిప్రవేశించి 'ఏమే, సువర్ణా! పడుకొనియున్నావు?' అని యడిగెను. సువర్ణ దిగ్గునలేచి, 'ఓహో, ప్రియంవదా! రా, కూర్చుండుము, నీవెప్పుడు మాయింటికిరావుగద. నీవు కూర్చుండిన కొంచెముసేపైనఁ గులాసగ నుందును' అనియె.

'అవనుగాని, పండుగపూట, ఈ చింపిరిగుడ్డ, వ్రేలుముడి, నీవు ఈ చాపమీఁద పడుకేమిటి?'

'ఏమిచేయమనెదవో?'

'చాలు చాలులె నీమాటలు! ఈ గదేమిటి? ఈ మాసిన బట్టలేమిటి?'

'నే పండుకొనుటకుఁదగదా ఈగది?'

'నీ పడుకగది యిట్లుండుట దరిద్రముకూడ. ఇందులో నడుగుపెట్టుటకు నాకే యసహ్యముగనున్నది. ఇదెప్పుడైన నూడ్పించినావా? మోకాలులోతు దుమ్ముతో నిండియున్నదిగద. మగవారి కసహ్యమువేసినదంటే వింతయేమున్నది! కోపపడినారంటే కోపపడరా?"

ఈ కథలోని సుగుణ వంటివారిని-గృహాలంకరణము విషయమున అశ్రద్ధపెట్టు స్త్రీలను మనము దినదినము ఎందఱినో చూచుచునేయున్నాము. గృహము స్త్రీల రాజ్యము. తమదైనరాజ్యములకు శోభకలిగించుటలో అశ్రద్ధవహించుటకంటె స్త్రీలు కావించు మహాపరాధము ఏమియు నుండనేరదు. బయట దినమంతయు కాయ కష్టమో మానసిక పరిశ్రమయో గావించి మగవాడు ఇంటికివచ్చినపుడు ఆతడు కూర్చుండుటకు జానెడు శుభ్రమైనజాగా లేకపోవుటయు, ఎదుట వస్తువులు చిందరవందరగ పడియుండుటయు సంభవించుచో అలసివచ్చిన ప్రాణముగుట ఆతనికి కోపమువచ్చితీరును కొందఱు స్త్రీలను ఏమమ్మా ఇల్లు ఇట్లుంచినారు అనిన వారు దానికి తమపేదతనము కారణముగా

చెప్పవత్తురు. ఈ కారణము ఎంతమాత్రమును చెల్లరానిది. ఎక్కడ ఉంచవలసిన వస్తువు అచట ఉంచుటకు ఒకరి పేదతనము అడ్డురాదు. కథలోని సుగుణను గైకొనుడు. ఆమె మాధ్యమిక కుటుంబమునకు చెందినది. ఆమెకు మంచము ఉన్నది, పరుపు ఉన్నది. ఆమె బద్ధకించనిచో పరుపునకు గలేబును తొడగి దానిపై దుప్పటి పఱచియుండును. అప్పుడు ఆ పడుకగది ఎంతయో పొందికగనుండి యుండును. సుగుణ గదిలోనే మాసిన చీరలు పాతబట్టలు పడిఉన్నట్లు చెప్పబడియున్నది. ఈ విషయమున ఒక సుగుణయే కాదు మధ్యమతరగతి కుటుంబముల స్త్రీలలో చాలభాగము దోషము చేయువారే అయిఉన్నారు. పాతబట్టలు, మాసినబట్టలు కుప్పలు కుప్పలుగా దొర్లుచుండుట మనము అనేక గృహములందు చూచుచుందుము. గుమ్మములో పాత బట్టలు పడియుండుటచూచి ఆ యింటికి శుక్రవారము మహాలక్ష్మి రానొల్లక వెళ్ళిపోయినదని శుక్రవారపు వ్రతకథలో ఉన్నది. ఇంటిలోని పాతబట్టలు, మాసిన బట్టలు గదులలో దొర్లనీయక ఒకమూల చేర్చియుంచుట మనస్త్రీలలో చాలమంది అవశ్యముగా నేర్చుకొనదగియున్నది. పెద్దతరపు స్త్రీలు లేచినతోడనే ఇల్లుఊడ్చి కాని పాచియింటవారు రెండవపనిని చేయకుండిరి. కాని ఈ తరపుస్త్రీలకు చెందినది అనవలసిన సుగుణ తన పడకగదినే తుడుచుకొనుటకు శ్రద్ధపెట్టలేదు. ఇంటికి తుడుపే అందము. దుమ్ము కొట్టాడుచున్నయింట కాలుపెట్టుటకే రోతగానుండును. ఇక కాలూదికూర్చుండుటకు ఎట్లు మనస్సువచ్చును? కావుననే ప్రియంవద సుగుణను అట్లు చీవాట్లుపెట్టినది. ఇక సుగుణ బొట్టుపెట్టె సంగతిచూడుడు. జాగ్రత్తచేసికొను నేర్పులేక సుగుణ దానిమూతను విఱుగగొట్టుకొన్నది. ఆమె అజాగ్రత్తచేతనే కాటుకకాయలో కుంకుమ రాలికినది; కుంకుమబరిణ మూతపోయినది. ఎంతటి వన్నెలవిసనికఱ్ఱకైనను రోజుకు మూడు నాలుగు సారులకంటె బొట్టుపెట్టెతో పనియుండదు. పని అయినతోడనే దానిని జాగ్రత్తచేసికొనక ఎక్కడిదక్కడనే ఎట్టికిఎట్టుగాలిగా పారవేసినచో అవి పాడగుటయేగాక ఇంటి పొందికనుకూడ చెడగొట్టును. గృహాలంకరణమనగా గోడకు మేకులుకొట్టి పటములు తగుల్చుటకాదు; విశేషధనము వెచ్చించి మేజాలతో కుర్చీలతో గదులునింపుటకాదు. మనకు ఉన్నవస్తువులకు ఒక్కొక్కదానికి ఒక్కొక్కస్థలము నిర్దేశించి అచ్చట ఆ వస్తువును భద్రపఱచుట; అవసరముకలిగి దానిని అచ్చటనుండి కదిపినచో పనితీరినవెంటనే దానిని యథాస్థానమున నిలుపుట; పాతవి, మాసినవి అగు బట్టలను వేఱుగాఉంచుట, నియమక్రమమున ఇల్లు ఊడ్చుట మొదలగుపనులే గృహమునకు నిత్యశోభనిచ్చును. ఈ పనులుచేయుటకు స్త్రీలకు చిత్తము ఉండవలయునుగాని చేతిలోపైసా ఎంతమాత్రమును అవసరములేదు. కావున నా సోదరీమణులు తమ పాలు మాలికను పాఱద్రోలి గృహాలంకరణము విషయమై శ్రద్ధవహింతురుగాక !

—వెంకటలక్ష్మమ్మ.

# భగ్నజీవి

ఏయుగ యుగాలనాటివో యీ యనంత
గాఢ నీరంధ్ర నిబిడాంధకార గర్భ
కుహర పులకిత జీమూత కోటులు, ఏపు
రాతన ప్రేమగాథానురాగ శిథిల
గాన రాహస్యరాగంబు లొనదించు.

ఏయుగ యుగాలనాటివో యీ మహీజ
వృద్ధశాఖోప శాఖికా పీడ్యమాన
మంద మరుదంకురంబులు, ఏమ్లాన మోహ
గాన రాహస్య రాగంబు లొనదించు.

—వజ్ఝల కాళిదాసు.

# లజ్జాసఖి!

౧

నీకనుపట్టు రెప్పల కనీనిక చాయల నాగియాగి రా
లేకను డాగుసిగ్గునును, లేతమొఱుంగుల పెండ్లికూతురై
దా కనుపట్టు ప్రేమ నిటుదాచెద వెందుల కెంతకాలమీ
రాకల పోకలన్నిలపరాని మనోగత భావబంధముల్.

౨

పూవులమాలలై యెడద, పూచిన భావము లల్లుకొన్న ప్రే
మావిలమైన నాహృదయ, మంతనుమించె వియోగతాపకీ
లావళి రేగి మ్రోడువడు. లాగునొనర్చునొ ప్రేమపూర్ణవై
రావది యేలనో వలపు, రాణి సుధారసపాత్ర వంపగా.

౩

నీలపయోదవేణి కమణీమయితారల గుచ్ఛమొప్ప రా
గాలసమైన యీరజనికాంతకు నేనిటు తోడనీడనై
పాడెడి ప్రేమగీతికల భావమొఱింగిన మాటచేత నీ
రాలు ద్రవించిపోయినవి, రావదియేమొ కృపావిహీనవై.

౪

విలయములైన నీ విరహావేదన వేళల వాడివాడి నీ
లలితమనోజ్జపత్రములు రాలునొ తూలునొ ప్రేమరాజ్ఞి నీ
వలపులసున్నితంపు వలెవాటున గప్పి రసార్ద్రవాహినీ
కలశనువంచ ప్రేమరసగంధముతో వికసింపజేయుమా

౫

ఈ నిఖిలావనీతల మి, దెల్లనునాడొక స్వర్గలోకమై
యీ నరలోకజీవన మి, దెల్లనునాడొక సౌఖ్యగీతమై
కానగ నయ్యెనాకు, నటుంగాకిపుడీ ధరయెల్ల నంధకా
రాన మునింగిపోయినది ప్రాణసఖి! యిటనీవు లేమిచే.

—పెమ్మరాజు రాజగోపాలము బి. ఏ.




# నా ఫొటో!

## (కేవలము వినోదము కొఱకు)

ప్రపంచకంలో నాకీ ఫొటోలమీద పుట్టినంత యసహ్యం యింక దేనిమీద పుట్టలేదు. ఈదిక్కుమాలిన ఫొటోలు తీసేయంత్రం యెవడు కనిపెట్టాడో కాని యిదె నాకొంపకూల్చింది. ఈకనిపెట్టినవాడె కనక నా కళ్ళపడినా వాడు బ్రతికి దాటిపోవడం దుర్లభం. ఒక్కొక్కప్పుడు యీయంత్రం వాడు నాకొఱకె కాబోలు కనిపెట్టాడని యనుకుంటూ ఉంటాను. లేకపోతె అది నన్నింత దుస్థితికి తీసుకురాదు. ఏమని చెప్పుకోను, ఎవరితో చెప్పుకోను, నా దురవస్థ. ఓదార్చేవాళ్ళు లేనప్పుడు యేడిస్తే యేలాఉంటుందో వినేవాడు లేనప్పుడు చెప్పడం ఆలాఉంటుంది. కాని యీ ఫొటోలపై పిచ్చిచూస్తె నాకున్నమతికూడ పోతోంది. ఎక్కడచూచిన యివె! ఎవడుచూచిన యీ వృత్తె! నన్ని విధంగాకూడ బ్రతుకనీయవేమోనని భయంవేస్తోంది వీటికి నామీదింత పగెందుకో!

ఆఁ! అసలున్నసంగతి చెప్పవద్దుమరి! చిన్నప్పుడు నాకుకూడ ఫొటోలంటే చాలసరదాగా ఉండేది. ఎవరైన ఫొటో తీయించుకొంటుంటే ప్రక్కగా, మనంకూడ పడదామనె వుద్దేశంచొప్పున నుంచుంటూ ఉండడం, వాళ్ళ ఫొటో పాడవుతుందని నన్ను తోసేస్తూఉండడంకూడ జరుగుతూ ఉండేది. ఫొటో తీయడం నేర్చుకుందామని ఫొటొగ్రాఫరును 'కాకా' చేసే వాడిని కూడాను. అసలు తీయించుకుందెనె యీ యవస్తకొచ్చినపుడు, నిజంగా తియ్యడంకూడ వస్తె నా స్థితి యేలాఉండేదొ దైవానికితెలుసు. నేనెంత సరదా పడేవాడినో నా ఫొటో తీయించుకోడానికంత భంగం కలిగేది.

మా తాతగారు పెన్షన్ తీసికొన్నప్పుడు ఆఫీసరులు అంతాకలిసి గ్రూప్ ఫొటో తీయించారు. ఆ రోజుకి నన్నుకూడ తీసుకువెడతానని చెప్పడంచేత అంతకుముందు వారంరోజులనుండి ఆయత్తపడ్డాను. ఫొటో తీయించుకుందామని చాకలిదాన్ని తొందరచేసి బట్టలు కూడ తీసుకొచ్చాను. ఇంతా హడావుడిచే ఆ రోజుకు యెదురుచూస్తె సమయానికొచ్చింది నా కెక్కడలేని జ్వరం. ఫొటోకి వెళ్ళడానికి వీల్లేనందున చాల విచారించాను.

మరి కొన్నాళ్ళకు మా అక్కయ్యలంతా పండగకు రావడం, మా తాతగారు పెద్దవాడవడంచేత ఫామిలీ ఫొటో తీయిస్తానన్నారు మా నాన్నగారు. వెంటనె ఫొటోగ్రాఫరుకు కబురు పంపారు. నేను ఆ రోజున స్కూలు మానేసి ఫొటోతీసే వాడింటివద్దే వేశాను మకాం. తిండి తినడానికికూడ తీరుబడిలేకపోయింది. ఫొటోగ్రాఫరు సలహామీద నా ఒడుగుకు కుట్టించుకున్న సూటువేసికొని బూట్ తొడుక్కుని దర్జాగా మా తాతగారిప్రక్క కుర్చీలోకూర్చున్నాను. మా తాతగారు నా నెత్తిమీద హేట్ కూడ పెట్టారు. ఫొటోగ్రాఫరు అందరిని సద్దడంతోటి కొంత కాలయాపన చేశాడు. ఇదంత చూసేసరికి నా వళ్ళుమండింది. ఫొటో తీయించుకుందామనె సరదాకూడ పోయింది. విసిగించి, విసిగించి వాడు వన్, టు, త్రి, అన్నాడు. ఒకవారం రోజులు పోయినతరువాత కాపీలుపంపాడు. ఎవరుమట్టుకు వారె మా చిట్టిబాబు యెల్లా పడ్డాడొ అని ముందుగా నా బొమ్మనె వెతకడం ప్రారంభించారు వాళ్ళ కెక్కడన్న కనిపిస్తెగా. సరే కొంత

సేపటికి మా నాన్నగారు వెధవ తియ్యడం వీడు. ఫోటో పాడుచేశాడు, అంటూ నా బొమ్మ చూపించారు. హేటు పెట్టుకోడంచేత కాబోలు కండ్లు నుదురు గైర్ హాజరు (ఆబ్ సెంటు) అయాయి. ఆ ముఖం యెవరికో కూడ చెప్పడానికి వీలులేకుండా ఉంది. తీయించుకొన్న మొదటిఫోటోయె యీ విధంగా అయింది.

ఫోటో తీయించిన వేళావిశేషమేమోగాని ఒక సంవత్సరములోనె మా తాతగారు, నాన్నగారు కూడ గతించారు. నేను మొదట ఫోటో తీయించుకుందామంటె జ్వరంరావడం, రెండవసారి తీయించుకుంటె పాడవడం, అంతేకాకుండ వీళ్ళచావు; ఇవన్నీ చూస్తె యింక నీజన్మలో ఫోటో తీయించుకోకూడదనుకున్నాను. ఆఫోటోసంగతి యెవరైన తలపెడితే చాలు నాకు దడ, వణుకుకూడ వచ్చేవి. అందుచే ప్రతి సంవత్సరం మాక్లాసు పిల్లలు గ్రూప్ ఫోటో అన్నప్పుడల్లా యేనోయొక వంకబెట్టి తప్పించుకుంటూ ఉండేవాడిని. ఒకొక్కప్పుడు సిట్టింగు ఛార్జెస్ యిచ్చికూడ ఫోటోలో కూర్చుండుట మానేవాడిని. ఈవిధంగా స్కూలుఫైనలు దాక దాటుకొనివచ్చాను. కాని యీసారి హెడ్ మాస్టరు పట్టుదలవల్ల తప్పిందికాదు. అందులో నేను క్లాసులో బాగాచదివేవాడినేమొ హెడ్ మాస్టరు తనప్రక్కనె కూర్చోపెట్టుకున్నాడు ఫోటోలో. 'వన్,' 'టు,' 'రెడీ' అనె వరకు నేనూ టక్ చెక్ గా కూర్చున్నాను. కాని 'త్రీ' అనె సమయానికి నేను మొదట తీయించుకున్న ఫోటోసంగతి, మా నాన్న, మా తాతలచావులు జ్ఞాపకంరావడంచేత ఉలిక్కిపడ్డాను. ఆ భయంచేత బాగా కదిలాను కూడాను.

నాల్గురోజులకి కాపీలొచ్చాయి. "నీమూలాని నేను కూడ కదిలాను. ఫోటో అంతా పాడైపోయిందంటూ" చూపించాడు హెడ్ మేస్టరు. చూస్తినిగదా, నే ఉలిక్కిపడి కదలడంచేత కాబోలు హెడ్ మాస్టరు ముఖము, నా ముఖము ఏకమైనాయి. ఇదిచూచి అంతా నవ్వడం మొదలుపెట్టారు. వీడిని ఫోటోలో యెప్పుడు కూర్చోనివ్వకూడదన్నారు. ఎక్కడ కనిపిస్తె అక్కడ 'ఫోటో' అని ఏడిపించడం మొదలుపెట్టారు.

చదువుచాలించి కొన్నాళ్ళకు ఉద్యోగంలో ప్రవేశించాను. నాతోటి గుమాస్తాలు ఫోటో తీయించుకుందా మన్నప్పుడల్లా నా సాయంకాలమునకె తగిలేది నాకు జ్వరం. ఈలా ఉంటూండగా నాకు అమలాపురంనుంచి రెండుమూడు సంబంధాలు వచ్చాయి. ఇంటివద్ద ఆడవాళ్ళు చూస్తారు కాబట్టి నా ఫోటోతీసి పంపమని కబురుచేశారు వక బ్రాహ్మణునిచేత. నేను మాత్రం ఫోటో తీయించుకోనన్నాను. మా అమ్మ పట్టుదల యెక్కువైంది. తీయించుకోకపోతె వీల్లేదంది. ఈసారి మా అక్కయ్య నన్ను తయారుచేసింది. మూడు ప్లేట్లు ఎక్స్పోజు చేశాడు. ఒకదానిలో కళ్ళులేవు. రెండవదానిలో నాల్గుముఖాలు పడ్డాయి. మూడవదానిలోమాత్రం పండ్లుబిగించి కూర్చోడంచేత కాబోలు మూతిమాత్రం కాస్త ఎత్తుగాపడింది. మిగిలినదంతా బాగానె వుంది. ఈ ఫోటోజూచి మా వదిన 'ఏమయ్యా! చతుర్ముఖబ్రహ్మ, హనుమంతుడు అవతారాలు ఒకేసారి తాల్చావు. ఈ మహాత్మ్యమునీదా? ఫోటోగ్రాఫరుదా' అంది. సరే మూడోదె బాగుంది, అన్నిటికంటె, అని అదె పంపించారు.


ఆ ఫోటోజూచి పెండ్లికూతురు తల్లి 'ఏమయ్యా బ్రాహ్మడా! పెళ్ళికొడుకు నీకేమయిన లంచమిచ్చాడా యేమిటి. ఇంద్రుడు, చంద్రుడు అని కోశావు. చూడు ముసలికోతిలా యేలావున్నాడో' అంది. రెండవ సంబంధపుపిల్ల యీ పెండ్లికొడుకును కనక నాకుచేస్తే నేను నుయ్యోగొయ్యో చూసుకుంటానందిట, నా ఫోటోచూసి. ఈ సంగతంతా వినేటప్పటికి నాకెక్కడలేని దుఃఖంవచ్చింది. చివరకీఫోటోలవల్ల నాకు పెండ్లికూడ అయేలా కనుపించలేదు. వాళ్ళ కిష్టంలేకపోతె పూరుకోక యీ ఫోటో అందరికి చూపెంచడం మొదలుపెట్టారుట. ఆ కారణంచేత నాకు మళ్ళీ పిల్లనిస్తానని యెవడు గుమ్మమెక్కాడుకాదు. గతిలేక ఒక బీదవాళ్ళ పిల్లకి రు 800 యిచ్చి బ్రహ్మచర్యం వదల్చుకున్నాను.

ఫోటోలమీద ఫోటోగ్రాఫరులమీద నాకెంత అసహ్యంపుట్టిందో నామీదకూడ వాళ్ళకంత అసహ్యం పుట్టింది. ఏ గ్రూపు ఫోటోకన్న స్నేహితుల పట్టుదల చేత సిద్ధమైనా, ఆయనుంటేమాత్రం నే ఫోటో తీయనని ఫోటోగ్రాఫరనేవాడు. అప్పటినుంచి నాకు కోపం మరీయెక్కువైంది. ఈ ఫోటోల యంత్రం యేలాగైనా నిర్మూలంచేయాలని నాకు బుద్ధిపుట్టింది. కాని దాని వుద్దేశంకూడ అదేకాబోలు మొదటినుంచి నన్ను నిర్మూలం చేస్తూనె వస్తోంది.

ఒకరోజున మా స్నేహితులందరం కలిసి తీర్థం వెళ్ళాము. వెళ్ళి ఒక అరుగుమీద కూర్చున్నాం కొంత సేపటికి ఆ యింట్లోనుండి యొక స్త్రీవచ్చి 'ఏమండి నన్ను మీరిల్లా దగాచేయడం బాగుందా? నా కివ్వ వలసినడబ్బేదో యిచ్చివేయండి' అని అనడం మొదలు పెట్టింది. నేనేమి యెఱుగనని మొఱపెట్టుకున్నాను. అంతట అదొక ఫోటో తెచ్చి 'అయ్యా చిత్తగించండి. మారుపేరుచెప్పి నన్ను మోసపుచ్చాడు, యీయన. మీరంతా యెవో యీ తగవు పరిష్కరించ' మంది. అంతా ఫోటో చూశాం. అదిచూస్తేనిగదా నాదే! నా ఫోటో అంత బాగఉండం చూచినందుకు నాకు సంతోషం కలిగింది. కాని యీ అప్రతిష్ఠచూస్తె చాల సిగ్గేసింది. చేసేదేమిలేక అవతలివాడెవడో యివ్వవలసిన డబ్బు యిస్తానని చెప్పి యింటికిచ్చి పంపించాను. అక్కడనుంచి నా స్నేహితులు నన్ను హేళనచేయడం మొదలుపెట్టారు. యెవరో నా ఫోటో ఆకస్మికముగా తీసి దానికిచ్చి యీపని చేయించాడు. అంతేకాని నేనేఖర్మం యెరగను.

కొన్నాళ్ళకు నన్నా వూరునుంచి బదలాయించారు. నేను కొత్తవూళ్ళో అడుగుపెట్టిన మరునాడె రోడ్డుపై నెడుతూంటగా కారాపి ఒకరు తన జేబులో నుంచి యొక ఫోటోతీసిచూచి నన్ను ఎరస్టుచేశానని తీసుకుపోయాడు. 'పూనినఖర్మం పొరుగూరెళ్ళినా పోదు' అన్నట్లు యీ దిక్కుమాలిన ఫోటోలు నన్నెప్పటికప్పుడే యిల్లా చేస్తూన్నాయి. ఆ ఫోటోగ్రాఫరు నేర్పేమిటోగాని నాకు చాల ఆశ్చర్యమేసింది. ఒకర్ని కూర్చోపెట్టి యింకొకరిఛాయ తీయగల శక్తి కూడ ఉందికాబోలు అనుకున్నాను. ఆ ఖూనీచేసిన మనిషి నేనుకాదని వాదించుకునేటప్పటికి నా తాతలు దిగొచ్చారు. పిత్రార్జితమైన ఆస్తియంతా ఆఖరైంది. 5 6 నెలలు ఖైదులో ఉండవలసివచ్చింది. ఉద్యోగమూ ఊడింది. చివరికి తినడానికితిండి, కట్టుకుందుకు గుడ్డ లేక ఈలా తిరగవలసివచ్చింది.

—తంగిరాల రామనాథము.



# మిథ్యే కదా?

౧

ఈశ్వరా!
    గుండెలుం
    టే? రమ్ము
నాతోడ
    కనులార నేటిలో
    కముగాంచి దుఃఖింప.
ఈ జగమ్మునకు, నీ
వే; స్వామివైనచో
    ఎంతైన మేలు, గా
    యికసాయి నీకంటె
నిజమాడుటే? మహా
నేరమా నందువో
కన్నులన్నీ విప్పి
కందువో? లోకాలు

౨

తోడి మానవుల నె
    త్తురు పీల్చికులికేటి
నీచమానవ మృగా
    నీకమ్ముతో పోరి
  కండ లూడిన
      మేని
      గాయాలతో
      జీవ
  కణము లెండిన
      నట్టి
      ప్రాణాలతో
  ఉండనైనా లేక
  మండి మసికాలేక
    బ్రతుకుటే
    భారమై
పాడు గోడలమధ్య
మూల్గేటి
కంకాళ
ములమొత్తి
    లీ వేళ
మృత్యువైనా
      వినదు
సత్యమసలే
      రాదు
కర్తవై నీవైన
      కదలిరానేరావు,

౩

ఈ మహాప్రళయ రం
గమునందు నర్తించు
    జీవాల కేనాటి
      కేని రానున్నదా?
స్వేచ్ఛాప్రశాంత, పృ
థ్వీ స్వర్గధామమ్ము
    ఓ ప్రభూ!
      చెప్పవే
      మోయి! కాదేని, నీ
విశ్వతాండవ కలా
విశ్రుతగీతా ప్రపం
    చమ్మేమి? నీవేమి?
      నట్టి మిథ్యేకదా?
      వల్లకాడే కాదా?

—తురగా వేంకటరామయ్య.

# వివాహము

రాజకీయ విప్లవములతోబాటు, సాంఘిక విప్లవములును సాధారణములగుచున్న నీ కాలములో సమాజపురోభివృద్ధికే గాక ప్రస్తుతస్థితికిని మూలమగు వివాహ సంస్కారపు పూర్వోత్తరముల విమర్శించు టావశ్యకము. కొన్ని జనపదముల సమూహము రాష్ట్రమైనట్లు కొన్ని కుటుంబముల సమూహము సమాజమగుచున్నది. కుటుంబమునకు కారణము వివాహముగాన నీ దృష్టిని వివాహము సమాజస్థితికిమూలము. మైత్రీ కరుణేత్యాది సామాజిక ధర్మముల నలవరించుకొనుటకే గాక, త్యాగము, ప్రేమ మొదలగు నాధ్యాత్మిక ధర్మముల నభ్యసించుటకును గార్హస్థ్య మాధారము. ఇట్లు సంఘమునకును, సాంఘికునకును, ప్రయోజనకారియగు వివాహముయొక్క లక్షణముల చర్చించుట కీవ్యాసమున యత్నింతును.

దేశాచారము ననుసరించిన స్త్రీపురుషుల సహవాసము వివాహమనబడుచున్నది. ఆయా సామాజికపు కట్టుబాట్లే యిక్కడ దేశాచారములని చెప్పబడినవి. ఈ కాపురముండు టెంతపర్యంతమను నియమము గూడ నొక యాచారమే. మారుమనువు లాచారమున్న చోట నీ సహవాసము శాశ్వతముగాదు. మనలోనిది శాశ్వతమే.

ఇద్దరువ్యక్తుల సాంగత్యము వారి యితర వ్యవహారములవలె, వారిద్దరికే సంబంధించినదిగాని, దానిని నియమించుటకు సమాజమున కధికారముకలదా యని ప్రశ్న. ఇట్లు మానవుల యాంతరంగిక వ్యవహారముల నెంతటి యధికారి యయినను విధింపజూచుట 'Impertinence' అని ఆంగ్లభాష నాశ్రయించి మనవి జేయుచున్నాను.

సామాజిక, యనగా, సమిష్టిజీవనమువలన కలుగు సౌకర్యముల నన్నిటిని యనుభవింపుచు, నా సౌకర్య సంపాదనార్థమే యేర్పరుపబడిన సామాజికవిధుల నాక్షేపించుట సమంజసమాయని వాదము. కాని సమాజము తన యంగములగు పౌరుల నెంతవరకు నియమింపవచ్చునను చర్చ సమంజసమే గాక, సహస్రాధిక శతాబ్దములకు పూర్వము నిర్మింపబడిన విధుల ప్రయోగించుచున్న మన సమాజవిషయమున, అత్యంతావశ్యకము కూడను. ఆదినుండియు లోకవ్యవహారమునందు రెండు ప్రవృత్తులు చూడనగును. సమాజము తన సమిష్ట్యధికారమును వృద్ధిచేసికొనుటకును, సామాజికాంగములగు పౌరులు తమ వ్యష్టిస్వాతంత్ర్యమును రక్షించుకొనుటకును ప్రయత్నములున్నవి. ఈ ప్రయత్నములలో సమాజమనగా నేది, పౌరుడన నెవ్వడు అను ప్రశ్నలకు కాలానుసరణముగ నుత్తరము లీయబడుచున్నవి.

ఈ ప్రవృత్తుల రెంటిని మనంబున నిడికొని స్త్రీపురుష సంబంధముల విధించుటకు సమాజమున కెంతవరకధికారమున్నదో యాలోచింతము.

వివాహమునందు మానవుడు ముఖ్యముగా నాశించు ప్రయోజనములు రెండు. అకృత్రిమమగు రతి సౌఖ్యము, అపత్య సంపాదనము. ధర్మాచరణము, అర్థసిద్ధి, బంధువృద్ధి మొదలగు నముఖ్యప్రయోజనములు పెక్కులుండవచ్చును. కాని వీటియందు సమాజము సంబంధమును కలుగజేసికొనుట లేదు. ఇక బ్రహ్మానంద సబ్రహ్మచారియగు అనుపస్కృతమగు రతి, దంపతుల యన్యోన్య ప్రేమైకజన్యము. ఇదికేవలము ఆధ్యాత్మిక విషయము. శారీరకమగు గ్రామ్యసుఖము ప్రయోజనమైన, నాది

---

* నే నీవ్యాసమున : సంఘము = Society in general, సమాజము = Organised society or State, పౌరుడు = Member of society అను నర్థముల వాడుచున్నాను. లోకమాన్యులిట్లే వాడిరని జ్ఞాపకము.

భౌతికమును గావచ్చును. కాని బహిరధికాలములకు లొంగునదికాదు. సామాజికవిధుల కీ సంబంధమున చోటులేదు. అందుపాల్గొను స్త్రీపురుషుల ఆధ్యాత్మిక ధర్మమే Morality ఈ సంబంధమును శాసించునది. ఈస్త్రీని యీ పురుషుడు ప్రేమింపవలెనని యాజ్ఞాపించుట కధికార మెవ్వరికిని లేదను విషయ మంద రంగీకరించునదే. అట్టిచో యీపురుషుడు పెండ్లాడదగిన కాంతలని స్త్రీజాతిని వేరుచేయుచున్న సమాజము తనకధికారము లేనిచోట నధికారమును చెలాయించుచున్న దన్నమాట.

ఈవాదముచే సంబంధములకు కాలపరిమితిని విధించుటకు గూడ సమాజమున కధికారములేదని సిద్ధించును. ఇద్దరు స్త్రీపురుషుల సంబంధ మాదంపతుల యిష్టా యిష్టములపై నాధారపడియుండుటచే నట్టి సంబంధ మెంతకాలమని నిర్ణయించుకొనునదియు వారే. దంపతులలో నెవ్వరికైనను యిష్టములేనప్పుడా సంబంధము విచ్ఛేదముకానిచో ముఖ్య ప్రయోజనమగు యక్ర్తిమరతి సౌఖ్యమునకు భంగము వాటిల్లునుగదా. ఇట్టి అవశ్యవిచ్ఛేద కారణమును గుర్తింపమినే మనసమాజమున నేమి పాశ్చాత్యసమాజముల నేమి వారకాంతనైనను బలాత్కరించుటను శిక్షించుస్మృతి భార్యా బలాత్కారమును నేరమనుచోట్ల కొన్ని విశేషములను కల్పించినది. కొన్ని దేశములలో నిది నేరమేకాదనియు స్మృతివిదులు చెప్పెదరు. వివాహబంధము శాశ్వతమని విధించు మన సమాజ మానియమమును పాలించుటకు వేశ్యాకులమును సృష్టించినది. కాబట్టి యిద్దరుస్త్రీపురుషులు సంబంధ మిచ్చయించి, కాపురముండుటకు నిశ్చయించుకొన్నచో వద్దనుటకు సమాజమున కధికారము లేదు. వారు విడివడుట కంగీకరించినప్పుడును వద్దనుట కధికారములేదు. కాని యీవిడాకులలో తన యంగములైన పౌరుల క్షేమాత్రమును అన్యాయము జరుగకుండ చూచు బాధ్యత సమాజమున కున్నది. వియోగమును నిరోధింపజాలదు గాని అందు పాల్గొను దంపతుల బాధ్యతల నిర్ణయించుట సమాజమున కధికారమున్నదని యంగీకరింపక తప్పదు. Monogamy (ఐకదారణము) యే ఉండవలెననిగాని ఉండనక్కరలేదని గాని శాసించుటకుకూడ సమాజమున కధికారములేదు. ఈ విషయములోకూడ పౌరునకు పూర్ణస్వాతంత్ర్యమున్నది ఇవి యన్నియు పౌరుని అంతరాత్మపైనను, ధర్మముపైనను ఆధారపడియుండవలెను. సంఘమునందలి సమిష్టి ధర్మస్థితి పౌరుని కొంతయాకర్షించి యాతని నడవడిని నియమించునుగదా. ఇట్టి విషయమున సంఘమునకు కొంత సంబంధముండియే తీరును. ఈ చర్చచే స్త్రీపురుషసంబంధమునకును, సహవాసమునకును మానవుని పుణ్యాపుణ్య విచక్షణక్షమమగు బుద్ధియే ప్రమాణమని తేలుచున్నది.

ఈ సంబంధమునకు ఫలరూపమైన యపత్యసంపాదనము దంపతుల యాంతరంగిక వ్యవహారమనుట చెల్లదు. ఒక క్రొత్తపౌరుడు సమాజమున జేర్పబడుచున్నాడు. సామాజిక సౌకర్యముల ననుభవించుటకు కోరుచున్నాడు. ఆ శిశువును రక్షించి పోషించు భారమును వహించుటకు బాధ్యతగల తల్లితండ్రులుండనిచో నా శిశువును స్వీకరించుటకు సమాజము నిరాకరింపవచ్చును. ఈ అధికారము లౌకికసభలకుClubs అన్నిటికిని ఉన్నది. తనకు యుక్తమనితోచిన శిక్షణమును విధించుటయు సామాజికకార్యమే. ఇంతియకాదు, ఈ దంపతు లింతమంది బిడ్డలను తప్పక కనవలెనని విధించుటకు శక్తిలేకపోవచ్చును, కాని కాలమాన స్థితిననుసరించి పౌరుల సంఖ్యను నియమించుటకు సామాన్య సభలకువలె సమాజమునకును అధికారముగలదు. తన యంగములగు పౌరుల ప్రవర్తనయును, శారీరక, మానసిక లక్షణములను శాసించుచు, సాధ్యమైనంత వరకు లక్షణముల పౌరులను సంపాదించుటకై Laws of Heridity ని అనుసరించి దాంపత్యసంబంధమును విధింపనువచ్చును.

అట్లయినచో ప్రతిజ్ఞా సన్యాసమా ? వెనుకటి యుపన్యాస సారాంశమంతయు నీ వాక్యముచే వ్యాఘాతమగుట లేదాయని ప్రశ్నింతురు కాబోలును. కావచ్చును. వివాహస్మృతిని సంస్కరించుటకుగాని, లక్షణాన్విత వివాహమిదియని శాసించుటకుగాని నేను

పూనుకొనలేదు. మహానుభావు లీవ్యవస్థను శాసించుటకును, సంస్కరించుటకును బూనుకొనునప్పుడు వారి యత్నముల యుక్తాయుక్తతను పరీక్షించుటకు కొన్ని మార్గములను సూచించుటయే నా తలంపు. నూతన వివాహచట్టముల నిర్మించునప్పుడుగాని వర్తమానాచారముల సంస్కరించుపట్లగాని, సమాజమునకు బిడ్డతోడిదే సంబంధమని చెప్పుటయే నా పని. అసవర్ణ వివాహముల శాస్త్రీయములనుటకు, ఐత్యాది విధులను ప్రయోగించుటకు సమాజమున కధికారము లేదు. జన్మశాసనము (Birth Control) సార్వజనీనమగుచున్న నీ కాలములలో సామాజికవిధుల స్పర్శలేకుండగనే దాంపత్య సంబంధముండవచ్చును. ప్రతి సంబంధమును అధర్మమని నిరాకరించుటకు సమాజమున కధికారము లేకపోవుటయే గాక, ప్రతి దాంపత్యమును అంగీకరించుట విధి. ఈ బుద్ధిచే ఆర్యఋషులు వివాహములను అష్టవిధములగా భావించుటయని నా యభిప్రాయము. Rape, ను పైశాచమని యంగీకరించుటయనగా నెట్టి సంబంధముచేనైనను అపత్యత సంభవించెనేని, యా శిశువునకుకూడ సంపూర్ణపౌర స్వాతంత్ర్యమున్నదనియు, అపరిణీతాసుతుడని, 'హంస్క' లను నిరాకరించుటకెరికిని యధికారము లేదనియు నీ స్మృతివాక్యముల యభిప్రాయమని నా తలంపు. కేవలము ధర్మబుద్ధిచే బ్రహ్మము శ్రేష్టమని యంగీకరించినను, గాంధర్వమునుకూడ శాస్త్రీయమనుటలో వివాహ సంస్కారముయొక్క పూర్వోత్తరముల గమనించియే స్మృతి ప్రవర్తించుచున్నది. ఇందుకు వాత్స్యాయనుని శ్లోకముదహరించి విరమించుచున్నాను.

శ్లో॥ సుఖత్వా, దబహుక్లేశాద, పివావరణాదిహ।
అనురాగాత్మకత్వాచ్చగాంధర్వః ప్రవరోమతః॥

సుకరమగుటచేతను, సౌఖ్యావహమౌటచేతను సమాజవృద్ధుల యంగీకార మక్కరలేకపోవుటను అనురాగాత్మకమౌటను, అష్టవిధ వివాహములలో గాంధర్వము శ్రేష్టము, అని తాత్పర్యము.

—సారంగు లక్ష్మీనరసింహారావు బి. ఏ.





# భిక్షమెత్తుకో

## ౧

రావు రణధీరసింహుడు తన రాజ్యములో ప్రజారంజకుడుగా నుండెను. ఒకనాటి సాయంకాలమున నగరమును పరీక్షించుటకు బయలువెడలెను. పురబాహ్య ప్రదేశమున బీదవాని గృహమొకటి గలదు. ఇంటిని సమీపించి 'ఈ ఇంటిలో పొగలేచుటలేదు. పొయి రాజుటలేదని తోచుచున్నది. సమాచారమేమో కనుగొనుము' అని తన స్నేహితునితో చెప్పెను.

ఒక సైనికుడు ఆ ఇంటిముందరికివెళ్ళి పిలచెను. ఒక వృద్ధురాలు ఇంటినుండి వెలుపలికివచ్చెను. రావుసాహెబు తనవద్దకు పిలచి — మీ పొయి రాజుటలేదేమి? అని అడిగెను.

వృద్ధ—తినుటకేమియు లేనపుడు, పొయి రాజేయుటెందులకు?

రావు—సంపాదించెడివా రెవరులేరా ఏమి?

వృద్ధ—(భయముతో) మహారాజా! ఆర్జించువాడొకడు. తినువారము నలుగురము. సంపాదన కడుపు నిండుటకు తలమునకలుగా నున్నది. వానిని రెండుదినములనుండి 'యెట్టిచాకిరి' చేయుటకు పట్టుకొనిపోయినారు. జాము చీకటిపడిన తర్వాత విడచుచున్నారు. వాడు రాత్రినుండి జ్వరముతో స్పృహలేక పడియున్నాడు. యీ వేకువన మరల వానిని 'యెట్టికి' పట్టుకొని వెళ్ళుటకు, మీ సైనికుడువచ్చి, పిల్లవానికి జ్వరము తగులుట నిజముకాదని తలచి, ఇంటిలో జొరబడి వానిని చావమోదినాడు. ఇదిఒక దుఃఖము. కూటికి లేకపోవుట రెండవది.

ముసలి మాటలు విని రావుసాహెబు హృదయము, కరుణతో, క్రోధముతో, ఉద్వేగముచెందినందున, వారు ముందు సాగివెళ్ళుటకు అశక్తులైరి. ఒక సిపాయి ఒంక తిరిగి—నీవు జిల్లాదారును, అస్వస్థుని పీడించిన ఆ సైనికుని, ఇచ్చటికి పిలుచుకొనిరమ్ము. ముసలవ్వ చెప్పు పిర్యాదును ఇచటనె విచారించెదను. వేరొకనితో—బజారునుండి నలుగురికి మాసమునకు సరిపోవు

భోజనసామగ్రిని తీసికొనిరమ్ము. ఈ ఇంటిపాయి రాజుట నేను చూడవలయును. మఱియు, వీరు భోజనముచేసి పరుండినపిదప, నే నిచ్చటనుండివెళ్ళి ఆహారము గైకొనెదను. అనిచెప్పెను.

రాయలు బయలుదేరునపుడంతయు కొందరు వారి వెంటనంటెడివారు. ముసలిదాని వాకిట పదినిమిషములు వా రాగునప్పటికి జనసమూహము పెద్దదైనది. ఆ గ్రామస్థు డొకడు చాపతెచ్చి పఱచెను. వారు దానిపై కూర్చుండిరి.

ఊరంతయు జమీన్‌దారుని పశ్చాత్తాపబుద్ధి, న్యాయపరిపాలనమునను, పొగడసాగిరి. యీనా డొక దరిద్ర గృహద్వారమున తన యుద్యోగులపై అలిగి, హఠము వేసికొని కూర్చొనియున్నాడు అను సంగతివిని, చుట్టుపట్ల పల్లెలవా రచటచేరిరి.

తన వాకిట రాజు కూర్చొనియుండుటచే వృద్ధ పల్లెత్తి పలుకజాలకుండెను. గ్రామపెద్దలు గూడ గుమికూడిరి. ఇట్టి జనసమూహమును వారిపూర్వులు సైతము ఎపుడు చూచియుండి యుండరు.

వెంటనె జిల్లాదారు, (రివిన్యూ అధికారి) సైనికుడు హాజరైరి. రాజు, చేయించుచున్నపని, దానిలెక్క, యెట్టి చాకిరికి వీనిని పట్టుకొనిపోయిన కారణమును, జిల్లాదారునడిగెను. పిర్యాదు నంగీకరించుచు, యెట్టి చాకిరిచేయించి, తప్పుడు లెక్కలను వ్రాసి, జమీన్ ధనమును తా నపహరించుచున్నట్లు అత నంగీకరించెను. రాజు—నీవీ బీదరోగిని కొట్టితివా? వాడును నేరము నొప్పుకొనెను. వారిద్దరిని రాజు నౌకరినుండి నిలిపివేసెను.

ఒక నెలకు సరిపోవు గోధుమపిండి, పప్పు, ఉప్పు మొదలగు పాకద్రవ్యములు వాడు తీసికొనివచ్చెను. కాని వృద్ధ రాజు న్యాయవిచారణను చూచుటలో నిమగ్నయై యుండెను.

రాజు—ముసలీ! నీకుగాని, మీ యింటివారికి గాని, ఇంకేమైన బాధలుకలవా?

దాని జీవితమంతయు ఉద్యోగుల అత్యాచారములతో గడపియుండెను. ఈ ప్రశ్న అడుగుటకిదియె ప్రథమపర్యాయము. అయినప్పటికి జిల్లాదారు, సిపాయి, శిక్షపొందుటచూచి ఉదారురాలగు ముసలిదానికి దుఃఖమువచ్చెను. ధర్మావతారమా! మాకు మరే బాధలులేవు.

'మీకు భోజనము పెట్టించనిదె, మహారాజుగారు ఆహారము ముట్టరు. కావున త్వరగావెళ్ళి పొయి రాజేయుము' అని ఊరిపెద్దలు ముసలితో చెప్పిరి.

ఆమె తక్షణమె ఇంటిలోనికి పరిగెత్తిపోయి, వంటచేసి, పప్పు పొయిమీదవేసి, రొట్టెలుకాల్చి, రోగికి పప్పురసమును త్రాగించి, మనుమనికి కోడలికి రొట్టెలుపెట్టెను. ఆనందపరవశత్వమువలన ఆమెకు ఆకలివేయలేదు. కాని రాజుఎదుట సత్యముచెప్పుటకు, ఆమెకూడ ఒక రొట్టెముక్కను నోటవేసికొని, గుక్కెడు నీళ్ళుత్రాగి, ఒకగంట గడచులోపుగ, రావుసాహెబు కాళ్ళమీద ఆమెవచ్చి పడి, చేతులు కట్టుకొని—దేవరా! మా యింటివారందరము తిన్నాము. అనిచెప్పెను.

ఆమె కంఠము ఆనందముచే రుద్ధమైయుండెను. కంట ఆనందాశ్రువు లుండెను. ఒక జామురాత్రి గడచిన పిమ్మట రాజు అక్కడనుండి లేచిపోయెను.

౨

ఏ రాజుగాని, వాని అనుచరులుగాని, అన్యాయము జరిపిన ప్రస్తావన ప్రారంభమగునపుడు, వీరి దయాళుత్వము, న్యాయపాలనములకు చేరినకథలు ఇపుడు గూడ పౌరులు గౌరవప్రథముగా చెప్పి వినిపించుచున్నారు. రావుసాహెబు పురాతనాచారములకు పట్టుకొమ్మ. కవులను సన్మానించువాడు. దూరదేశముల నుండి కవులు అతని సభకు వచ్చుచుండువారు. అనుశ్రుతమైన దర్బారులోని ఆటపాటలకు వేశ్యలను, రక్షణ సైన్యమును, నియోగించెను. మట్టు మర్యాదల ధ్యానము పూర్ణముగా నుంచుచుండిరి.

ఒకసారి రావుసాహెబు కాశీవెళ్ళెను. తిరిగివచ్చునపుడు రాణికిగాను కొన్నివేల విలువగల ఒక చంద్రహారమును విలిచితెచ్చెను. చంద్రహారమును మిగుల సుందరముగా చేసియుండిరి.

కాశీనుండి వచ్చినపిదప నిండుకొలువులో వారు

చంద్రహారమునుతీసి సభాసదులకు చూపెను. దానిని చూచి, సభ్యులందరు విస్మితులై మెచ్చుకొనిరి. వారి అంతరంగిక సభ్యులు వారివారిచేతులకు తీసికొనిచూచిరి.

దర్బారు ఆటపాటలకు వేశ్య ఉండెను. శ్యామసుందరి. కంఠమాధుర్యము, గానకళలో విశేషపరిచయములు ఆమెకు కలవు. రావు కవి, రసజ్ఞుడు. ఇందుచే ఆమె వానిహృదయము నాటపట్టు గావించుకొనియుండెను. వారు ఆమెమాట వినుటయు, చేయుటయు కూడ కలదు.

రాజు చంద్రహారమును భరిణలోనుంచి, అరమరలో పెట్టించి తాళమువేయించెను. దర్బారునుండి లేవగనె, రాజు రాణివాసమునకేగి, స్వయముగా రాణిని దానితో నలంకరించెదరేమో, నని అందరు నిశ్చయించుచుండిరి.

ఆనాడు శ్యామ మనసిచ్చిపాడెను. దర్బారునందలి వారందరు 'బాగు—బాగు' అనునటుల ఆమె మోహింపజేసెను. ఇతరులకన్న కవి హృదయుడగు రావుసాహెబు అధికముగ నాకర్షింపబడి 'బలే, అని ప్రశంసించెను. శ్యామ ఈ మెచ్చుకోలునకె తన శక్తినంతయు ధారపోయుచున్నది.

ఆ మనోరథము సిద్ధించగనె శ్యామ వంగి వందనమాచరించెను. వారు సంతోషాతిశయమున ముగ్ధకంఠముతో—శ్యామా! నీ వీనాడు దివ్యముగ పాడితివి. ఏమైన కోరుకొనుము. అని అడిగెను.

శ్యామ మరల మ్రొక్కి, నేను......ఆ చంద్రహారమును ధరించి ఆడుటకు........రావుసాహెబు క్షణకాల మూరకుండెను. పిమ్మట చంద్రహారమును శ్యామకు ఇచ్చివేయవలయు, నని వారి భృత్యునితో చెప్పి, దర్బారు విడుచువేళగుట వారులేచి వెళ్ళిపోయిరి. శ్యామ నమస్కారమాచరించి, పొగడుచు తన నివాసమునకు వెళ్ళినది.

## 3

సీతలుడు వృద్ధ భృత్యుడు. బాల్యమునుండి రావుసాహెబు అనుచరుడు. ఉషఃకాలము మొదలు అర్ధరాత్రివరకు వాడు వారికి స్నానశయ్యాది పరిచారము చేయుచుండెను. వారి ద్రవ్యవస్త్రాదికముల బీరువా తాళములు వీనివద్ద ఉండును.

మహలునకు సమీపమున వానియిల్లు కలదు. మధ్యాహ్నము భోజనమైన తర్వాత రావును శయ్యాగృహమున చేర్చి, వారు నిద్రించువరకు పాదసంవహనమాచరించి, పిమ్మట వానియింటికి అన్నమునకుపోయి, రావు నిద్రలేచెడి మూడుఘంటలకు సౌధమునకు తిరిగివచ్చువాడు.

మరునాడు శ్యామ సీతలునికడకు 'ఆ చంద్రహారము తనకిమ్ము' అని ఒకనిచే చెప్పిపంపెను. రాణికి తేబడిన చంద్రహారము వేశ్యకిచ్చుట సీతలునికి నచ్చలేదు. 'ఇపుడు పనితీరలేదు' అనిచెప్పి వానిని పంపివేసెను. రెండుమూడు దినములకు పిమ్మట శ్యామ వానిని చంద్రహారము స్వయముగావచ్చి అడిగెను. అపుడు గూడ 'తొందరపనిమీద వెళ్ళుచున్నాను' అని సమాధానమిచ్చెను.

ఆమె రావుసాహెబు ప్రియస్నేహితురాలు! సీతలుని అవిధేయత ఎట్లుసహించును! వారి ఆజ్ఞాపాలనము భంగపరచుటకు ఒక సామాన్య భృత్యునికి అధికారము కలదా!

రావు భోజనముచేసి విశ్రమించుటకు వెళ్ళుచుండిరి. అపుడు శ్యామవచ్చి వందనమాచరించి—దేవా! మీరు నాకు బహుమతిగావించిన చంద్రహారమును యెన్నిమారులు కోరినను, ఈనాటికిగూడ ఇవ్వక, మోసముచేయు అవిధేయుడైనాడు సీతలుడు.

రాజు అవిధేయతను ఓర్చువాడుకాడు. వారు సీతలునివైపు క్రోధముతోచూచి—ఇపుడే తెచ్చియిమ్ము. అని ఆజ్ఞాపించెను.

వారు శయ్యాగృహమును చేరగనె సీతలుడు అరమర వద్దకువెళ్ళి, చంద్రహారపు డబ్బీతీసికొని, రావుసాహెబువద్దకు త్వరగా వెళ్ళెను.

సీతలుడు నిరక్షరాస్యుడు. స్వాభావికముగ విశ్వాసి. యజమానుడు అపకీర్తిపాలగునని సంకోచించి, ధర్మమడుగంటుట గ్రహించి, వాడు వికలుడయ్యెను. క్షణములో తన కర్తవ్యమును నిశ్చయించుకొని, ధైర్యము నవలంభించి, తన ప్రాణముల పందెముపెట్టి స్వామి కీర్తికోరువాడై, చంద్రహారము రావుసాహెబు ఎదుటనుంచి—తీసికొండి, రాణి హారము వేశ్యకిచ్చుచున్నారు! భిక్షమెత్తికో!

ఇటులచెప్పుచు సీతలుడు సౌధద్వారములు దాటుచు, ప్రాణములను తెగించి, వానిఇంటికి పరిగెత్తి, వెలుపలనుండియె—ఏమె! రాజు ధర్మభ్రష్టుడైనాడు. ఇక నేనీ రాజ్యమున నుండజాలను నీవు పిల్లాజల్లను తీసికొని, ఈ రాజధాని పొలిమేరను దాటి శీఘ్రముగ రమ్ము. నేను నిన్నచ్చట కలసికొనెదను.

సీతలుడు ఒక నిమిషముకూడ ఇంటివద్ద నిలువలేదు. రాజసౌధమునకు దక్షిణపుసరిహద్దు సమీపమున నుండుటచే, ఆవైపు పరిగెత్తిపోవుచుండెను.

## ౪

రావుసాహెబు హృదయమునందు సీతలుని అప్రియసత్యము ఆ వేదనను కలిగించెను. డబ్బిని ఎదటితిన్నెపై నుంచి, వారు శయ్యపైవ్రాలిరి. శ్యామ అక్కడినుండి పెడవికుదల్పక తొలగిపోయెను.

సౌధములో ఈ ఉపద్రవము వ్యాపించెను. పురవాసులు పలువిధములగు కల్పనలు కావించుచుండిరి. రావు, సీతలుడు, శ్యామలను తప్ప ఇతరులకు ఏమైనదియు తెలియదు.

ఇంతలో మరియొక పరిచారకుడు పొగాకు నింపిన హుక్కాను తెచ్చెను.

రావు—సీతలుని పట్టుకొనిరండు. అని పహారాజవానులతో చెప్పెను.

వారు యీ ఆజ్ఞకావించి నిదురపోయిరి. కావలివారు సీతలుని ఇల్లుచేరిరి. గ్రామమునువదలి వెళ్ళినాడని పౌరులు చెప్పిరి.

అతనిని బంధించి తీసికొనివచ్చుటకు అశ్వారోహకులు పరువెత్తిరి. మూడుమైళ్ళదూరమున పరిగెత్తి వెళ్ళుచున్న సీతలుని రౌతులు వెళ్ళిపట్టుకొనిరి. నాలుగైదు గుద్దులుగుద్ది, పెడరెక్క విరచికట్టి, వానిని మహాలువద్దకు తీసికొనివచ్చిరి.

ఉద్యోగులలో ఒకరికొకరు మిత్రులు లేరు. నిష్కారణముగ ఎలుక వస్త్రముల కొట్టివేయునటుల, జమీందారి జీతగాండ్రు కారణములేక పరస్పరము నిందించుకొనుచుండెదరు. సీతలుడు రావుసాహెబు నమ్మినబంటు, సర్వకాల సర్వావస్థలయందు వారివద్ద నుండువాడు రైతులను దోచుకొనితిను కర్మచారులు, సీతలుడు వారిమీద రాజుతో కొండెములు చెప్పునని తెలిసికొనియుండిరి. ఈనాడు వారికి మంచిసమయము చిక్కినది.

ఒకడు—నేడు దొంగచిక్కినాడు.

వీనినిచూచి మరియొకడు—ఉద్యోగులను దోచుకొని ఇల్లునింపినాడు. ఇపుడు తెలియును.

ఇంకొకడు—వీడు శ్యామలను తిట్టినాడు.—ఆమె చాడీ చెప్పినది. రావుసాహెబు కత్తితీసికొని వీనిని చంపుటకు ఉద్యుక్తుడైనాడు.

వేరొకడు—భగవంతుడు పగసాధించుకొనునంతటి గర్వము వీనికికలిగినది.

ఇటుల తలకొక మాటగానుండెను. రెక్కలు విరచి కట్టిన సీతలుడు సింహద్వారమునకెదుట తలవంచుకొని కూర్చొని ఉండెను.

లోకులు రాజు నిద్రలేచుటకు ఎదురుచూచుచుండిరి వారు మూడుఘంటలకు నిద్రలేచిరి. సీతలుని పట్టుకొని వచ్చుటకు సూచనగావించిరి. సీతలుని బంధములు విప్పి రావుసాహెబు సన్నిధికి తీసికొనివచ్చిరి. సైనికులను వెళ్ళుమని సౌంజ్ఞకావించిరి.

రాజు—సీతలా! హుక్కా తీసికొనిరా,

వాడు గుడాకునింపుకొని హుక్కా తెచ్చుటకు వెళ్ళెను, మహాలులోని దాసదాసీలు, సైనికులు, అందరు ఒకరిముఖము నొకరు చూచుకొనుచు తొలిగిపోయిరి. ఎవరికి ఏమియు తెలియదు.

సీతలుడు హుక్కా తెచ్చి, యథాప్రకారము నిత్యకృత్యములు చేయసాగెను. రావుసాహెబు పొగత్రాగి లేచి, కాలకృత్యములుతీర్చి, వస్త్రములు ధరించి తాంబూలమువేసికొని, దర్బారునకువెళ్ళి కూర్చొనెను. సీతలుడు నీడవలె ఎల్లపుడు వారివెంటనుండెను.

రావుసాహెబు ఏబది యకరముల భూదాన పత్రమును శ్యామచేతికిచ్చి—ఇది నీ జీవితభరణము. ఇక మీదట నెపుడును దర్బారునకు రాకూడదు.

చంద్రహారపుడబ్బి సీతలునిచేతికిచ్చి రాజు—దీనిని తీసికొనిపోయి పట్టపుదేవికిచ్చి రమ్ము. (అనువాదము.)

—దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి.

# శారదావిజయము

## (గ్రంథవిమర్శనము)

ఆధునిక కాలమున ఆంధ్రవాఙ్మయవాహిని పెక్కుదిశల ప్రవహించుచు, క్రొత్త విషయముల నలవరచుకొనుచున్న విషయ మెల్లరకు విదితమె; కాని ఆంధ్రునకు వేలం వెఱ్ఱి ఎక్కువ. హిందీయందుగల యభిమాన మాతనికి నేడాంధ్రముపట్ల గానరాదు. పరభాషను వశపరచుకొనుట మంచి విషయము గాకపోదు, కాని స్వభాషను కేవలము విసర్జించి, తెనుగునుడికారంపు తీరుతియ్యములను, తెనుగుబాసయొక్క కులుకుందనమును; తెలిసికొన యత్నింపకుండుట శోచనీయము. తనకుమాలిన ధర్మము లోకమున గలదా? ఏయితర భాషలవారైన ఇట్లు జేయుచున్నారా? స్వభాషను ఆదరించి, ఆశ్రయించి, దానియందు పాండిత్యమును సంపాదించి, తరువాత, తమ కాలమును పరభాషకే వినియోగింపతగును.

ఇట్టి పరిస్థితులలో. తమిళ దేశమున వలస నెలకొనిన యొకసోదరి, స్వభాషను, అనాదరింపక, తన యోపినకొలది 'శారదావిజయము' అను నొక చక్కని గ్రంథమును రచించి, తెనుగుతల్లికి తగురీతి యూడిగ మాచరింప నడుము బిగియించుట ప్రశంసింపవలసిన విషయముకాదా? తమిళ దేశమున పెరిగి, 'నిత్య వ్యవహారములందు తమిళభాషనే మాటాడుచు, తెనుగుభాషయెడ తమకుగల యభిమానమును తుదిముట్టింపనేరక, ఈరీతి గ్రంథముల వెలయింప దొరకొనిన, ఈవిదుషీమణి మిగుల ప్రోత్సహింపబడతగినది. ఆంధ్రుని విజ్ఞానము, ఆంధ్రుని శౌర్యసంపత్తి, ఆంధ్రుని కళాప్రతిభలు, మొదలగు నమూల్యములగు విషయము లీగ్రంథమున ప్రస్తరింపబడి యున్నవి. ఈ కవయిత్రిని యొక్క ఆంధ్రాభిమానమున కీగ్రంథమే ప్రబల నిదర్శనమై వెలయగలదు.

ఇందలి కథ 15-వ శతాబ్దమునాటిది. విజయనగర సామ్రాజ్యము పసుపు కుంకుమలతో, సర్వ సౌభాగ్యములతో తులతూగుచున్న దినములలో జరిగిన కొన్ని విషయములిందు వర్ణింపబడినవి. ద్వితీయ ప్రకరణారంభమునందలి వాక్యము లత్యంత మధురములై, గ్రంథకర్త్రియొక్క వచన రచనాపాటవమును విశదపరచుచున్నవి. తృతీయ ప్రకరణమునందు, 'బహుమనీరాజ్యము' అను నామమెట్లు వచ్చెనో చర్చింపబడినది. అందు విపులపరుప బడిన పరికల్పనము theory క్రొత్తదారి జూపుచు, ఆలోచన రేపుచున్నది.

ఈ గ్రంథమునందలి కథను రెండు భాగములుగా విడదీయనగును. ఒకటి: 14-వ శతాబ్దమునందలి దేశస్థితి, ఆంధ్రరాజులకు, మహమ్మదీయ నరపతులకు గల వైరము; ముదుగల్లు, రాయచూరు దుర్గముల ప్రాముఖ్యత. రెండు: శారదా సింహాద్రులయొక్కయు, జానకీ హరిహరులయొక్కయు అనురాగము, ఇందులకు దలపడిన ఆటంకములు, తుదిని వివాహము. ఇందు మొదటిభాగము చరిత్ర నాధారపరచుకొని యున్నది రెండవ భాగము, మొదటిభాగము నాశ్రయించు

కొని, పాలలో నీరువలె, దానియందు వింత రీతి లీనమైయున్నది. రెండవభాగము లేకుండినచో, ఈ గ్రంథ మొక చరిత్రమై యుండెడిది. మొదటిభాగము లేకున్న నొక పుక్కిటి పురాణమయ్యెడిది అందులకే రెండుభాగములను కలిపి, ఒకదానిపై నొకటి యాధారపడి యుండునట్లు, ప్రజ్ఞావతియగు గ్రంథకర్త్రి పొందుపరచిరి. ఇందలి శారదాపాత్ర పోషణ చక్కగా నిర్వహింపబడినది. ఖాజీ, పాహోల కపటవృత్తి చక్కగా చిత్రింపబడి, వారి పతనమునకు దారిజూపుచున్నది. ఎంతటి యైశ్వర్యవంతుడైనను, బలవంతుడైనను లోకమున నీతివంతుని హింసింపజాలరు. సత్యమే సర్వసౌభాగ్యప్రదము అను నీతి, ఈగ్రంథమున చక్కగా బోధింపబడినది. ఇందలిశైలి మృదుమధురము సంస్కృత శబ్దము లచ్చటచ్చట విరివిగా ప్రయోగింపబడినవి.

"ఖాజీనామ మేల ? కాల్పనా ? ఉన్నది మీాప్రాపున. తిన్నది మీాసొత్తున. కట్టినది మీావసనము. పుట్టినది మొగలాయి మతము. పాహంగారి యాప్సితము లీడేరని నాడు ప్రాణము లుండిననేమి ? బోంది మండిననేమి ?" మొదలగు వాక్యములు శైలియందలి వేగమును జూపజాలినవిగా నున్నవి. సింహాద్రి శారదకు వ్రాసినజాబు, బహుమనీ సుల్తానుప్రోల రాయలవారి రాయబారి పలుకులు (పుట 27) మిగుల యర్థవంతములై యలరుచు గ్రంథకర్త్రియొక్క ఘనమగు రచనానుభవమును జాటుచున్నవి.

తెనుగు మాగాణములందు నేటికిని వాడుకలోనున్న సామెత లీగ్రంథమున గలవు, ఇవి గ్రంథమునకు వన్నెబెట్టుచున్నవి :—

'పిలువని పేరంటము జెప్పని యొక్క ప్రొద్దు' (పుట 50)

'లోకుల నోళులకు మూకుడు మూయ నాతరమా' (పుట 52)

'ఏపుట్టలో నేపాముగలదో ! ఎవరికెరుక (పుట 53)

'అత్తగారికి బుద్ధియల్పంబు' (పుట 103)

'తాదెప్పుకొన్నత్రాళ్ళు తన్నేగట నుపయోగించె' (పుట 122)

ఇట్టివి పెక్కులుగలవు ఈగ్రంథమునకు, ఆంధ్రభాషాభిమానులగు శ్రీ వెంకటగిరి కుమారరాజావారు పీఠిక రచియించి తమ యుదారతను వెల్లడించిరి. ఇట్లే మరికొన్ని గ్రంథముల వెలయించి శ్రీమతి దేవమణి సత్యనాథన్‌గారు, ఆంధ్రభాషా పోషకూడిగ మాచరింతురని ఆశించుచున్నాను.

—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు,
బి. ఏ.

## కాగుణింత పజిల్ సమాధానములు.

1. రవిక, 2. వికారి, 3. తాటకి, 4. ఫకీరు, 5. మూకుడు, 6. కూర్మము, 7. కెనడా, 8. కేసరి, 9. కైకేయి, 10. కొరడా, 11. కోయిల, 12. కౌగిలి, 13. కంసాలి, 14. చక్రము, 15. ప్రకృతి, 16. నక్కలు.

అన్నిటికిని సరియైన సమాధానములు పంపుటచే బహుమానధనము ఈ క్రింది ముగ్గురకు పంచబడును.

(1) కె. వెంకటరమణ కేరాఫ్ కె. విశ్వనాథంగారు తాతాస్టేషను తాతానగర్.

(2) నా. సోమరాజుగారు, తుని.

(3) సమయమంత్రి అప్పారావుగారు, నరసాపురం.

బహుమానము పొందినవారు ఆ ధనమును భాగవతాది గ్రంథములను కొని పంపమనుటగాని, సొమ్ము మనియార్డరు చేయమనుట గాని, ఆంధ్రభూమికి చందాగా జమకట్టమనుటగాని మాకు తెలిపినయెడల ఆ మేరకు వారి ఆజ్ఞలు నిర్వర్తింపబడునని మనవి.

# మణిమాల

## ఆంగ్లేయులు తమ ధనమునెట్లు వ్యయము చేయుచున్నారు.

లండనులో సౌందర్యమును పెంపొందింపచేయు వైద్యశాలలు గలవు. ఈ శాలలలోనికి పోవువారిలో పలువురు స్త్రీలే. ఆ స్త్రీలు ఏడాదికి ఈ శాలలయందు 60 000,000 పౌనుల ధనమును వెచ్చించుచున్నారు. ఏ ఒక్క విషయముకంటెను ఈ విషయమునుగూర్చిన వ్యయమే ఆంగ్లదేశమున హెచ్చు అని చెప్పవచ్చును. ఈ సౌందర్యశాలలకు పోవువారి సంఖ్య సినీమాలకు పోవువారి సంఖ్యకంటె చాల తక్కువ. అయినను సినీమాలకొఱకు వెచ్చపెట్టు ధనముకంటె సౌందర్యశాలల కొఱకు వెచ్చపెట్టుధనమే మిక్కిలి హెచ్చుగానున్నది. ఎంటర్ టెయిన్ మెంటు పన్ను వలన రాబడి 9 000,000 పౌనులు. నూటికి పదహారు వంతులు మాత్రమే ఎంటర్ టెయిన్ మెంటు పన్నుగా వసూలు చేయబడుచున్నది. గావున దీనినిబట్టి లెక్కించుచో ఏడాదికి అచట సినీమాలు మొదలగువాని కొఱకు 56 మిలియను పౌనులు వ్యయముచేయబడుచున్నవి. విద్యకొఱకు నూరుమిలియను పౌనులు సంవత్సరమునకు వెచ్చింపబడుచున్నవి. విదేశములందు యాత్రసల్పుచు ఆంగ్లేయులు ఏడాదికి ముప్పది మిలియను పౌనులను వ్యయముచేయుచున్నారు. దేశమున ఉన్నవారు ప్రయాణముల నిమిత్తము తొంబది మిలియను పౌనులను ఒక్క సంవత్సరమునకు వెచ్చించుచున్నారు.

—ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్.

* * * *

## లోర్డిస్ తీర్థ మాహాత్మ్యము

'లోర్డిస్' అనునది ఫ్రెంచిదేశమునందలి ఒకతీర్థము. 1858-వ సంవత్సరమున ఫిబ్రవరి 11-వ తేదీ మధ్యాహ్నము ఒక బాలికకు పూని ఆ తీర్థమున అమ్మవారు ప్రత్యక్షమైనదని అచ్చటివారి నమ్మకము. ఆ ప్రత్యక్షమైన క్రొత్తలో ఆరుమాసముల లోపున అమ్మవారు మొత్తము పదునేడుమారులు ప్రత్యక్షమయ్యెను. ఈ అమ్మవారు ప్రత్యక్షమైనపుడే అచట ఒక జలగుండము ఏర్పడెను. ఆ గుండమునందలి జలము రోగనివారణమున అత్యద్భుత మహిమగలదను పేరు ప్రబలెను. జనులు విఱుచుకొని వచ్చువారు. అచటగల బిషప్ కొందఱు శాస్త్రవేత్తలను రావించి ఆ జలమును పరీక్షింపచేసెను. మూడు సంవత్సరములు పరీక్షించి ఆ శాస్త్రవేత్తలు ఆ జలమునందు ఏదో అద్భుతమహిమ గలదని నిర్ణయించిరి. ఏబది సంవత్సరములలో అచటికి నాలుగు వేల మంది రోగులువచ్చి రోగవిముక్తి నందిరి. ఏడాదికి ఆతీర్థపు రైలుస్టేషనునందు 1,000 000 మంది యాత్రికులు దిగుదురు. అచటికివచ్చి రోగమును మాన్పుకొనిన నిదర్శనములలో ఈక్రింది మూడును ఆశ్చర్యకరములైనవి. రెడ్ కార్ నందలి కోథామ్‌రోడ్డునకు చెందిన మిస్ మార్గరెట్ హీలీ రోగగ్రస్తయయ్యెను. ఆమె వయస్సు ఇరువదియైదేండ్లు. ఆమె రోగముతో మంచముపట్టెను. అయిదున్నర వత్సరములు ఆమె కాలు క్రిందపెట్టలేదు. ఆమెరోగము నిదానముచేయుటకు డాక్టర్లు అసమర్థులైరి. అట్టిస్థితిలో ఆమె లోర్డిస్ తీర్థమునకు తీసికొనిపోబడెను. అచ్చట కొద్దిదినములు ఉండుసరికి ఆమె పూర్తిగ నిరామయురాలయ్యెను. ఆమె స్వగ్రామమునకు తిరిగివచ్చినపుడు స్టేషనునందు ఆమెకు స్వాగతమీయవచ్చిన బంధువులు ఆమె రైలునుండి కేళింతాలు కొట్టుచు దిగుటచూచి చాల ఆశ్చర్యపడిరి. అప్పటినుండి ఆమె నేటివఱకు జబ్బున చీది ఎఱుగదు. గాస్‌ఫోర్తు న్యూకాసిల్‌కు చెందిన మిస్ ఎమ్మాజాన్సను అను ఆమెకు క్షయరోగము తగిలెను. ఆరోగముతో ఆమె పలువత్సరములుగ తీసికొనుచుండెను. పఱుపుమీదనైనను ఆమెలేచి కూర్చుండలేని స్థితి

లో నుండెను. ఆమె లోర్డ్సు తీర్థమునకు స్ట్రెచరు పై గొనిపోబడెను. ఆతీర్థము చేరినతోడనే ఆమె స్ట్రెచర్ పైనుండిదిగి క్రొత్తసత్తువతో నడువసాగెను. ఇది చాల ఆశ్చర్యమును కలిగించెను. నెస్టుహార్టిల్ పూల్ నందలి రాడ్నీ వీధిలోని జాన్ క్రాస్లీ అను నతను రెండుసారులు మోటారు ప్రమాదములకు గురియయ్యెను. అందుచేత అతని వెన్నెముకయొక్క దిగువభాగము చితికిపోయెను శరీరము పక్షవాతమునకు గురియయ్యెను. 1924-వ సంవత్సరము సెప్టెంబరు 18 వ తేదీని అతడు లోర్డ్సు తీర్థమునకు గొనిపోవబడెను. తోడనే అతనికి రోగము కుదిరెను. నేడు అతడు ఆరోగ్యవద్దేహుడైయున్నాడు. తీర్థములలో ఇట్టిమహత్తు గలదు.

—ది పీపుల్.

* * * *

## రోగసమయమున దైవప్రార్థన ప్రయోజనము.

రోగములందు ముఖ్యముగ క్రిమికారక రోగములందు రోగి రోగవిముక్తి నొందుటకు దైవప్రార్థన అమోఘముగ పనిచేయుననుట నమ్మదగిన విషయమే అని నిరూపించుట మన ప్రథమ కర్తవ్యము. ఈ నిరూపనము సులభముగనే చేయవచ్చును. క్రిమిశాస్త్రజ్ఞులందఱును క్రిమికారక రోగముల హెచ్చుదల క్రిముల యొక్క సంఖ్య, వాని దాడియొక్క ఒత్తిడిమీదనే గాక రోగియొక్క రోగనిరోధకశక్తిమీద కూడ విస్తారముగ ఆధారపడియుండును. పలువిషయములందు డాక్టర్లు ఏకాభిప్రాయమునకు రారు. కాని డాక్టర్లు అందరును ఒకని రోగనిరోధకశక్తి ఆతని మనస్సుయొక్క స్థితిమీద ఆధారపడియుండునని అంగీకరింతురు. డాక్టర్లేకాదు సామాన్యులుకూడ ఈ అభిప్రాయమును సమ్మతింతురు ఈ విషయమై ఈజిప్టు దేశమున ఒక కథగలదు. ఒకసారి ఈజిప్టుదేశమునందలి కెయిరో పట్టణమునకు ప్లేగుదేవత పోవుచుండగా ఆమెను ఒకడు కలిసికొని 'ఓ, ప్లేగుదేవతా! నీవు ఎచ్చటికి పోవుచున్నావు. అని అడిగెను. దానికి ప్లేగు దేవత ఇట్లు బదులుచెప్పెను. 'నేను కెయిరో పట్టణమునకు పోవుచున్నాను. అచ్చట ఒక వేయిమందిజనులను చంపుటకు పోవుచున్నాను. తిరుగు ప్రయాణమున ఆతడు తిరిగి ప్లేగుదేవతను కలుసుకొనెను. 'వేయిమందిని మాత్రము చంపుదునని చెప్పి పదివేలమందిని చంపినావేమి?' అని ఆతడు ఆ దేవతను ప్రశ్నించెను. దానికి ప్లేగు అమ్మవారు ఇట్లుచెప్పెను. 'నేను ఒక్కవేయి మందిని మాత్రమే చంపితిని. మిగిలిన తొమ్మిదివేల మందియు భయముచేతనే చనిపోయిరి.' కావున రోగి అనవసరభావములచే ఉద్రిక్తుడైనను, ఆతని మనము భయమునకు నిలయమైనను, ఉద్యోగము ఊడిపోవునేమోయను సంశయముచే పీడితుడైయున్నను, తాను చనిపోవుచో సతియు సంతానము నిరాధారులై పోవుదురను వ్యాకులమున్నను అట్టిరోగి నిరామయుడగుటకు పెక్కుదినములు పట్టును; ఆతని ఆయుర్దాయమునకు కూడ భంగము కలుగవచ్చును. వ్యాకులమనునది శరీరమును తినివేయును; సుఖనిద్రకు వేరుపురుగు అగును; జీర్ణశక్తిని తగ్గించును, ఆకలిని మందగింపజేయును; కొందఱు శాస్త్రజ్ఞుల దృష్టిలో అది మైకమునుకూడ కలిగించును. రోగి అట్టిస్థితిలోనుండగా ఆతని రోగము నెమ్మదించుట ఎట్లు? ఆతనికి చిత్తశాంతి కలుగుట ఎట్లు? అట్టి సమయములందు హృదయపూర్వకమగు దైవప్రార్థన చిత్తశాంతిని కలిగించి రోగికి ఒకవిధమగు ఉత్సాహమును పుట్టించును. రోగి తన విషయమంతయు కరుణామయుడగు భగవంతుని హస్తములందే యున్నదని నమ్మినవాడగుచో ప్రార్థనయొక్క ప్రయోజనము అనంతమైయుండును. దైవముపై భారమువైచిన రోగికి ఆతురత, వైకల్యము ఉండవు ఆతనికి కొలదియిడరాని చిత్తశాంతికలుగును. కలిగిన చిత్తశాంతివలన ఆతనికి నిద్రకూడ కలుగును. సుఖనిద్ర రోగముయొక్క శీఘ్రనివారణమునకు దోహదము చేయును. కావున రోగసమయమున రోగియు, రోగి దగ్గఱ యుండువారును దైవప్రార్థన గావించుచుండుట చాలమంచిది.

—ది ఇంక్వైరర్.

# ఆరోగ్య విజ్ఞానము

### ౯. పొగాకును సేవించుట మృత్యువును ఉపాసించుటయే:—

పొగాకునందు కోపస్వభావమును పెంపొందించు గుణము కలదు. దానిని విరళముగా సేవించువారు ప్రాయకముగా కోపస్వభావము గలవారై యుందురు. పాశ్చాత్య నాగరికత మన దేశమునకు ప్రసాదించిన వానిలో ఈ పొగాకు ఒకటి. పొగాకునందు నికోటిన్ అను ఒకజిడ్డు విషపదార్థము ఉండును. దాని పచ్చి రసములోని ప్రతిబిందువును ప్రాణహానికరమైనదే అని చెప్పవలసి యున్నది. పొగాకు ఎండబెట్టుటవలన దాని విషము కొంతతగ్గును. కావుననే దానిని సేవించునపుడు ఆ విషప్రభావము కనబడదు. కాని అది మెల్ల మెల్లగా శరీరమును పాడుచేయును. పొగాకు నములుటచేత అజీర్ణము, నోటివాసన, దంతములు వికారమగుట, అతిసారము గ్రహణి పుట్టును. మఱియు పొగాకు నములువారు తఱుచు ఉమ్మివేయు నలవాటుకు లోనగుదురు. ఇదియొక చెడు అలవాటు. సభ్యలోకమునకు అసహ్యము పుట్టించునది ఈ అలవాటు. పొగాకు నశ్యము పీల్చుటవలన ఒకప్పుడు జలుబు తలనొప్పి తగ్గినట్లు కనిపించును గాని చిరకాలము ఉపయోగించుటవలన ముక్కునందును కంఠమునందును రోగములుపుట్టును. చుట్ట కాల్చుట, హుక్కా పీల్చుట, చిలుము పీల్చుట, సిగరెట్టులు బీడీలు త్రాగుటవలన పొగాకులోని విషము పొగరూపమున లోనికిపోయి వారి మెదడును పాడు చేయును. క్షయ, ఉబ్బసము మొదలగు ఊపిరితిత్తుల వ్యాధులను పుట్టించును. పొగాకు క్రొత్తగా ఏరూపమునగాని సేవించినచో వాంతి కలుగును. ఇందుచే పొగాకు సేవనము ప్రకృతి విరుద్ధమని నిర్ణయింపవచ్చును. సేవన ప్రారంభమున కొంతకాలమువఱకు శరీరమునకు ఒకవిధమైన మైకమును కలిగించినను కాలక్రమమున శరీరమును తెల్లబఱచి పాండు మొదలగు రోగములను కలిగించును. పొగాకు సేవించువారి నాడి ఎల్లప్పుడు అతిచుఱుకుగాను, వేడిగాను ఉండును. పొగాకు నేత్రములకు హానికలిగించును. పొగాకు త్రాగుటనుగూర్చి గాంధి మహాత్ముడు ఇట్లు చెప్పుచున్నాడు: 'బీడీ త్రాగుటవలన ఆకలి మందగించును, నోటికి దుర్వాసన కలుగును, దంతములు గారపట్టి వికారరూపమునందును, నోట పొక్కులుపుట్టును. ఆరోగ్యమును కోరు మానవుడెవడును పొగాకును ముట్టరాదు. దిగుమతి యగుచున్న పొగాకు వస్తువులకు మనము ప్రతివత్సరము కోట్లకొలది రూపాయలిచ్చుచున్నాము. ఆరోగ్యనష్టము, ధననష్టము మనకు ఈ పొగాకువలన కలుగుచున్నది.'

—దోసేపూడి బ్రహ్మానందశాస్త్రి.

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవిత భీమా : కొన్ని ఆలోచనలు

౪

## భీమా ఏజెంటు

ఆంధ్రదేశంలో, పల్లెటూర్లలో సహితం. యిన్సూరెన్సు ఏజంటును చూడనివాండ్లు లేరని చెప్పితే అతిశయోక్తి కాదు. మన దేశంలోవున్న కంపెనీల తాలూకు ప్రతినిధులు, దేశంలో మూలమూలకు అల్లుకున్నారు. ఎవరిచేత నైనంతవరకు వారు వ్యాపారం సాగిస్తున్నారు. కాని భీమా ప్రతినిధి అంటే, దేశంలో చాల ఏవగింపు కూడ హెచ్చయింది. భీమా అంటే ఏమిటో తెలియని రోజుల్లో చచ్చిపోతామేమొ అనే భయం చూపించేవారు. ఇప్పుడు భీమాఏజంటు అంటే భయం చూపించుచున్నారు. అదిగాక యీ మధ్య కొన్ని పత్రికలు, భీమా ఏజంటు అంటే పనిలేనివాండ్లు Unemployed అనే అర్థం వ్రాశారు. దీనినిబట్టి దేశంలో భీమా ప్రతినిధి అంటే గౌరవం ఎంతవున్నదో అర్థమవుతుంది.

నిజమాలోచిస్తే యిప్పుడు మనదేశంలో యహీనమైన గౌరవం పొందుచున్న, ప్లీడరీ, వైద్యం, వ్యాపారం, మొదలగు వృత్తులలో సమానమైనదీ భీమా ప్రతినిధిత్వం అని తేలుతుంది.

మొదట వ్రాయబడిన రెండువ్యాసాలు బాగా చదివి అర్థంచేసికొనిన వాండ్లకు, యీ వ్యాపారంకూడ లోకోపకారియని తెలియకపోదు. వైద్యుడు డబ్బుతీసికొని నా ప్రాణం దక్కిస్తాడనే భావంతో ఏలా గౌరవపాత్రుడౌచున్నాడో, అలాగే భీమా కంపెనీ వాండ్లుకూడ ఆపత్కాలంలో కుటుంబానికి సహాయభూతులు అవుతారని గౌరవపాత్రులే.

భీమా ఏజంటుయొక్క పని చాల బాధ్యతతో కూడుకొన్నది. ఇటు కంపెనీవారు, అటు ప్రజలు, తమ భవిష్యత్తునంతను, అతని హస్తములయందు పెడతారు. మొదట కంపెనీవారు, ఒకవ్యాళ్ళో, పలుకుబడి కల వాండ్లు తమకు ప్రతినిధులు కావలెనని ప్రకటనచేస్తారు. దాని అర్థంఏమిటీ? గౌరవం పలుకుబడిలేనివాండ్ల వలన వ్యాపారం సాగదన్నమాట. ప్రజలకు నమ్మకం కలిగించగల ఏజంటువుంటే తప్ప వ్యాపారం వృద్ధికిరాదన్నమాట. ఏజంటు తన గ్రామంలో వున్నవారిలో మంచి యవ్వనవంతులు, ఆరోగ్యవంతులుగా వున్నవారిని చూచి, వారికి అనుకూలమైన సమయంచూచి, వారివద్దకు వెళ్ళి, తన వ్యాపారసూత్రాలు, వారికి బోధించి, వారిని తనకంపెనీలో చేరవలశిందని కోరతాడు. అట్లు తాను చేర్చేమనుష్యులు, వృద్ధులు, అనారోగ్యవంతులు ఐతే, కంపెనీకి చాల నష్టంవస్తుంది. కంపెనీకి నష్టం వచ్చినదంటే, తనవృత్తికి భంగంవచ్చిన దన్నమాట!

ఇక ప్రజలు, తమ గ్రామంవాడనీ, తాము బాగా ఎరిగియున్నవాడనీ, తమను మోసంచేయడనేభావంతో అతను చెప్పిన కంపెనీలో చేరుతారు, గనుక భీమా ఏజంటు తన కంపెనీయొక్క మంచిచెడ్డలు, తన వ్యాపారంలోవున్న రహస్యాలు, పాలిసీదారులకు కంపెనీవారిచ్చే సదుపాయాలు, మొదలైనవన్నియు, బాగా తెలిసికొని, పాలిశీదారుల భవిష్యత్తు కంపెనీవారి చేతులో చెడిపోదనే నమ్మకం కుదుర్చుకొని, దాని ప్రతినిధిత్వం వహించాలి. ఎందుచేతనంటే కష్టపడి సంపాదించుకొన్న నాల్గుడబ్బులు, దాచుకొన్న కంపెనీ మంచిదికానియెడల సదరు కంపెనీలో చేరినవాని స్థితి ఎట్లుంటుందో చెప్పనక్కరలేదు. (సశేషం)

—జమిలి నమ్మాళ్వారు.

# ది స్టార్ ఆఫ్ ఇండియా

స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు కంపెని లిమిటెడ్ వారి 1933-వ సంవత్సరము డిసెంబరు 31-వ తేదీతో అంతమయ్యేడి ప్రథమ వార్షికనివేదిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. జనరల్ శాఖలో ఈ కంపెనీ వారు నివేదిత వత్సరమున గావించిన వ్యాపారమును తెలుపు లెక్కలను ఇచ్చట ఇచ్చుచున్నాము.

| | | | |
|---|---|---|---|
| రాబడిన వ్యాపారపు విలువ | ... | రూ. | 16,21,100 |
| పూర్తిచేయబడిన వ్యాపారపు విలువ | ... | రూ. | 11,53,600 |
| ప్రీమియము వలన రాబడి | ... | రూ. | 38,557-4-1 |
| ఈ ప్రథమవత్సరపు లైఫ్ ఫండు | ... | రూ, | 10,008-2-11 |

మదరాసు ప్రధాన కార్యస్థానముగ గలిగి వ్యవహరించుచున్న భీమాసంస్థలో పలువత్సరములుగ పనిచేయుచున్న యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సు కంపెనీని మినహాయించినచో మతియేసంస్థయు ఈ స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు కంపెనీవారు గావించినంతటి భీమా వ్యాపారమును ఈ నివేదితవత్సరమున గావింపలేదనుచో ఈ కంపెనీ అధ్యక్షుల కార్యదక్షత, ఉద్యోగుల కార్యశ్రద్ధ సులభముగ ఊహింపవచ్చును. ఈ ప్రథమ వార్షికపులెక్కలను పరిశీలించి కన్సల్టింగు అక్చ్యుయరీ యగు కె. బి. మాధవగారిట్లు చెప్పుచున్నారు: "నివేదితవత్సరమున చావులవలన క్లెయిములు లేకుండుట కంపెనీవారి వ్యాపార సౌష్ఠవమునకు చక్కని నిదర్శనముగా నున్నది. కార్యనిర్వహణ శాఖా వ్యయములు ప్రభుత్వమువారి లైఫ్ అస్యూరెన్సు కంపెనీల చట్టమునందలి నియమావళి అనుమతించు దానికంటె చాలతక్కువగ నుండుట పొగడదగినది. ఈ తక్కువ వ్యయములవలన లైఫ్ అస్యూరెన్సు ఫండుకు ఐదువేలకు తక్కువకాని సొమ్ము మిగిలినది. ప్రథమవత్సరముననే ఈ కంపెనీవారు రూ 10,000 లైఫ్ ఫండు కూర్చగలుగుట హైందవభీమా చరిత్రమున సువర్ణాక్షరములచే లిఖింపదగినది." ఇట్లు చావులవలని క్లెయిములు లేమి, మితవ్యయము, లైఫ్ ఫండు కూడిక ఈ కంపెనీ వారి భావి అభివృద్ధికి లెస్సయగు సూచనలైయున్నవి. ఇవి కార్యనిర్వాహకులు నిజముగా గర్వింపదగు విషయములు. "ఈ విషయములన్నియు గమనించితిమేని ఈ కంపెనీవారి ప్రస్తుతపు పోలసీదారులకు తృప్తి, లాభము కలుగగలవని చెప్పుటకు ఎంతమాత్రము సందేహము లేదు." అని శ్రీ కె. బి. మాధవగారు తెలిపిన వాక్యములు ముమ్మాటికి సత్యము. ఈ కంపెనీ తెలుగువారి సంస్థయగుటయు, జనరల్ భీమా ప్రారంభించిన ప్రథమ వత్సరముననే ప్రశంసనీయమగు వ్యాపారమును గావించుటయు సంతోషకర విషయములు. జనరల్ భీమావ్యాపారము క్రొత్తగ ప్రారంభించినారు. ఆర్థిక మాంద్యమను భయంకరదేవత దేశమున వీర విహారము సల్పుచున్నది. అయినను కంపెనీవారు గావించిన వ్యాపారము అత్యంత ప్రోత్సాహకరముగను, అభినందనీయముగను ఉండి కంపెనీ కార్యనిర్వాహకుల కార్యశూరతయందు ప్రజాసామాన్యమునకు గల గాఢవిశ్వాసమును ప్రత్యక్షీకరించుచున్నది. ప్రథమవత్సరమున శుభారంభము జరిగినది. శుభముగ ఆరంభింపబడినదానికి అంతటను శుభమే అను అనుభవజ్ఞులగు పెద్దలవాక్యము ఈ కంపెనీపట్లకూడ సార్థకమగుగాక యని కోరెదము.

# సంపాదకీయ సమాలోచన

## తోటపైరుల పెంపకమునకు ప్రోత్సాహము :

వరి మొదలగు పైరులవలన ఈదినముల యందు విశేషలాభము ఉండుటలేదు. కాగా రైతుదృష్టి ప్రస్తుతమున తోటపైరుల పైకి పోవుచున్నది. అయితే మామూలు సేద్యమునకంటె తోటపైరుల పెంపకమునకు హెచ్చు పెట్టుబడి వలయును. కాని ఎత్తుపడిపోయియున్న రైతు హెచ్చు పెట్టుబడి వలయు తోటపైరుల కృషికి ఎట్లు దొరకొనగలడు ? బ్రిటీషు ఇండియా ప్రభుత్వముకంటె ప్రజాక్షేమ విషయమున విశేష శ్రద్ధచూపు మైసూరు ప్రభుత్వమువారు తమ రాష్ట్రమునందలి రైతులను తోటపైరుల పెంపకమునకు ప్రోత్సహింప నమకట్టినారు స్థానిక కర్షకోద్యోగికి రయితు తాను ఏ భూమియందు ఏతోటపైరు పెంచదలచినది తెలుపుచు దరఖాస్తు పెట్టవలయును. ఆ ఉద్యోగి ఆభూమిని తనిఖీచేసి తగు ఋణము ఈయవలసినదిగా అమిల్దారునకు సిఫారసుచేయును. సిఫారసు తనకుచేరిన వారము రోజులలోగా అమిల్దారు రయితుకు ఋణమిచ్చును. ఋణమంతయు ఒక్కసారి ఈయబడదు ; వాయిదాల ప్రకారమైనను అంతయు రొక్కమీయబడదు. కొంత విత్తనముల రూపమున, కొంత ఎరువు రూపమున, కొంత ఇతర పనిముట్ల రూపమున ఈయబడును. అప్పటప్పటి ఖర్చులకు సరిపడు సొమ్ము అప్పటప్పట ఈయబడును. ఐదు యకరముల పరిమితిలోపు భూములకే ఇట్టి అప్పులీయబడును. ఆభూమియు, ఆభూమియందలి ఫలసాయమును ఈయబడిన అప్పు మొత్తమునకు తనఖా. సొమ్ము సాధారణముగ మూడు వత్సరములలో తిరిగి ఇచ్చివేయవలసియుండును. కాని కొబ్బరి, పోక మొదలగు తోటల విషయమున చెట్లు కాపుపట్టిన పిమ్మటనే బాకీ మొత్తము చెల్లు పెట్టించుటకు ప్రారంభము చేయవచ్చును. ఇన్ని సౌకర్యములు రయితునకు కలిగించి ఆతనిని తోటపైరుల విషయమున సుముఖునిగాను, సమర్థునిగాను చేయుటకు మైసూరు ప్రభుత్వమువారు సంకల్పించినది ఎంతయు సంస్తవనీయమై యున్నది. బ్రిటీషు ప్రభుత్వమువారుకూడ ఈ విధానమును అవలంబించుట దేశక్షేమకరమగు విషయము,

## కమీషనరు ఉన్ననేమి ?

తాలూకాబోర్డులు ఎత్తివేయుటలో ఎందఱికో ఉద్యోగములు ఊడినవి. వారికి సాధ్యమగునంతవఱకు జిల్లా బోర్డులయందును, మునిసిపాలిటీలయందును అవకాశమునుబట్టి ఉద్యోగము లీయబడవలయునని గవర్నమెంటువారి తాఖీదుగలదు. ఇట్టి పరిస్థితులలో రాజమండ్రి మునిసిపాలిటీవారు ఒక క్రొత్తవానిని తెచ్చి నెలకు ముప్పది రూపాయిల వేతనముమీద పెర్మనెంటు క్లార్కుగా నియమించినారని వినుటకు చాల ఆశ్చర్యముగ నుండును. రాజమండ్రియందలి న్యాయవాద ప్రముఖులలో నొకరును, మునిసిపలు సంఘసభ్యులును అగు దేవత శ్రీ

రామమూర్తిగారు ఈ ఉద్యోగవిషయమై మునిసిపలు సంఘసభయందు చర్చజరిగి నపుడు ఇట్లు తెలిపిరి : “క్రొత్తగా ఉద్యోగ పదవులను కల్పించి వానిని కౌన్సిలు మెంబర్ల చుట్టములకు ఇచ్చుచున్నారు. ఈపద్ధతి వలన అనవసరమైన ఉద్యోగ పదవులు కల్పింపబడుచున్నవి; అక్కరకు రాలిన వారు ఉద్యోగులగుచున్నారు ; ప్రజాద్రవ్యము ఇట్లు దుర్వినియోగ మొనర్పబడుచున్నది.” కమీషనరు ఉన్నను రాజమండ్రి మునిసిపాలిటీయం దిట్టివి జరుగుచుండుట నిజముగా శోచనీయమైనది

## బాలికలకు చదువువద్దు, ఘోషాలో పెట్టుడు:

పై వాక్యములు పూర్వాచార పరాయణుని నోట వినుటకు మనము నేడుక్రొత్త ఆశ్చర్యము పొందము. కాని భాయి పరమానందునివంటి సుప్రసిద్ధ భారత జాతీయ నాయకునినోట ఆమాటలు వినుట నిజముగ ఆశ్చర్యకర మయినదే. అయితే ఇచ్చట కలుగు ఆశ్చర్యము మనలను ఆలోచనాధీనులనుగా చేయును. భాయి పరమానందుడిట్లు చెప్పుటకు కారణమేమి అని ప్రతివారును ఆలోచింతురు. “ఉత్తర హిందూస్థానమున హైందవ బాలికాపహరణములు ప్రస్తుతము విరళములయినవి. హిందువులు జాత్యభిమాన పూరితులయి గుండాలచేతుల బడకుండ తమజాతి బాలికలను కాపాడుకొనుట నేర్చుకొను వఱకును హిందూ బాలికలను బయటికిపంపి చదువు చెప్పింపరాదు, వారిని ఘోషాయందే పెట్టవలసియుండును. తమ నాగరికత, విజ్ఞానము, గౌరవము నాశనము చేయబడుచున్నపుడు హిందువులు ప్రతిక్రియ నాలోచింపక యూరకుండుట అవమానములకెల్ల పెద్ద అవమానము.” అని పరమానందుడు పలుకుచున్నాడు ఉత్తర హిందూ దేశమున ప్రతి హైందవుని హృదయమున ఈ పలుకులు ప్రతిధ్వనించు చున్నవి.

## విద్యాహీనతను పోద్రోలుటకు మార్గము:-

నిర్బంధ ప్రాథమికవిద్య, నిర్బంధ ప్రాథమికవిద్య అని పలవరించుచునే గోఖ్లే మహాశయుడు పరమపదించినాడు. ఏవో కొన్ని మునిసిపలు పట్టణములందు తప్ప మిగిలిన గ్రామ సీమలయందు నిర్బంధ ప్రాథమిక విద్య అసలునందు లేదు. హిందూ దేశము మొత్తముమీద నూటికి పదిమందిమాత్రము చదువను వ్రాయను నేర్చినవారు. మిగిలిన తొంబది మందియు అజ్ఞానాంధకారమున మునిగి అటమటించుచున్నారు. శ్రీయుత శొంఠి వెంకటరామమూర్తిగారు ఈ నడుమ సేలమునందు దేశమునుండి ఈ అవిద్యను తొలగించు ఉపాయమునుగూర్చి ఇట్లు ముచ్చటించిరి : ‘నూటికి తొంబదిపాళ్ళు వ్యాపించియున్న ఈ అవిద్యను తొలగించుటకు మనకు విద్యావంతులగు సయినికులు కావలసియున్నది. విద్యావంతుడగు ప్రతివాడును నిర్బంధముగా ఒక్క సంవత్సరము ఉపాధ్యాయుడయి చదువురాని వారికి విద్యాదానము గావించునట్లు చేయవలయును.’ ఇదియెంతయు అనుసరణీయమగు పద్ధతి. ప్రభుత్వము వారు పర్యాలోచింపవలసియున్నది.

## స్టార్ ఏజెన్సీ బులెటిన్.

కొద్ది వత్సరములకు పూర్వము యినూనైటెన్సు ఏజెన్సీ కొందఱు తీరికసమయములందు చేయు వ్యాపారముగ ఉండినది. ప్రస్తుతమది పలువురి పూర్తికాల వినియోగ

మును కోరు ప్రత్యేకవృత్తియై యున్నది ప్రతిప్రత్యేకవృత్తికివలెనే భీమాఏజెంటు వృత్తికి కూడ కొంతట్రెయినింగు అవసరము కాని అట్టి ట్రెయినింగుకు ప్రస్తుతములో మన దేశమున అవకాశములు లేవు ఈ లోపమును కొంతకుకొంత తొలగించుటకు మదరాసునందలి స్టార్ ఆఫ్ ఇండియా ఇన్స్యూరెన్సు కంపెనీవారు స్టార్ ఏజెన్సీ బులెటిన్ అనుపేర ఒక నెల వారీ సంచికను ప్రచురింప తలపెట్టినారు. ఈసంచికవలన వారు తమ ఏజెంట్ల భీమావిషయిక విజ్ఞానమును పెంపొందించుటయేగాక మాతృసంస్థకును వారికిని సన్నిహిత సంబంధము కలిగించుటకును మంచివీలు ఉండును. ఏజెంట్లకు ఈబులెటిన్ ఉపాధ్యాయుడుగా, ఉపదేశకుడుగా ఉండి,వారిపాలిటి విజ్ఞాన సర్వస్వము కాగలదు. జూలై సంచికయందు జయకాంక్షియగు ఏజెంటు మెలగవలసిన తీరు చక్కగ వివరింపబడినది. జీవితభీమావలని లాభములు క్లుప్తముగ పేర్కొనబడినవి. భారతదేశమున భీమావిజ్ఞాన ప్రబోధమునకు ఎంతయేని అవకాశముగలదు. ఆప్రబోధము యిన్స్యూరెన్సు వ్యాపారమున షష్టిఘడియలు మగ్నులై యుండు కంపెనీ అధికారుల యాజమాన్యముననే జరుగుట దేశకళ్యాణ కారకము కాగలదు. ఇన్ని కారణములచే మేము ఈ స్టార్ ఏజెన్సీ బులెటిన్‌కు మనః పూర్వకముగు స్వాగతము చేయుచున్నాము. భీమా వ్యాపారమున కొలది యిడరాని అనుభవము గల శ్రీ యం. యస్. ఆర్. ఎ. గుప్తగారి విశిష్ట పరిశీలనమున వెలువడుచున్న ఈ బులెటిన్ విషయపుష్టి, ఆకారరేఖనంది ప్రశంసనీయముగ భీమాప్రచారము గావింపగలదని నమ్ముచున్నాము.


# దిస్టార్ ఆఫ్ ఇండియా

ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరన్సు
కంపెనీ, లిమిటెడ్. మదరాసు.

1936 - అభివృద్ధిదశ

| | | |
|---|---|---|
| చేరిన వ్యాపారము | రు. | 16,21,000 |
| పూర్తిచేసిన వ్యాపారము | ,, | 11,53,600 |
| దాదాపు ఆస్తులు | ,, | 2,00,000 |
| గవర్నమెంటు హామీలో పెట్టుబడి | | 95,700 |
| చెల్లించినక్లెయిములు (ఇండస్ట్రియల్ స్కీములు) | | 1,80,000 |

**నిజమయిన లక్షణము**

"ఒక జీవితభీమా సంస్థయొక్క పటుత్వము, ప్రతిపత్తి, మానవసేవ మున్నగు లక్షణములను పెద్దపెద్ద సంఖ్యలవరుసలు నిదర్శనము కాదు. వానికి ముఖ్యముగా కావలసినవి మూడువిషయములు. యాక్చ్యురీచే నిర్ణయింపబడిన మొత్తమునకు తక్కువలోనే ఖర్చులను చేయుట. ప్రీమియము నికరాదాయముకంటె యెక్కువగా వడ్డీలాభమును గడించుట. తక్కువ మరణసంఖ్య ఈ మూడువిషయములను పరిశీలించి చూచినయెడల కంపెనీవారు ప్రశంసాపాత్రముగ పనిచేయగలిగిరని చెప్పవచ్చును. మొదటిసంవత్సరమున ఖర్చులదామాషా యాక్చ్యుయరీగారి నిర్ణయమొత్తముకంటె చాల తక్కువగా నున్నది. హైందవ జీవితభీమాకంపెనీల చట్టముప్రకారము గావింపబడిన 1930, గవర్నమెంటు ఆఫ్ ఇండియా (సెం. 6 (1) రూల్సు దాఖలా అలవెన్సుకంటె సైతము చాల తక్కువగానే యున్నది. ప్రీమియములో నికరాదాయము అంచనా వేయబడిన నూటికి 4 కంటె వడ్డీలాభము 5.28 భాగములు యెక్కువగానే లభించినది. మొదటి సంవత్సరమున క్లెయిములు లేకుండుటయే మరణ సంఖ్యానుభవమునకు ప్రత్యక్ష నిదర్శనము."

(పీస్ గార్డియన్ జూలై 1934)

క్రమాభివర్ధితమగు కంపెనీ ననుసరింపుము

ప్రాస్పెక్టసులకు, ఏజన్సీషరతులకు
యం.యన్.ఆర్.ఎ. గుప్త, మేనేజింగు ఏజెంటు,
23, 24 సెకండులైన్ బీచి, మదరాసు.

# పోటీబహుమానము —రూ. 10—

## సంఖ్యా పజ్‌ల్

గుణింతముల కొసగబడిన సంఖ్యలు:—

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| అ | = | 1 | ఉ | = | 5 | ఒ | = | 10 |
| ఆ | = | 2 | ఊ | = | 6 | ఓ | = | 11 |
| ఇ | = | 3 | ఎ | = | 7 | ఔ | = | 12 |
| ఈ | = | 4 | ఏ | = | 8 | ం | = | 13 |
| | | | ఐ | = | 9 | | | |

ఒక్కొక్క పదము కనిపెట్టుటకు మూడు సూచన లీయబడినవి. ఉదాహరణము : 1. — — — — ఋతువు. (21) మొదటనున్న గీతలనుపట్టి, యిది నాలుగు అక్షరముల పదమని తెలుసుకొనవలెను. ఆ అక్షరముల పైనున్న గుణింతముల సంఖ్యామొత్తము 21. ఇక, ఋతువు అను ముఖ్యసూచన ఆ పదమునకు సరిపోవలెను. కనుక సమాధానము : వసంతము.

| పదములోని అక్షరము. | దానిపైనున్న గుణింతము. | గుణింతముల కొసగబడిన సంఖ్య. |
|---|---|---|
| వ......... | అ......... | 1 |
| సం......... | అ......... | 1 |
| | ం......... | 13 |
| త......... | అ......... | 1 |
| ము ......... | ఉ......... | 5 |
| | | **21** |

ఇట్లే తక్కిన పదములను కనిపెట్టి, కాపనులో వ్రాసి, ఆగస్టు 20 వ తేదీ లోపున 'ఆంధ్రభూమి'కి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకునివద్ద ఒక సీలుకవరులో ఉంచబడినవి పైమాసము సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు పంపినవారికి 10 రూ. బహుమాన మీయబడును

షరా : సమాధానములు కాపనులో వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు కూడదు. ఒక్కొక్కరు ఎన్ని కాపనులయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చుకాపనుకు అణా చొప్పునను, వ్రాత కాపనుకు 2 అణాల చొప్పునను (పోస్టు బిళ్ళలు) ప్రవేశరుసుము.

## సంఖ్యా పజ్‌ల్

1. — — — — ఋతువు (21)
2. — — — నీటబుట్టు పువ్వు (7)
3. — — — — — పురాణ గ్రంథము (11)
4. — — మచ్చిక జంతువు (6)
5. — — — — బీహారు ప్రళయము (26)
6. — — — రోగులకు హితవుగానుండు ఫలము (6)
7. — — — — తిథి (14)
8. — — — చచ్చినమగని బ్రతికించుకొనగలిగిన పతివ్రత (౮)

| | | |
|---|---|---|
| 9. | — — — — | విలుకాడు (12) |
| 10. | — — — | నది (13) |
| 11. | — — — — | సంస్కృత కవి (11) |
| 12. | — — — | పక్షి (9) |
| 13. | — — — — | దేవతలు వలచిన రాకుమారి (19) |
| 14. | — — — | మహాఋషి (9) |
| 15 | — — — — | ఈమె పాటలు 'గ్రామఫోను'లో వినవచ్చును. (7) |
| 16. | — — — | తెలుగు మాసపత్రిక (6) |

---

## కూపను

## సంఖ్యా పజిల్ సమాధానములు.

| | | | |
|---|---|---|---|
| 1 | వసంతము | 9 | ...... |
| 2 | ...... | 10 | ...... |
| 3 | ...... | 11 | ...... |
| 4 | ...... | 12 | ...... |
| 5 | ...... | 13 | ...... |
| 6 | ...... | 14 | ...... |
| 7 | ...... | 15 | ...... |
| 8 | ...... | 16 | ...... |

సంపాదకుని తీర్పును అంగీకరింతును

పేరు.......................................

విలాసము.......................................

........................................

కామశాస్త్రము ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుఁగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూఁడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాఁతలుకావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాఁబట్టి దీనిగొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

ఆంధ్రభూమి

సంవత్సరపు చందా
రూ. 3—0—0.

# జయవిజయ యిన్సూరెన్సు కంపెనీ,
## లిమిటెడ్

(పూర్వపు జయభారత్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.)


సామాన్యజనుల కుపయోగపడునట్లు
నెలవాయిదాల పద్ధతులతో, ధారాళమగు షరతులతో,

## నూతన పద్ధతుల నేర్పాటు చేసినది

నిరుద్యోగులకు మంచియవకాశము.
ఏజన్సీ షరతులకు హెడ్డాఫీసుకు వ్రాయుడు.

**5-104 ఆర్మీనియన్ వీధి, మదరాసు.**

**Tri-Colour Process Blocks**




**M C Appaswamy Chetty & Co.**
PROCESS ENGRAVERS
64 Savarimuthu St Mannady MADRAS

# రామప్రియ

(గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన
**తాత కృష్ణమూర్తి, బి ఏ; యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు, వెల 12 అణాలు

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

**తాత కృష్ణమూర్తి, భద్రాచలం.**



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమునో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలుపడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్థకౌషధము.

## జీవామృతము

(ప్రాణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

### ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీధి, తపాలుపెట్టె287,

మదరాసు.

# ది సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్స్యూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని పాలసీదారులే వాటాదారులగుట.

మీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్స్యూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# ది స్టార్ ఆఫ్ ఇండియా

## ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

23, 24 సెకండులైన్ బీచి, మదరాసు.

1933 - అభివృద్ధిదశ

| | | | |
|---|---|---|---|
| చేరిన వ్యాపారము | రు. 16,21,000 | గవర్నమెంటు హామీలలో పెట్టుబడి రు. | 95,700 |
| పూర్తిచేసిన వ్యాపారము | ,, 11,53,600 | చెల్లించినక్లెయిములు | |
| దాదాపు అస్తులు | ,, 2,00,000 | (ఇండస్ట్రియల్ క్లెయిములు) | 1,80,000 |

యాక్చుయరీగారి అభిప్రాయము.

1. కార్యనిర్వహణవ్యయములు ప్రీమియము ఆదాయములో నూటికి 77-24 వంతున చేయబడినవి. ఇది భారతప్రభుత్వమువారు అనుమతించిన దామాషాకంటె చాలభాగము తక్కువగానే యున్నది.

2. మొదటిసంవత్సరములో, సంవత్సరాదాయమునందు నూటికి 25 36 వంతున్నూ, మొదటిసంవత్సరములోనే భీమా మొత్తములో దాదాపు నూటికి ఒకభాగమున్నూ కలిగిన రు 10,000 ల జీవితనిధి గమనించినచో, హైందవజీవిత భీమాసంస్థల చరిత్రములో ఈ విషయము అద్వితీయముగా గోచరింపకమానదు.

3. అస్తికి, 'ఆర్గనైజేషన్ అకౌంటు' అదనపు ప్రారంభవ్యయములు మొదలైన బాపతులు యేమి లేకుండుట ప్రశంసార్హమైన సంగతి. దీనివలన లెక్కల విస్పష్టత గోచరించుచున్నది.

4. స్టాక్ యెక్స్చేంజి హామీలవిలువ, మార్కెటుల విలువకంటె తక్కువగానే మదింపు వేయబడినది. ఇపుడు తీసికొన్న విలువనుబట్టి చూడగా, యీ హామీలవలన నూటికి 5-28 వంతున వడ్డీ గిట్టుచున్నది. ఈమాదిరి లాభములు కంపెనీకి సంక్రమించుట గూడ సంతోషావహమైన విషయము. పైమాదిరిగా గవర్నమెంటు హామీలలో గూడ లాభము చేకూరజాలదు.

ఈ సందర్భములన్నియు చర్చించి చూచినచో, నిర్వహణ చాకచక్యమునకు కంపెనీవారిని ప్రశంసింపక తప్పదు ప్రస్తుతపు పాలిసీదారులు, రాబోవుపాలిసీదారులు, అందరును, ఈకంపెనీ పరిస్థితులకు తృప్తి జెంది గర్వింపతలసిన అవకాశము చాలగలదు." (ప్రొఫెసర్ కే. బి. మాధవ, ఎం. ఏ. ఏ. ఐ. ఏ (లండన్) గారు వ్రాసిన జాబు నెం. 3262—24-6-34.)

మిగిలిన వివరములకు :—యం. యస్. ఆర్. ఎ. గుప్త, మేనేజింగు ఏజెంటు.



నొప్పుల నివారించుటలో బుడ్డి వెల 0-5-0.

# హనుమాన్ పెయిన్ బామ్ సుగూర్చి



మదరాసు 61. నారాయణ మొదలి వీధిలోనుండే సుప్రసిద్ధ వైద్యులును సర్జనులు అయిన

డాక్టరు

వి. చంద్రశేఖరగుప్తగారు

ఇట్లు చెప్పుచున్నారు: "హనుమాన్ పెయిన్ బామ్‌ను నేను వాడి చూచియున్నాను. తలనొప్పి, నడుమునొప్పి మొదలగు వానియందు అది చాల అమోఘముగ పనిచేసినది."

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: 1. నిజాము రాష్ట్రమునకు శ్రీయుత కాలేరు వెంటయ్యగారు, 4121 మూసాఖాక్ వీధి, సికిందరాబాదు,

2. పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటరు, శ్రీరామకృష్ణా ట్రేడింగుకంపెనీ, నరసారావుపేట.

3. శ్రీ కృష్ణా అడ్వర్టయిజింగు కంపెనీ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరిజిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీ గ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4-0 ధరకే దొరకును.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్త వ్యాధులను పోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కుపిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు,
గుంటూరు.

భారతభైషజ్యనిలయము, వేపేరి,
మదరాసు, అని వ్రాయవలెను.

## గంధర్వకళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు తియ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను పోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.
6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసీ.

320, తంబుశెట్టి వీధి, మదరాసు.